పుస్తక ప్రియులకు ఇదే మా ఆహ్వానం
38వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన
తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం), హైదరాబాద్
డిసెంబర్ 19 నుండి 29 వరకు - మ॥ 1 నుండి రా॥ 9 వరకు
నవచేతన బుక్ హౌస్
స్టాల్ నం. 292 - 295
నవచేతన పబ్లిషింగ్ హౌస్
స్టాల్ నం. 339-344
Shop online through our website navachethanabooks.in

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

కార్మికులతో ఎక్కువ గంటలు పనిచేయించనున్న లేబర్ కోడ్‌లు 06

పార్లమెంట్ నిరవధిక వాయిదా 05

సంపుటి 09, సంచిక: 24 | శనివారం | 20-12-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## ప్రభాకర్‌రావు కస్టడీ పొడిగింపు

- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఈనెల 25 వరకు పొడిగించిన సుప్రీం కోర్టు
- మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, మాజీ ఎస్ఐబి చీఫ్ ప్రభాకర్‌రావు కస్టడీని సుప్రీం కోర్టు ఈనెల 25 వరకు పొడిగించింది. విచారణకు ఆయన తరువాయి 2లో

# అడవులు వీడి జనంలోకి..

## రాష్ట్రంలో 41 మంది మావోయిస్టుల లొంగుబాటు

- ఆయుధాలతో పాటు భారీ మందుగుండు సామగ్రి అప్పగింత
- 'ఆపరేషన్ కగార్' ముగింపులోపే లొంగిపోండి
- మావోయిస్టులకు డిజిపి శివధర్‌రెడ్డి పిలుపు




ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం మొదలు పెట్టిన 'అపరేషన్ కగార్' వచ్చే ఏడాది మార్చి 31తో గడువు ముగియకముందే ప్రభుత్వం ముందు లొంగిపోవాలని, వారందరికీ పునరావాసం కల్పిస్తామని తెలంగాణ డిజిపి బి.శివధర్‌రెడ్డి మరోసారి మావోయిస్టులకు పిలుపునిచ్చారు. తాజాగా మరో 41 మంది మావోయిస్టులు 24 ఆయుధాలతో డిజిపి శివధర్‌రెడ్డి ముందు లొంగిపోయారు. డిజిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మీడియా ముందు వారిని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ, నిషేధిత సిపిఐ (మావోయిస్టు) పార్టీకి తెలంగాణలో మరో భారీ ఎదురుదెబ్బ తగిలిందన్నారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డికెఎస్‌జెడ్‌సి)కి చెందిన 41 మంది మావోయిస్టు క్యాడర్ తరువాయి 2లో

### మళ్లీ పేలిన తూటాలు

- ఛత్తీస్‌గఢ్ బిజాపూర్‌లో ఎన్‌కౌంటర్
- రూ. 5 లక్షల రివార్డు ఉన్న మావోయిస్టు మృతి

**బిజాపూర్ :** ఛత్తీస్‌గఢ్‌లో కాల్పుల మోత మోగుతోంది. బిజాపూర్ జిల్లాలో శుక్రవారం భద్రతా సిబ్బందితో జరిగిన ఎదురుకాల్పుల్లో రూ. 5 లక్షల రివార్డు ఉన్న ఒక నక్సలైట్ మరణించినట్లు పోలీసు అధికారి తెలిపారు. భైరామ్‌గఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆద్వాడ–కోట్‌మెట అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారం మేరకు జిల్లా తరువాయి 2లో



## 'ఆదివారం' బడ్జెట్

- 2026 ఫిబ్రవరి 1న ఆదివారం
- పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడంపై సందిగ్ధత

**న్యూఢిల్లీ :** గత కొన్ని ఏళ్లుగా కొనసాగిస్తున్న పార్లమెంటరీ సంప్రదాయాన్ని మోదీ సర్కార్ పాటిస్తే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సాధారణ బడ్జెట్‌ను ఆదివారం నాడు ప్రవేశపెట్టనున్నారు. 2017 నుండి బడ్జెట్‌ను ఫిబ్రవరి మొదటి తేదీన ప్రవేశపెడుతున్నారు. అయితే 2026లో ఫిబ్రవరి 1వతేదీ ఆదివారం వస్తుంది. కాగా, ఈ విషయమై తరువాయి 12లో

## పిఎసిఎస్ చైర్మన్లు, డైరెక్టర్ల

# పాలకవర్గాలు రద్దు

### 9 జిల్లాల డిసిసిబిలు తొలగింపు

- రైతు సేవా సహకార సంఘాలకు పర్సనల్ ఇన్‌చార్జీల నియామకానికి ప్రభుత్వ అనుమతి
- పర్సనల్ ఇన్‌చార్జీ కమిటీలు తదుపరి ఆదేశాలు వచ్చేవరకు కొనసాగింపు



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో వ్యవసాయ, సహకార పరపతి సంఘాల చైర్మన్లు, డైరెక్టర్ల పాలక వర్గాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. వారి పదవీకాలం ఆగస్టు14వ తేదీతో ముగిసినట్లు స్పష్టం చేసింది. వీరితో పాటు తొమ్మిది జిల్లాల డిసిసిబిలను కూడా తొలగించింది. పిఎసిఎస్,లార్జ్ సైజ్ కోఆపరేటివ్ సంఘాలు, రైతు సేవా సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించేందుకు సహకార శాఖకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీలు ఆరు నెలల పాటు లేదా ఎన్నికలు జరిగే వరకు, ప్రభుత్వం తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఏది ముందుగా జరిగితే అంతవరకు కొనసాగనున్నాయి. కొత్తగా ఏర్పాటైన మండలాల ప్రకారం పిఎసిఎస్‌లను పునర్వ్యవస్థీకరించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తరువాయి 2లో

### 20 ఏళ్ల నాటి పథకం

# ఒక్క రోజులో భూస్థాపితం

- మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ (ఎంజి నరేగా) పథకం రద్దుపై రాహుల్‌గాంధీ మండిపాటు
- 'విబి– జి రామ్ జి' చట్టాన్ని గ్రామవ్యతిరేకిగా అభివర్ణించిన ప్రతిపక్షనేత



**న్యూఢిల్లీ :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (ఎంజి నరేగా) పథకం రద్దుపై కాంగ్రెస్ తీవ్రంగా విరుచుకుపడింది. 20 ఏళ్ల నాటి పథకాన్ని మోదీ సర్కార్ ఒక్క రోజులో సమాధి చేసిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ఎంజి నరేగా స్థానంలో కొత్తగా తరువాయి 2లో



# రామ జపంతో దగా

- కూలీల పొట్టకొట్టేందుకు మోదీ సర్కార్ కుట్రలు
- గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని ఓ స్కీమ్‌గా మార్చారు
- కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై వామపక్షాలు ధ్వజం

**'విబి జి రామ్ జి'కి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలకు పిలుపు • 22న హైదరాబాద్‌లో, 23న గ్రామీణ ప్రాంతాల్లో కార్యక్రమాలు**

ప్రజాపక్షం/హైదరాబాద్

పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి కూలీల హక్కులను కాలరాస్తూ, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా తీసుకువచ్చిన 'వికసిత్ భారత్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్లు–2025ను (విబి జి రామ్ జి) నిరసిస్తూ ఈ నెల 22న దేశ వ్యాప్తంగా జరుగుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వామపక్ష పార్టీలు ప్రకటించాయి. ఆ మరుసటి రోజు 23వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించాయి. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం శ్రీరాముని పేరుతో ప్రజలను మోసం చేస్తుందని, కూలీల పొట్ట కొట్టేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించాయి. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఒక స్కీమ్‌గా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశాయి. వామపక్ష పార్టీల రాష్ట్ర సమావేశం హైదరాబాద్‌లోని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జరిగింది. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సిపిఐ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె.గోవర్ధన్, సిపిఐ (ఎం.ఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు అన్వేష్, ఎంసిపిఐ నాయకులు గాదగోని రవి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకుడు ఆర్.వి.ప్రసాద్, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జి.నర్సింహా రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్రం తీసుకొచ్చిన 'విబి జి రామ్ జి బిల్లు' అంశంపై సమావేశంలో చర్చించారు. ఉపాధి కూలీల పట్ల కేంద్రం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరి, వారి తరువాయి 12లో

మహాత్మాగాంధీ పేరును తొలగించడం సరికాదు
సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా 03



## ఉత్తరాదిని కప్పేసిన పొగమంచు

- ఢిల్లీకి రెడ్ అలర్ట్
- 150కి పైగా విమాన సర్వీసులు రద్దు

**న్యూఢిల్లీ :** ఉత్తర భారతాన్ని పొగమంచు కప్పేసింది. దీంతో శుక్రవారం ఉదయం 100 మీటర్ల దూరంలో ఉన్న వాహనాలు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఢిల్లీకి భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రోడ్డు, రైలు, వాయు మార్గాల్లో తరువాయి 12లో

# ప్రతి ఇల్లూ లైబ్రరీగా మారాలి

- ప్రతి జిల్లా కేంద్రంలో ఏటా పుస్తక ప్రదర్శనలను నిర్వహించాలి
- ఇందుకు రూ.3 కోట్లు కేటాయిస్తాం
- స్థలం కేటాయింపునకు కృషి
- హైదరాబాద్ బుక్ ఫెయిర్ ప్రారంభోత్సవంలో మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రతి ఇల్లు ఒక లైబ్రరీగా మారి, పుస్తక పఠనం పెంపొందించేలా అందరూ బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ లాంటి కార్యక్రమాలు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని, అందుకోసం ప్రతి జిల్లాకు రూ. 10 లక్షల చొప్పున మొత్తం రూ.3 కోట్లు ప్రభుత్వం తరపున కేటాయిస్తామని మంత్రి ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన 38వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌ను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కోటి రూపాయలతో పుస్తకాలను కొనుగోలు చేసి రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాలతో పాటు మహిళ సంఘాల తరువాయి 2లో



'ఠాగూర్'కు అవమానంతో షురూ...

## మహాత్ముడికి అవమానంతో ముగింపు

పార్లమెంట్ శీతాకాల సమావేశాలపై కాంగ్రెస్ విమర్శలు

పార్లమెంట్ ఔచిత్యం క్రమంగా తగ్గడం

## ప్రజాస్వామ్యానికి తీవ్ర ప్రమాదకరం

రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ ధ్వజం 05



### గ్రామ పంచాయతీలలో

# ప్రజా రంజక పాలన

- సమస్యల పరిష్కారమే ప్రథమ ఎజెండా
- ఒంటరి పోరులో అనూహ్య విజయాలు
- కొందరు మాటలు జారడం మానుకుంటే మంచిది
- అభినందన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ అజేయ శక్తిగా నిలిచిందని, అవాకులు చెవాకులు పేలిన వారి నోళ్లు ఒక్క సారిగా మూతపడ్డాయని, గెలిచిన సిపిఐ సర్పంచ్‌లు, వార్డు సభ్యుల నిస్వార్థంగా, పారదర్శకంగా ప్రజారంజక పాలన అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నూతనంగా గెలుపొందిన సర్పంచ్‌లు, వార్డుసభ్యుల అభినందన సభ శుక్రవారం స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తరువాయి 12లో

# బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తత

- తిరుగుబాటు నేత హాది మృతితో దేశవ్యాప్తంగా నిరసనలు
- పలు ప్రాంతాల్లో ఆందోళనలు, విధ్వంసాలు
- 12 మందిని అదుపులోకి తీసుకున్న అధికారులు
- ఢాకా మూకదాడిలో ఒకరి మృతి

**ఢాకా/న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్‌లో ఉవ్వెత్తున ఎగసిపడి, ప్రభుత్వ మార్పుకు కారణమైన జులై తిరుగుబాటు ఉద్యమానికి చెందిన ప్రముఖ నేత షరీఫ్ ఒస్మాన్ హాది మృతి చెందిన నేపథ్యంలో శుక్రవారం దేశ వ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దేశవ్యాప్తంగా నిరసనలు, హింసాత్మక ఘటనలు, ఆస్తుల విధ్వంసం చోటుచేసుకున్నాయి. ఉదయం పెద్దగా హింసాత్మక ఘటనలు నమోదుకాకపోయినా, ఇప్పటికే కూల్చివేసిన ఢాకాలోని 32 ధన్మండీ భవన అవశేషాలను నిరసనకారులు ధ్వంసం చేశారు. ఈ భవనం బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు షేక్ ముజిబుర్ రహ్మాన్ నివాసంగా చారిత్రక ప్రాధాన్యం తరువాయి 2లో





# ప్రపంచం
WORLD NEWS

## ఉక్రేన్‌కు 90 బిలియన్ యూరోల రుణం
### ఇయు నేతల ఆమోదం

బ్రస్సెల్స్ : రష్యా–ఉక్రేన్ మధ్య యుద్ధ విరమణకు ప్రయత్నిస్తున్నట్టు ఒక వైపు అమెరికా ప్రకటిస్తుండగా, మరోవైపు యూరోపియన్ యూనియన్ (ఇయు) యుద్ధాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నట్టు కనిపిస్తున్నది. వచ్చే రెండేళ్లలో ఉక్రేన్ సైనిక, ఆర్థిక అవసరాలను తీర్చేందుకు 90 బిలియన్ యూరోలు (సుమారు 106 బిలియన్ డాలర్లు) వడ్డీ రహిత రుణంగా ఇవ్వ డానికి ఇయు నేతలు శుక్రవారం అంగీకరించారు. ఈ విషయాన్ని ఇయు కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా వెల్లడించారు. ఈ విషయంపై ఏకీభా వానికి వచ్చామని, 2026–27 సంవత్సరాలలో ఉక్రేన్‌కు 90 బిలియన్ యూరోల మద్దతు ఇవ్వాలన్న తీర్మానాన్ని ఆమోదించామని తెలిపారు. అయితే, ఈ నిధులు ఎలా సమీకరిస్తారన్న వివరాలను ఆయన వెల్లడించ లేదు. కాగా, ఈ రుణానికి మద్దతు ఇస్తే రష్యా ప్రతీకార చర్యలకు పాల్పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేసిన బెల్జియంకు భద్రతా హామీలు ఇచ్చేందుకు ఇయు నేతలు గురువారం రాత్రి వరకు చర్చలు జరిపినట్లు అధి కారులు తెలిపారు.

## భారత్‌తో మెరుగైన భాగస్వామ్యం
# రక్షణ విధాన బిల్లుకు ట్రంప్ ఆమోదం






న్యూయార్క్/వాషింగ్టన్ : భారత్‌తో మరింత లోతైన సహకారాన్ని విస్తరించాల్సిన అవసరాన్ని ప్రస్తావించే వార్షిక రక్షణ విధాన బిల్లుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ చట్టబద్ధత కల్పించారు. ఇండోపసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత, తెరవెనుక వ్యవస్థను బలోపేతం చేయడంలో క్వాడ్ (క్వాడ్ సెక్యూరిటీ డైలాగ్) వేదికగా ఈ సంతకం జరిగింది. 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నేషనల్ డిఫెన్స్ ఆథరైజేషన్ యాక్ట్ (ఎన్‌డిఎఎ) అమెరికా రక్షణ శాఖ, జాతీయ భద్రతా కార్యక్రమాలు, విదేశాంగ శాఖ, హోంల్యాండ్ సెక్యూరిటీ, గూఢచారి వ్యవస్థ తదితర విభాగాలకు నిధుల కేటాయింపులను ఆమోదిస్తుంది. కాగా, ఈ చట్టం శాంతి ద్వారా బలం అనే తన కార్యాచరణను అమలు చేయడంలో సహాయపడుతుందని ట్రంప్ తెలిపారు. ఈ బిల్లులో ఇండోపసిఫిక్ ప్రాంతంలో రక్షణ కూటములు, భాగస్వామ్యాలపై కాంగ్రెస్ అభిప్రాయాన్ని స్పష్టం చేస్తూ, చైనాతో వ్యూహాత్మక పోటీలో అమెరికా ఆధిక్యతను పెంపొందించేందుకు చర్యలు కొనసాగించాలని రక్షణ కార్యదర్శికి సూచించింది. ఈ క్రమంలో క్వాడ్ ద్వారా భారత్‌తో ద్వైపాక్షిక, బహుళపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడం, సంయుక్త సైనిక విన్యాసాలు, రక్షణ వాణిజ్య విస్తరణ, మానవతా సహాయం, విపత్తు నిర్వహణ, సముద్ర భద్రత రంగాల్లో సహకారం పెంచాలని పేర్కొంది. అదే విధంగా ఇండో–పసిఫిక్‌లోని మిత్రదేశాలు, భాగస్వామ్య దేశాల రక్షణ పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంచే భద్రతా పథకాన్ని ఏర్పాటు చేయాలని ఈ చట్టం సూచించింది. ఇందులో భారత్, ఆస్ట్రేలియా, జపాన్, దక్షిణ కొరియా, ఫిలిప్పీన్స్, న్యూజిలాండ్ వంటి దేశాలను భాగస్వాములుగా చేర్చే అవకాశం ఉందని పేర్కొంది. ఇంకొక కీలక అంశంగా, భారత్–అమెరికా మధ్య పౌర అణు శక్తి ఒప్పంద అమలుపై సంయుక్త అంచనాకు ఒక సంప్రదింపుల వ్యవస్థ ఏర్పాటు చేయాలని కూడా ఈ చట్టం ప్రతిపాదించింది. భారత్‌లో అణు బాధ్యత నిబంధనలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దే అవకాశాలపై చర్చలు జరపాలని సూచించింది.

### కొంతమంది నేచురలైజ్ అమెరికన్ల పౌరసత్వం రద్దు యోచన!

వలసలపై కఠిన చర్యల్లో భాగంగా, కొంతమంది సహజీకృత (నేచురలైజ్డ్) అమెరికన్ల పౌరసత్వాన్ని రద్దు చేసే యోచనలో ట్రంప్ ప్రభుత్వం ఉన్నట్లు న్యూయార్క్ టైమ్స్ నివేదిక వెల్లడించింది. రెండు రోజుల క్రితం జారీ చేసిన అంతర్గత మార్గదర్శకాలను ఉటంకిస్తూ, 2026 ఆర్థిక సంవత్సరంలో ప్రతి నెలా 100 నుంచి 200 వరకు డీనేచురలైజేషన్ (పౌరసత్వ రద్దు) కేసులను ఇమిగ్రేషన్ లిటిగేషన్ కార్యాలయానికి పంపించాలని యుఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యుఎస్‌సిఐఎస్) ఫీల్ కార్యాలయాలను ఆదేశించినట్లు నివేదిక పేర్కొంది. ప్రస్తుతం ఫెడరల్ చట్టాల ప్రకారం పౌరసత్వం పొందే సమయంలో మోసం చేసిన వారిపై మాత్రమే ఇలాంటి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అయితే తాజా మార్గదర్శకాలు ఆధునిక కాలంలో పౌరసత్వ రద్దు చర్యలను భారీగా విస్తరించినట్లవుతాయని నివేదిక హెచ్చరించింది. నిజాయితీగా దరఖాస్తుల్లో పొరపాట్లు చేసిన వారిపైనా ప్రభావం పడే అవకాశం ఉందని, ఇది చట్టబద్ధ పౌరుల్లో భయాందోళనలకు దారితీయవచ్చని పేర్కొంది. అమెరికాలో ప్రస్తుతం సుమారు 2.6 కోట్ల మంది నేచురలైజ్డ్ పౌరులు ఉన్నారని జనగణన విభాగం గణాంకాలను నివేదిక ప్రస్తావించింది. గత ఏడాది 8 లక్షల మందికి పైగా కొత్త పౌరులు ప్రమాణ స్వీకారం చేశారని, వీరిలో ఎక్కువ మంది మెక్సికో, భారత్, ఫిలిప్పీన్స్, డొమినికన్ రిపబ్లిక్, వియత్నాం దేశాల్లో జన్మించిన వారని యుఎస్‌సిఐఎస్ అంచనాలు తెలిపాయి. తాజాగా విడుదలైన మార్గదర్శకాలపై మాజీ అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. పౌరసత్వ రద్దుకు సంఖ్యా లక్ష్యాలు విధించడం రాజకీయ అంశంగా మారి, వివాదాలకు దారితీస్తుందని, అరుదైన చర్యను సాధారణ ఆయుధంగా మార్చేస్తుందని యుఎస్‌సిఐఎస్ మాజీ అధికారి సారా పియర్స్ ఆందోళన వ్యక్తం చేశారు.

## డబ్ల్యుటిఒలో భారత్‌పై చైనా ఫిర్యాదు




బీజింగ్ : ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ)లో భారత్‌పై చైనా ఒక అధికారిక పిటిషన్ దాఖలు చేసింది. దీనిలో రెండు ప్రధాన అంశాలను ప్రస్తావిస్తూ, సంప్రదింపులు అవసరమని కోరింది. ఐటిసి ఉత్పత్తులు (సమాచార–సంచార సాంకేతిక ఉత్పత్తులు)పై భారత్ ఎక్కువ సుంకాలు విధిస్తున్నదని, ఇది డబ్ల్యుటిఒ నిబంధనలకు విరుద్ధమని చైనా అంటోంది. అదే విధంగా సోలార్ రంగంలో, భారత్ తన దేశీయ కంపెనీలకు ప్రత్యేక ప్రభుత్వ సబ్సిడీలు ఇస్తోందని, ఇవి దిగుమతుల స్థానంలో దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ఉద్దేశించినవని ఆరోపిస్తున్నది. డబ్ల్యుటిఒ అనుమతించిన పరిమితుల కంటే ఇవి ఎక్కువగా ఉన్నాయని, కాబట్టి, భారత్ అంతర్జాతీయ వాణిజ్య సూత్రాలను ఉల్లంఘిస్తున్నట్టు భావించాల్సి వస్తుందని తెలిపింది. డబ్ల్యుటిఒ మార్గదర్శకాలను అనుసరించి, విదేశీ ఉత్పత్తులను, దేశీయ ఉత్పత్తులతో సమానంగా చూడాలనీ, కానీ భారత్ తన దేశీయ పరిశ్రమలను సమర్థిస్తూ, విపరీతమైన ప్రయోజనం చేకూరుస్తున్నదని ఆ ఫిర్యాదులో తెలిపింది. భారత్ తన డబ్ల్యుటిఒ వాగ్దానాలను గౌరవించాలని, ఈ సుంకాలు, సబ్సిడీలను తక్షణమే సవరించాలని కోరింది. కాగా, భారత్‌పై చైనా డబ్ల్యుటిఒలో ఫిర్యాదు చేయడం ఈ ఏడాది ఇది రెండోసారి. అక్టోబర్ మాసంలో ఎలక్ట్రిక్ వాహనాలు (ఇవిలు), బ్యాటరీలపై సబ్సిడీల అంశాన్ని ప్రస్తావించింది. భారత్ చర్యలు అంతర్జాతీయ వాణిజ్య నియమాలకు వ్యతిరేకమని చైనా పేర్కొంది. పరిశీలకులు దీనిని భారత్–చైనా మధ్య వాణిజ్య పెరుగుతున్న ఉద్రిక్తతలకు మరో ఉదాహరణగా పేర్కొంటున్నారు.

## సింగపూర్‌లో చికిత్స పొందుతూ...
# బంగ్లాదేశ్ ఉద్యమ నేత షరీఫ్ మృతి



ఢాకా : జులై తిరుగుబాటుకు చెందిన ప్రముఖ నేత షరీఫ్ ఒస్మాన్ హాది సింగపూర్‌లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. గత వారం ఢాకా నగరంలోని బిజోయ్‌నగర్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన సమయంలో గుర్తు తెలియని దుండగులు ఆయనపై కాల్పులు జరపగా, తలకు బుల్లెట్ గాయం కావడంతో పరిస్థితి విషమించిన విషయం తెలిసిందే. ఆరు రోజులుగా మృత్యువుతో పోరాడిన హాది చివరకు ప్రాణాలు కోల్పోయారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న జరగనున్న సాధారణ ఎన్నికల్లో హాది అభ్యర్థిగా ఉన్నారు. కాల్పుల్లో గాయపడిన ఆయన పరిస్థితి అత్యంత ప్రమాదకరమని వైద్యులు చెప్పడంతో మధ్యంతర ప్రభుత్వం సోమవారం ప్రత్యేక విమానంలో సింగపూర్‌కు తరలించింది. కాగా, యూనస్ హాది మృతిపై బంగ్లాదేశ్ చీఫ్ అడ్వైజర్ మహమ్మద్ యూనస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశాన్ని ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, జులై ఉద్యమానికి ముందుండి పోరాడిన ధైర్యవంతుడు హాది ఇక లేరని అన్నారు. హత్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రజలు సంయమనం పాటించాలని, చట్ట అమలు సంస్థలకు దర్యాప్తు చేసే అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. యూనస్ ప్రభుత్వం శనివారం ఒకరోజు రాష్ట్ర సంతాప దినంగా ప్రకటించింది. దేశవ్యాప్తంగా జెండాలను అవతనం చేశారు. శుక్రవారం ప్రార్థనల అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హాది భార్య, ఏకైక సంతాన బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని యూనస్ తెలిపారు. హంతకుల సమాచారం ఇచ్చేవారికి టాకా 50 లక్షల బహుమతి ప్రకటించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## మయామీకి క్రెమ్లిన్ దౌత్యవేత్త

మాస్కో : ఉక్రేన్ యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా ప్రతిపాదించిన శాంతి ప్రణాళికపై చర్చల కోసం క్రెమ్లిన్‌కు చెందిన ప్రత్యేక దౌత్యవేత్త త్వరలో అమెరికా వెళ్లనున్నారు. రష్యా సార్వభౌమ సంపద నిధి అధిపతి కిరిల్ ద్మిత్రీవ్ శనివారం ఫ్లోరిడాలోని మయామీలో అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ దౌత్యవేత్త స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్‌లతో భేటీ కానున్నట్లు అమెరికా అధికారి ఒకరు తెలిపారు. బెర్లిన్‌లో ఉక్రేన్, యూరోపియన్ నేతలతో సమావేశాల అనంతరం ఈ చర్చలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో కీవ్‌కు భద్రతా హామీలు, భూభాగ రాయితీలు సహా యుద్ధ విరమణకు సంబంధించిన అంశాలు చర్చకు వస్తాయని అధికారులు తెలిపారు. బెర్లిన్ చర్చల ఫలితాలను తెలుసుకునేందుకు అమెరికాతో సంప్రదింపులకు సిద్ధమవుతున్నామని మయామీ భేటీపై స్పందించిన క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ చెప్పారు. 2022, ఫిబ్రవరి 24న ప్రారంభమైన రష్యా–ఉక్రేన్ యుద్ధాన్ని ముగించేందుకు ట్రంప్ ప్రభుత్వం దౌత్య ప్రయత్నాలు ముమ్మరం చేసినప్పటికీ, మాస్కో–కీవ్‌ల మధ్య భిన్న డిమాండ్లు అడ్డంకిగా మారుతున్న విషయం తెలిసిందే.

క్రెమ్లిన్ షరతులను అంగీకరించకపోతే ఉక్రేన్‌లో తన ఆధీనాన్ని విస్తరించేందుకు ప్రయత్నిస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇటీవల హెచ్చరించారు. ఇదిలా ఉండగా, నాటోలో చేరే అంశంపై ఉక్రేన్ వైఖరి మారలేదని అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ స్పష్టం చేశారు.

## రైల్వేలో తొలిసారిగా కారుణ్య నియామకాల అదాలత్

ప్రజాపక్షం/హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే అధికారులు తొలిసారిగా కారుణ్య నియామకాల అదాలత్ నిర్వహించారు.సికింద్రాబాద్ డివిజన్ ప్రధాన కార్యాలయంలోని హవా మహల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. మరణించిన ఉద్యోగుల అర్హత కలిగిన కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించడానికి ఈ అదాలత్ ద్వారా పారదర్శకంగా కారుణ్య నియామకాలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్ అధ్యక్షతన ఈ అదాలత్ నిర్వహించారు. మరణించిన ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కుటుంబాలను ఆదుకునేందుకు తొలి సారిగా రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. ఈ అదాలత్‌లో మొత్తం 49 మంది కారుణ్య నియామకాలను ఆశిస్తున్న అభ్యర్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. సమస్యలను పరిష్కరించడానికి, అర్హత కలిగిన కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించడానికి జనరల్ మేనేజర్ తీసుకున్న చర్యలను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ప్రశంసించారు.



## పాలకవర్గాలు రద్దు (మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం తెలిపింది. ఇందుకు సహకార చట్టంలోని ప్రత్యేక అధికారాలను వినియోగించింది. కాగా, వ్యవసాయాభివృద్ధి, రైతు సంక్షేమం దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను (పిఎసిఎస్) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ సహకార సొసైటీల నిర్వహణకు ఎన్నికల ద్వారా పాలకవర్గాలను నియమిస్తుంది. సొసైటీల సామర్థ్యాలకు అనుగుణంగా ఒక చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు ఉంటారు. ఎన్నికైన పాలకవర్గాలు ప్రభుత్వం ద్వారా వ్యవసాయ, దాని అనుబంధ రంగాల అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి అమలయ్యే పథకాలను అందిస్తాయి. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఎన్నికల ద్వారా పాలకవర్గాలు నియమితలవుతారు. గత ప్రభుత్వంలో 2020 ఫిబ్రవరి 13న ఎన్నికలు జరిగాయి. వీటి పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరితో ముగియడంతో వారి పదవీ కాలాన్ని పొడిగించిన 6 నెలల గడువు కూడా ముగిసింది. దీంతో పాలక వర్గాలను ప్రభుత్వం రద్దు చేసింది.

## మళ్లీ పేలిన తూటాలు (మొదటి పేజీ తరువాయి)

రిజర్వ్ గార్డ్ బృందం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ నిర్వహించింది. ఈ క్రమంలో ఉదయం ఎన్‌కౌంటర్ జరిగినట్లు ఆయన తెలిపారు. ఎదురుకాల్పులు ముగిసిన తర్వాత ఎన్‌కౌంటర్ స్థలం నుండి ఒక నక్సలైట్ మృతదేహంతో పాటు ఒక .303 రైఫిల్, ఒక 9ఎంఎం పిస్టల్, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. మృతి చెందిన మావోయిస్టును ఫగ్ను మాద్వి (35)గా గుర్తించామని, అతను మావోయిస్టుల భైరామ్‌గఢ్ ఏరియా కమిటీలో సభ్యుడిగా చురుకుగా పనిచేస్తున్నాడని, అతనిపై రూ.5 లక్షల రివార్డు ఉందని ఆయన తెలిపారు. అంతేకాకుండా, ఘటనా స్థలం నుండి రెండు స్కానర్ సెట్లు, రేడియో, మెడికల్ కిట్, కార్డెక్స్ వైర్, మావోయిస్టు బ్యాగ్, కరపత్రాలు, ఇతర వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్‌రాజ్ పట్టిలింగం మాట్లాడుతూ భద్రతా దళాల సమర్థవంతమైన, సమన్వయ చర్యల కారణంగా బస్తర్‌లో మావోయిజం ఇప్పుడు చివరి దశలో ఉందన్నారు. హింసా మార్గాన్ని విడనాడి, ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని పట్టిలింగం క్రియాశీల మావోయిస్టులందరికీ విజ్ఞప్తి చేశారు. తాజా చర్యతో ఈ ఏడాది ఇప్పటివరకు ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పుల్లో 285 మంది నక్సలైట్లు మరణించారు. వీరిలో, బిజాపూర్ సహా ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ డివిజన్‌లో 256 మందిని, రాయ్‌పూర్ డివిజన్‌లోని గరియాబంద్ జిల్లాలో 27 మందిని కాల్చిచంపారు. దుర్గ్ డివిజన్‌లోని మోహ్లామాన్‌పూర్‌అంబాగఢ్ చౌకీ జిల్లాలో ఇద్దరు నక్సలైట్లు మరణించారు. గురువారం, బస్తర్ ప్రాంతంలోని సుక్మా జిల్లాలో భద్రతా సిబ్బందితో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు నక్సలైట్లు మరణించారు.



## లైబ్రరీగా మారాలి (మొదటి పేజీ తరువాయి)

సభ్యులకు అందుబాటులో ఉండేలా చూస్తామని వెల్లడించారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ అభ్యర్థన మేరకు సిఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి, స్థలం కేటాయించేలా కృషి చేస్తానని జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారు. నేటి సమాజంలో నైతిక విలువలు తగ్గిపోతున్నాయని, మానవ విలువలను పెంపొందించడానికి రచయితలు, సాహితీవేత్తలు, రచయితలు పూనుకోవాలని సూచించారు. అనాటి పుస్తకాలు చదివిన వారి విజ్ఞానం, ఆలోచన విధానంతో పోల్చితే, నేడు అవేమి కనిపించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి సమాజంలో పుస్తకాలు కేవలం ర్యాంకులు, ఉద్యోగాల కోసం మాత్రమే చదువుతున్నారే తప్ప మానవత విలువల కోసం కాదన్నారు. పుస్తకాలు చదవడం అలవాటుగా మార్చుకుని తనని తాను సంస్కరించుకోవడంతో పాటు సమాజ సంస్కరణ దిశగా అడుగులు వేయాలన్నారు. బుక్ ఫెయిర్ గౌరవ సలహాదారులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ పుస్తకం అంటేనే అదోక అందమైన పూదోట అన్నారు. డిజిటల్ పుస్తకం కంటే నేరుగా ఒక పుస్తకాన్ని చదివితే ఆ సంతృప్తి జీవితాంతం గుర్తుంటుందని తెలిపారు. సకుటుంబ సమేతంగా పుస్తక ప్రదర్శనను సందర్శించి, నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేయాలని కోరారు. ప్రజా కవి అందెశ్రీ పేరును 38వ బుక్‌ఫెయిర్ ప్రాంగణానికి నామకరణం చేశామని, ప్రధాన వేదికకు అనిశెట్టి రజిత పేరును, పుస్తకావిష్కరణల వేదికకు సాహితీవేత్త కొంపల్లి వెంకట్‌గౌడ్ పేరును, రైటర్స్ స్టాల్స్‌కు ప్రొఫెసర్ ఎస్‌వి.రామారావు, మీడియా స్టాల్స్‌కు స్వేచ్ఛ వొటార్కర్ పేరును పెట్టామని సొసైటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రమూర్తి, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ కవి యాకూబ్, కార్యదర్శి ఆర్.శ్రీనివాసు (వాసు), ఉపాధ్యక్షులు, కందాడి బాల్‌రెడ్డి, కోశాధికారి నారాయణరెడ్డి, సాంస్కృతిక సలహా మండలి సభ్యులు దినకర్ తదితరులు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తత (మొదటి పేజీ తరువాయి)

కలిగినది. సింగపూర్‌లో చికిత్స పొందుతూ హాది మరణించినట్లు చీఫ్ అడ్వైజర్ మహమ్మద్ యూనస్ ప్రకటించిన తర్వాత దేశంలోని పలు ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగాయి. ఢాకాలో ప్రముఖ పత్రికల కార్యాలయాలపై దాడులు, రాజ్‌షాహీలో అవామీ లీగ్ పార్టీ కార్యాలయ ధ్వంసం జరిగాయి. చట్టాగ్రామ్‌లోని అసిస్టెంట్ ఇండియన్ హై కమిషనర్ నివాసంపై రాళ్ల దాడి జరగగా, పోలీసులు టియర్ గ్యాస్, లాఠీచార్జితో గుంపును చెదరగొట్టారు. ఈ ఘటనలో 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. భారత అధికారికి భద్రత పెంచినట్లు కూడా వెల్లడించారు. ఢాకా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్‌సిపి) నేతృత్వంలో నిర్వహించిన శోక ర్యాలీలో భారత్ వ్యతిరేక నినాదాలు వినిపించాయి. హాది హంతకులు భారత్‌కు పారిపోయారంటూ ఆరోపణలు చేస్తూ, వారిని అప్పగించే వరకు ఇండియన్ హై కమిషన్‌ను మూసివేయాలని కొందరు డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, ప్రముఖ సాంస్కృతిక సంస్థ ఛాయానట్ కార్యాలయంపై కూడా దాడి జరిగింది. ఇతర ప్రాంతాల్లోనూ చెల్లాచెదురు హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నట్లు సమాచారం.

**ఢాకాలో మూకదాడి.. ఒకరి మృతి**

బంగ్లాదేశ్‌లో మత దూషణ ఆరోపణలతో ఒక హిందూ యువకుడిని గుంపు దాడి చేసి హత్య చేసి, అనంతరం మృతదేహాన్ని దహనం చేసిన ఘటన వెలుగుచూసింది. మృతుడిని 25 ఏళ్ల దీపు చంద్ర దాస్‌గా గుర్తించారు. ఆయన మైమెన్సింగ్ నగరంలోని ఒక కర్మాగారంలో కార్మికుడిగా పనిచేస్తున్నారని బాంగ్లా ట్రిబ్యూన్ వార్తా వెబ్‌సైట్ తెలిపింది. మైమెన్సింగ్‌లో జరిగిన ఈ మూకదాడిని మధ్యంతర ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తూ, కొత్త బంగ్లాదేశ్‌లో ఇలాంటి హింసకు స్థానం లేదు. ఈ హేయమైన నేరానికి పాల్పడినవారిని విడిచిపెట్టబోమని ప్రకటిం చిం ది. మత దూషణలకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ, కొంత మంది అతనిపై కర్మాగారం వెలుపల దాడి చేసి, అనంతరం చెట్టుకు ఉరివేసినట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఢాకా–మైమెన్సింగ్ జాతీ య రహదారి పక్కన వదిలి నిప్పంటించడంతో రెండు వైపులా ట్రాఫిక్ నిలిచిపోయిందని భాలుకా మోడల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ మాలెక్ చెప్పారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం మైమెన్సింగ్ మెడికల్ కాలేజీ మోర్గ్‌కు తరలించారు. ఈ ఘటనతో ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొందని, పరిస్థితిని అదుపులోకి తీసుకు రావడానికి చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు. ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. 'హింస, బెదిరింపులు, అగ్నిప్రమాదాలు, ఆస్తుల విధ్వంసం వంటి అన్ని చర్యలను మేము కఠినంగా ఖండిస్తు న్నాం' అని మధ్యంతర ప్రభుత్వం పేర్కొంది.

## కస్టడీ పొడిగింపు (మొదటి పేజీ తరువాయి)

ఏమాత్రం సహకరించడం లేదని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సమర్పించిన నివేదికను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుపై జస్టిస్ బివి నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం ఈరోజు విచారణ చేపట్టింది. గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలతో డిసెంబర్ 12న ప్రభాకర్‌రావు లొంగిపోయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి వారం రోజుల పాటు ఆయన్ను విచారించిన సిట్, కస్టోడియల్ రిపోర్టును కోర్టుకు సమర్పించింది. నిందితుడు విచారణలో కీలక సమాచారం ఇవ్వకుండా, దర్యాప్తునకు సహకరించడం లేదని సిట్ తరపు న్యాయవాది కోర్టుకు వివరించారు. కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు మరోసారి కస్టోడియల్ విచారణ అవసరమని అభ్యర్థించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, సిట్ అభ్యర్థనను అంగీకరించింది. ఈనెల 25 వరకు ప్రభాకర్‌రావును సిట్ కస్టడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ఈ కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## జనంలోకి.. (మొదటి పేజీ తరువాయి)

ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో చేరారన్నారు. ఈ లొంగుబాటుతో పార్టీకి కోలుకోలేని నష్టం వాటిల్లినట్లు తెలిపారు. లొంగిపోయిన వారిలో దాదాపు 24 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్న ఎర్రగొల్ల రవి అలియాస్ సంతోష్ (డివిసిఎం), 21 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్న కోర్సా లచ్చు (సివైపిసిఎం) కనికారపు ప్రభంజన్, అర్బన్ ఏరియా, పిడిఎస్‌యు సభ్యుడితో పాటు ఆరుగురు డివిజనల్ కమిటీ సభ్యులు (డివిసిఎం), 12 మంది ఏరియా కమిటీ సభ్యులు (ఎసిఎం)లు, 23 మంది పార్టీ సభ్యులు ఉన్నారని తెలిపారు. ఈ మేరకు వారి నుంచి ఒక ఇన్సాఫ్ ఎల్‌ఎంజి గన్స్, మూడు ఎకె47 రైఫిల్స్, ఐదు ఎస్‌ఎల్‌ఆర్‌లు, ఏడు ఇన్‌సాఫ్ రైఫిల్స్, ఒక బిజిఎల్ గన్, నాలుగు యుబిజిఎల్ తుపాకులు, ఒక 303 రైఫిల్, రెండు సింగిల్ షాట్ రైఫిల్స్, 24 ఎయిర్ గన్స్, 733 బిజిఎల్ షెల్స్, 08 షెల్స్ సహా భారీ మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ ఆయుధాల మొత్తం విలువ రూ.కోట్లలో ఉంటుందని తెలిపారు.పిలుపునిచ్చారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని భరోసానిచ్చారు. ప్రతి ఒక్కరికీ పునరావాసం ప్యాకేజీ కింద లొంగిపోయిన 41 మందికి కలిపి ప్రభుత్వం తరపున మొత్తం రూ.1.46 కోట్ల నగదు బహుమతిని అందజేయనున్నట్లుగా తెలిపారు. తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేలు ఇవాళ పంపిణీ చేస్తున్నామని అన్నారు. వాటితో పాటు ఆయుధాలకు విడిగా నగదు బహుమతిని కూడా ప్రభుత్వం అందిస్తున్నామని, వాటిలో ఎల్‌ఎంజీ రైఫిల్‌కు రూ.5 లక్షలు, ఎకె472కు రూ.4 లక్షలు ఇస్తామని అన్నారు.ఈ సమావేశంలో అదనపు డిజిపి మహేష్ భగవత్, ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్‌కుమార్, ఎస్‌ఐబి చీఫ్ బి.సుమతిలతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

**ఈ ఏడాది లొంగియింది 509 మంది..**

ఈ ఏడాది ఇప్పటి వరకు 509 మంది మావోయిస్టులు తెలంగాణ ప్రభుత్వం ముందు లొంగిపోయారు. వీరిలో ఇద్దరు కేంద్ర కమిటి సభ్యులు, 11 మంది రాష్ట్ర కమిటి సభ్యులు, ముగ్గురు డివిజనల్ కమిటి కార్యదర్శులు, 17 మంది డివిజనల్ కమిటి సభ్యులు ఉన్నారు.తెలంగాణకు చెందిన మరో 54 మంది మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారు. వీరంతా ఛతీస్‌ఘడ్, ఒడిశాలలో ఉన్నారు.

## ఒక్క రోజులో భూస్థాపితం (మొదటి పేజీ తరువాయి)

తీసుకువచ్చిన 'విబి– జి రామ్ జి' చట్టాన్ని గ్రామవ్యతిరేకగా ఆయన అభివర్ణించారు. 'విబి– జి రామ్ జి' బిల్లు ఎం. నరేగా పునరుద్ధరణ కాదని రాహుల్‌గాంధీ శుక్రవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. గురువారం రాత్రి, మోదీ ప్రభుత్వం ఇరవై ఏళ్ల నాటి నరేగాను ఒక్క రోజులోనే భూస్థాపితం చేసిందని మండిపడ్డారు. ఇది హక్కుల ఆధారిత, డిమాండ్ ఆధారిత హామీని ధ్వంసం చేసి ఢిల్లీ నుండి నియంత్రించే రేషన్ పథకంగా మారుస్తుందని, ఈ పథకాన్ని రాష్ట్ర వ్యతిరేక, గ్రామ వ్యతిరేకంగా రూపొందించారని మండిపడ్డారు. జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామీణ కార్మికులకు బేరసారాలు చేసే శక్తిని ఇచ్చిందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. ఈ పథకంలో నిజమైన లబ్ధిదారుల ఎంపికతో దోపిడీ, వలసల బాధలు తగ్గాయని, వేతనాలు పెరిగాయని, పని పరిస్థితులు మెరుగుపడ్డాయని, అదే సమయంలో గ్రామీణ మౌలిక సదుపాయాలను నిర్మించడంతో పాటు పునరుద్ధరణ జరిగాయన్నారు. ఆ పరపతినే ఈ ప్రభుత్వం విచ్ఛిన్నం చేయాలనుకుంటున్నదని రాహుల్ ఆరోపించారు. పనిని పరిమితం చేయడం ద్వారా, దానిని తిరస్కరించడానికి మరిన్ని మార్గాలను సృష్టించడం ద్వారా 'విబి– జి రామ్ జి' బిల్లు గ్రామీణ పేదలు కలిగి ఉన్న ఒక సాధనాన్ని బలహీనపరుస్తుందన్నారు. కొవిడ్ సమయంలో ఎంజి నరేగా అంటే ఏమిటో అందరమూ చూశామని, ఆర్థిక వ్యవస్థ మూతపడి జీవనోపాధి కుప్పకూలినప్పుడు, ఇది కోట్లాది మంది ఆకలి, అప్పుల ఊబిలో పడకుండా కాపాడిందని ఆయన ఉద్ఘాటించారు. ఇది మహిళలకు అత్యంత సహాయపడిందని, ఏటేటా మహిళలు సగం కంటే ఎక్కువ పర్సన్‌డేలను అందించారన్నారు. 'మీరు ఉద్యోగ కార్యక్రమానికి రేషన్ ఇచ్చినప్పుడు, ముందుగా బయటకు నెట్టబడేది మహిళలు, దళితులు, ఆదివాసీలు, భూమిలేని కార్మికులు, పేద ఒబిసి వర్గాలే' అని ఆయన అన్నారు. అన్నింటి కంటే మించి ఈ చట్టాన్ని సరైన పరిశీలన లేకుండా పార్లమెంటు ద్వారా బుల్డోజర్ చేశారని, బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపాలనే ప్రతిపక్ష డిమాండ్ తిరస్కరించడం దారుణమన్నారు. కోట్లాది మంది కార్మికులను ప్రభావితం చేసే గ్రామీణ సామాజిక ఒప్పందాన్ని తిరిగి మార్చే చట్టాన్ని తీవ్రమైన కమిటీ పరిశీలన, నిపుణుల సంప్రదింపులు, ప్రజా విచారణలు లేకుండా ఎప్పటికీ అమలు చేయకూడదని హితవు పలికారు. 'ప్రధాని మోదీ లక్ష్యాలు స్పష్టంగా ఉన్నాయి: శ్రమశక్తిని బలహీనపరచడం, గ్రామీణ భారతదేశం, ముఖ్యంగా దళితులు, ఒబిసిలు, ఆదివాసీల పరపతిని బలహీనపరచడం, అధికారాన్ని కేంద్రీకరించడం, ఆపై సంస్కరణలుగా నినాదాలను అమ్మడం' అని గాంధీ అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రపంచంలోనే అత్యంత విజయవంతమైన పేదరిక నిర్మూలన, సాధికారత కార్యక్రమాలలో ఒకటి అని అన్నారు. గ్రామీణ పేదల చివరి రక్షణ కవచాన్ని ఈ ప్రభుత్వం నాశనం చేయడాన్ని తాము అనుమతించబోమన్నారు. ఈ చర్యను ఓడించడానికి, ఈ చట్టాన్ని ఉపసంహరించుకునేలా చూడటానికి కార్మికులు, పంచాయతీలు, రాష్ట్రాలకు అండగా నిలబడతామని, దేశవ్యాప్త కూటమిని నిర్మిస్తామన్నారు.



# జనరల్

STATE & REGIONAL NEWS

## సాజిద్ అక్రమ్ గురించి బయటపడ్డ సంచలన విషయాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆస్ట్రేలియాలో ఇటీవల చోటుచేసుకున్న కాల్పుల ఘటనలో ప్రధానంగా వినిపిస్తున్న పేరు సాజిద్ అక్రమ్. అతడి నేపథ్యం, వీసా ప్రయాణం, కుటుంబ జీవితం ఇప్పుడు సంచలనంగా మారాయి. దాదాపు మూడు దశాబ్దాల పాటు సాగిన అతడి ఆస్ట్రేలియా ప్రయాణంలో ఎన్నో కీలక మలుపులు ఉన్నట్టు సమాచారం.హైదరాబాద్ నాంపల్లి ప్రాంతంలోని అన్వర్ ఉల్ కాలేజీలో 1998లో బిఎ పూర్తి చేసిన సాజిద్ అక్రమ్, అదే ఏడాది నవంబర్ 8న స్టూడెంట్ వీసాపై ఆస్ట్రేలియాకు వెళ్లాడు. ఆస్ట్రేలియాలో స్థిరపడేందుకు అతడు చేసిన ప్రయత్నాలు ఫలించేందుకు దాదాపు 27 సార్లు ప్రయత్నించాల్సి వచ్చింది. చివరకు అతడికి పర్మినెంట్ రెసిడెంట్ (పిఆర్) వీసా లభించినట్టు రికార్డులు చెబుతున్నాయి. 2000లో వెన్నెసా అనే యువతితో సాజిద్ వివాహం చేసుకున్నాడు. అప్పటికే వెన్నెసాకు ఆస్ట్రేలియా పిఆర్ వీసా ఉండటం గమనార్హం. అనంతరం 2001లో సాజిద్ తన వీసాను పార్ట్నర్ వీసాగా మార్చుకున్నాడు. నవీద్‌కు కూడా పర్మినెంట్ వీసా లభించింది. ఇంతకాలం ప్రశాంతంగా సాగినట్టు కనిపించిన సాజిద్ అక్రమ్ జీవితం, తాజా కాల్పుల ఘటనతో ఒక్కసారిగా వెలుగులోకి రావడం తీవ్ర చర్చకు దారితీస్తోంది.

### 'మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం'లో..

# మహాత్మాగాంధీ పేరును తొలగించడం సరికాదు

సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ అజీజ్ పాషా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ స్థాయిలోనే ప్రజా నాయకునిగా జాతిపితగా పేరుగాంచిన మహాత్మా గాంధీ పేరును అత్యంత ముఖ్యమైన గ్రామీణ పేదరిక నిర్మూలనకు ఉద్దేశించిన పథకానికి పెట్టిన మహాత్మా గాంధీ పేరును తొలగించడం సరికాదని, దీనిని యావత్ ప్రజానీకం వ్యతిరేకించాలని సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా పిలుపునిచ్చారు. 'మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం'లో మహాత్మాగాంధీ పేరును తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్, మఖ్దూం భవన్‌లోని బహదూర్ గౌర్ హాల్‌లో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ అధ్యక్షతన జరిగిన సమావేశానికి సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.కాంతయ్య, రాష్ట్ర రైతు సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి పాల్గొన్నారు.

కాగా మహాత్మా గాంధీ పేరును తొలగించవద్దని సమావేశం తీర్మానించింది. ఈ సందర్భంగా సయ్యద్ అజీజ్‌పాషా మాట్లాడుతూ గాంధీ పేరుకు ముందు మహాత్మా అని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రకటిస్తూ, దేశానికి స్వేచ్ఛ స్వాతంత్ర్యాన్ని సాధించడంలో ప్రపంచంలోనే గాంధీ గొప్ప మహనీయుడని కొనియాడారన్నారు. సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ పాలక పార్టీ మహాత్మా గాంధీ పేరును తొలగించటం సాహసమని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కాంతయ్య మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో ప్రజలు పనిచేసుకుని బతకగలుగుతున్నారని, అలాంటి పథకానికి మహాత్మా గాంధీ పేరును తొలగించాల్సిన అవసరం ఏంవచ్చిందని ప్రశ్నించారు.

పశ్యపద్మ మాట్లాడుతూ మహాత్మా గాంధీని నిర్దాక్షిణ్యంగా చంపివేసిన గాడ్సేకు నీరాజనాలు పలుకుతున్న ఆర్‌ఎస్‌ఎస్‌కు గాంధీ పట్ల నాడు, నేడు తీవ్రమైన వ్యతిరేకత ఉందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ అడుగుజాడలలో నడిచే బిజెపి పాలకులు మహాత్మాగాంధీ పేరును గ్రామీణ ఉపాధి హామీ పథకం నుండి తొలగించడం ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ కోరికను నెరవేర్చారని విమర్శించారు. మొత్తంగా ఈ పథకాన్ని నీరుగార్చడంలో భాగంగానే కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు వినియోగించాలని సూచించారని పశ్యపద్మ అన్నారు. వామపక్ష పార్టీలు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు సంవత్సరంలో రెండు వందల రోజుల పనిని కల్పించాలని, రోజుకు రూ.700లను చెల్లించాలని, ఈ పథకాన్ని పట్టణ కూలీలకు కూడా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, నిరంతరంగా పోరాడుతున్నప్పటికీ పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు. పాలకులు వికసిత్ భారత్ గ్యారెంటీ రోజుగార్, ఆ జీవికామిషన్ పేరుతో బిల్లును పార్లమెంట్‌లో చర్చకు పెట్టారని, ప్రతిపక్ష పార్టీలు దేశంలో ఆయా తరగతులకు చెందిన ప్రజలు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కుటిల రాజకీయాలకు నిరసనగా ఆగ్రహంతో ఉద్యమాలు చేపడుతున్నారని, పోరాటాలు కొనసాగుతున్నాయని వివరించారు. బిజెపి కార్యాలయాలను ముట్టడిస్తున్నారని, కేంద్ర పాలకుల నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాలని పశ్యపద్మ పిలుపునిచ్చారు.

## ఏకపక్షంగా 'మహత్మ గాంధీ' పేరు మార్చారు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పార్లమెంట్‌లో భిన్న అభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ ఏకపక్షంగా మహత్మ గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చారని సిపిఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎంఎల్‌ఎ చాడ వెంకటరెడ్డి అన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అప్రజాస్వామికంగా, రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్నదని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహాత్మా గాంధీపైన బిజెపికి ఉన్న కోపంతో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చి, వికసిత భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజివికా మిషన్ గ్రామీణ్ బిల్లును తీసుకొచ్చారని అన్నారు. ఈ కార్మికులకు అన్యాయం చేసేవిధంగా, రాష్ట్రాలపైన భారం మోపడానికే ఈ కొత్త చట్టాన్ని తీసుకొచ్చారని చాడ విమర్శించారు. గతంలో రాష్ట్రాల వాటా 60 శాతం ఉంటే ఇప్పుడు తగ్గించారని, ఆర్థికంగా వెనుకబడిన కొన్ని రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలు చేయడం కష్టమవుతుందని తెలిపారు. వ్యవసాయ కూలీల పట్ల కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని చాడ వెంకట రెడ్డి అన్నారు.

### నైనీలో థర్మల్ పవర్ ప్లాంట్

# ఏర్పాటుపై ఆలోచిస్తాం

ఒడిస్సా సిఎం మోహన్ చరణ్ మాంజీతో తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సింగరేణి ఆధ్వర్యంలో కొనసాగుతున్న నైనీ కోల్ బ్లాక్ పిట్ హెడ్ వద్ద థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు తెలంగాణ అధికారుల బృందం అధ్యయనం చేస్తుందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఒడిస్సా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాంజీతో శుక్రవారం డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ఇంధనశాఖ అధికారుల బృందం నైనీ ప్రాంతాన్ని సందర్శించి అంచనాలు రూపొందిస్తుందని తదుపరి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని డిప్యూటీ సిఎం వివరించారు. సమావేశంలో తెలంగాణ ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ విట్టల్, సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణభాస్కర్, సింగరేణి అధికారులు సత్యనారాయణ, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడిపోయినా విజయోత్సవాలా?

రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ ఓడిపోయినప్పటికీ కెటిఆర్ విజయోత్సవాలు, ఆత్మీయ సమ్మేళనాల పేరుతో జిల్లాల పర్యటనలు చేయడం హాస్యాస్పదమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. కెటిఆర్ పర్యటనలు అసమర్థుడి జీవయాత్రలా ఉన్నాయని, ఓడిపోయిన సర్పంచ్‌లను ఓదార్చడానికి ఆయన ఓదార్పు యాత్రలు చేస్తున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని సిఎల్‌పి కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీరు చూస్తుంటే జాలేస్తుందని ఎద్దేవా చేశారు. ఎంఎల్‌సి కవిత వ్యవహారంతో కుప్పకూలుతున్న పార్టీని కాపాడుకోవడానికి కెటిఆర్ నానా పాట్లు పడుతున్నారని, పార్టీ ఓడిపోయాక విజయోత్సవాలు నిర్వహించడం ఆయన మానసిక స్థితిపై అనుమానం కలిగిస్తోందన్నారు. భయంతోనే కెటిఆర్ ఈ ఆత్మీయ సమ్మేళనాల హడావుడి చేస్తున్నారని విమర్శించారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్** GHMC
ఇఇ, డివిజన్-29, సికింద్రాబాద్, ఎస్‌బిజెడ్, జిహెచ్‌ఎంసి.

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు

NIT No. 36/EE-29/GHMC/2025-26, తేది: 18.12.2025

క్ర.సం. 1, NIT No. 36/EE-29/GHMC/2025-26, తేది:18.12.2025.పని పేరు: జిహెచ్‌ఎంసి, ఎస్.బి.జెడ్, సికింద్రాబాద్, జోనల్ కమిషనర్ కార్యాలయంలో కుర్చీలు, బల్లలు, ఏసీ యూనిట్లు, పివిసి పైపులు మొదలైన స్క్రాప్ సామాగ్రిని పారవేసేందుకు టెండర్. **బిడ్స్ స్వీకరించడానికి ప్రతిపాదనల ప్రారంభ మరియు ఆఖరి తేదీ:** 19.12.2025న సా.04.00గం.ల నుండి 29.12.2025న సా.04.00గం.ల వరకు. **కార్యాలయ చిరునామా & పేరు :** ఇఇ-సర్కిల్-29, సిటీ సివిల్ కోర్టు ఎదురుగా, సికింద్రాబాద్, ఎస్‌బిజెడ్, జిహెచ్‌ఎంసి. ఫోన్ నెం. 9704405076. మరిన్ని వివరాలను టెండర్ నోటిఫికేషన్‌లలో లేదా ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో http://www.ghmc.gov.in వద్ద లేదా ఈ కార్యాలయ నోటీసు బోర్డులో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-29, సికింద్రాబాద్, సికింద్రాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 12205-PP/CL/ADVT/1/2025-26, Date: 19-12-2025



**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ** hmda Growing Global
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, డివిజన్-VII
4వ అంతస్తు, వెస్ట్ వింగ్, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500038.

ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీస్

NIT.No. HMDA/DEV/EE(Div-VII)/03/2025-26 తేది: 19.12.2025

ఈ క్రింది పనుల కోసం చెల్లుబాటు అయ్యే రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు ఆహ్వానించబడ్డాయి:

| క్ర. సం. | పని పేరు | టెండర్ ఆహ్వానించే అధికారం |
|---|---|---|
| 1 | చెన్నాపురం ఎక్స్ రోడ్ నుండి వికలాంగుల కాలనీలోని లక్ష్మీ నర్సింహ కాలనీ కమాన్‌తో సహా వాటర్ ట్యాంక్ వరకు సిసి రోడ్డు వేయడం మరియు ZPHS బాలాజీనగర్ నుండి మెయిన్ రోడ్ అవుట్‌లెట్ వరకు 250 mm దయా SWG పైపులను వేయడం. | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-VII, హెచ్‌ఎండిఎ. |

బిడ్ సమర్పించడానికి చివరి తేదీ 24.12.2025 మధ్యాహ్నం 2.00 గంటల వరకు. మరిన్ని వివరాల కోసం https://tender.telangana.gov.in// ని సందర్శించండి.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-VII, హెచ్‌ఎండిఎ.

DIPR R.O. No. : 12253-PP/CL/ADVT/1/2025-26; Date: 19-12-2025



**తెలంగాణ ప్రభుత్వం, అటవీ శాఖ.**

Rc.No.572/R2/2024, సంక్షిప్త టెండర్ ప్రకటన తేది: 18.12.2025

ఆమోదించబడిన థీమ్ ప్రకారం అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన-2026 కోసం తెలంగాణ అటవీ శాఖ స్టాల్ ఫ్యాబ్రికేషన్ పనులకు సీల్డ్ టెండర్లు ఆహ్వానించడమైనది.
పని యొక్క వ్యయం మరియు స్పెసిఫికేషన్ల వివరాలు టెండర్ ఫారంలో అందుబాటులో ఉన్నాయి. టెండర్ నిబంధనలు మరియు షరతులతో కూడిన టెండర్ ఫారాలను 19.12.2025 నుండి కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్, రీసెర్చ్ & డెవలప్‌మెంట్ సర్కిల్, హైదరాబాద్, 3వ అంతస్తు, అరణ్య భవన్, సైఫాబాద్, హైదరాబాద్ వారి కార్యాలయం నుండి పొందవచ్చు.
1. **టెండర్ షెడ్యూళ్ల అమ్మకం:** 19.12.2025 నుండి 27.12.2025 మధ్యాహ్నం 12:00 గంటల వరకు.
2. **కాంట్రాక్టర్లచే టెండర్ షెడ్యూళ్లను సమర్పించడం:** 27.12.2025 మధ్యాహ్నం 1:00 గంటల వరకు.
3. **టెండర్ షెడ్యూళ్లను తెరవడం:** 27.12.2025 సాయంత్రం 3:00 గంటలకు, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్, రీసెర్చ్ & డెవలప్‌మెంట్ సర్కిల్, హైదరాబాద్, రూమ్ నెం.347, 3వ అంతస్తు, అరణ్య భవన్, సైఫాబాద్, హైదరాబాద్ వారి కార్యాలయంలో.

పై వాటిని అధీకృత అధికారిచే ఖరారు చేయబడుతుంది.

సం/- కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్, రీసెర్చ్ & డెవలప్‌మెంట్ సర్కిల్, హైదరాబాద్.
మొబైల్ నెం. 9440849242
ఇ-మెయిల్ ఐడి: fuohyd2023@gmail.com

DIPR R.O. No. : 12280-PP/CL/ADVT/1/2025-26, Date: 19-12-2025




## హైదరాబాద్‌కు చేరుకున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ మూడు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆయన హైదరాబాద్ విమానాశ్రయానికి చేరుకోగా, తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) సి.సుదర్శన్ రెడ్డి సహా ఎన్నికల విభాగానికి చెందిన ఉన్నతాధికారులు ఘనంగా స్వాగతం పలికారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా సిఇసి జ్ఞానేశ్ కుమార్ రవీంద్రభారతి ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర బూత్ లెవల్ అధికారులు (బిఎల్‌ఒలు)తో సమావేశం నిర్వహించనున్నారు. అలాగే గోల్కొండ కోట, హుస్సేన్‌సాగర్, చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం వంటి నగరంలోని ప్రముఖ చారిత్రక, సాంస్కృతిక ప్రదేశాలను సందర్శించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలానికి బయలుదేరనున్నారు. సాయంత్రం 6.30 గంటలకు భ్రమరాంబ అతిథి గృహానికి చేరుకుంటారని అధికారులు తెలిపారు. శ్రీశైలం పర్యటన పూర్తిగా ఆధ్యాత్మిక, భక్తిపరమైనదిగా ఉండగా, అక్కడ ఎలాంటి అధికారిక సమావేశాలు లేవని స్పష్టం చేశారు. సిఇసి పర్యటనను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్ర, జిల్లా యంత్రాంగాలతో సమన్వయం చేస్తూ అవసరమైన ఏర్పాట్లు చేశారు.

### భారతదేశ ఉన్నత విద్యా వ్యవస్థను దెబ్బతీసే విధంగా..

# వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్–2025 బిల్లు

ఎఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వికాసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ (విబిఎస్‌ఎ) బిల్లు 2025' సమాఖ్య నిర్మాణాన్ని, ప్రజాస్వామ్య , యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిని, భారతదేశ ఉన్నత విద్యా వ్యవస్థకు చెందిన లౌకిక, శాస్త్రీయ స్వభావాలను దెబ్బ తీసేవిధంగా ఉన్నదని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి), ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ)తో సహా ప్రస్తుతం ఉన్న రెగ్యులేటరీ ఆర్కిటెక్చర్‌ను రద్దు చేయాలని విబిఎస్‌ఎ బిల్లు ప్రతిపాదిస్తుందని, దీని స్థానంలో పూర్తిగా కేంద్ర ప్రభుత్వం నియంత్రించే ఏకైక, అత్యంత కేంద్రీకృత ఒకే కమిషన్‌ను ఏర్పాటు చేస్తుందని వారు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా సిలబస్ పూర్తిగా రాజకీయ, మతపర, విద్య, ఉద్యోగ నియామకాల్లో పూర్తిగా రాజకీయ జోక్యం పెరుగుతుందన్నారు. రాజకీయంగా నియమించబడిన కొంతమంది వ్యక్తుల చేతుల్లో మొత్తం విద్యావిధానం వెళ్తుందని, ఈ విద్యావిధానం పూర్తిగా విద్య ప్రైవేటీకరణ, విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా ఉందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యకు అధిక నిధులు ఇవ్వకుండా విద్యారంగాన్ని మొత్తం ప్రైవేటుపరం చేస్తుందన్నారు. విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా ఇప్పటికే తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం 2020ను అనేక రాష్ట్రాలు వ్యతిరేకిస్తూ, అసెంబ్లీలో తీర్మానం చేసి, ఈ బిల్లును అమలు చేయడం లేదని ఆయా రాష్ట్రాలు బిజెపిని తిప్పి కొట్టారని వారు తెలిపారు. వెంటనే విబిఎస్‌ఎ బిల్లును ఉపసంహరించుకోవాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## అత్యధిక సంఖ్యలో బిసిల గెలుపు హర్షనీయం

చైర్మన్ జి.నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రామ పంచాయతీ ఎన్నికలలో బిసి అభ్యర్థులు అత్యధికంగా గెలుపొందడం పట్ల తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జి. నిరంజన్ మాట్లాడుతూ గ్రామ పంచాయితీ ఎన్నికలలో 42 శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేయకపోయినా, జనరల్ స్థానాల్లో బిసి అభ్యర్థులు 52.75 శాతం గెలవడం బిసిలలో చైతన్యానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బిసి అభ్యర్థులు 39.51 శాతం గెలిచినా, గిరిజన జిల్లాలను మినహాయిస్తే ఇది 45.25శాతంగా తేలుతుందన్నారు.
బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు వ్యతిరేకించే వారికి ఇకనైనా ఈ విజయం కనువిప్పు కలగాలని కోరారు. బిసి సర్పంచులే ఎన్నికావడం ఆనందదాయకమన్నారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్** GHMC
ఇఇ, సర్కిల్-30, బేగంపేట్, సికింద్రాబాద్ జోన్.

కొటేషన్లు పొందేందుకు నోటీసు

నోటీసు నెం. 15/Sealed Quotations/EE-30/SD Z/GHMC/2025-2026, తేది: 19.12.2025

| క్ర. సం. | క్రింద పేర్కొన్న వస్తువుల కోసం తయారీదారులు, ఫ్యాబ్రికేటర్లు, అధీకృత డీలర్లు/ ఏజెన్సీలు మొదలైన వారి నుండి సీల్డ్ కొటేషన్లు ఆహ్వానించబడ్డాయి. | డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది & సమయం / కొటేషన్ల దాఖలుకు ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|
| 1. | **పని పేరు:** డీలిస్టింగ్ పనులకు కొటేషన్లు ఆహ్వానించడమైనది. **అవసరమైన వస్తువులు :** అద్దె, సిబ్బంది, ఇంధనం మరియు ఇతర ఖర్చులతో కలుపుకుని హైడ్రాలిక్ సిల్ట్ గ్రాబర్‌ను ఉపయోగించి క్యాచ్‌పిట్‌లలో పూడికతీత పనులు చేపట్టి పూర్తి చేయుట. | కొటేషన్ల ప్రారంభ తేది & సమయం: 20.12.2025న ఉ.10.30గం.ల నుండి. దాఖలుకు ఆఖరి తేది & సమయం: 24.12.2025న మ.12.00గం.ల వరకు | సీల్డ్ కొటేషన్లను ఓ/ఓ. ఇ.ఇ., సర్కిల్-30, జిహెచ్‌ఎంసి, సికింద్రాబాద్‌లో 24.12.2025న మ.12.00గం.లు లేదా అంతకు ముందు దాఖలు చేయవచ్చు. సెల్ నెం. 7995468066 / 7331181426 |

**గమనిక:** రేటును యూనిట్లతో ప్రతిపాదించాలి.
సంబంధిత అధికారి చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-30, మరియు హెడ్ డ్రాఫ్ట్‌మెన్, సర్కిల్-30, సికింద్రాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి. పైన పేర్కొన్న వస్తువులకు సంబంధించిన మరిన్ని వివరాలు మరియు పూర్తి వివరణలను జిహెచ్‌ఎంసి వెబ్‌సైట్ https://ghmc.gov.in/ నుండి పొందవచ్చు. కొటేషన్‌లను ఆన్‌లైన్ ఇ-మెయిల్ ఐడి eec30reports@gmail.com ద్వారా సమర్పించవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-30, బేగంపేట్.

DIPR R.O. No. : 12236-PP/CL/ADVT/1/2025-26, Date: 19-12-2025


## రానున్న ఎన్నికలకు పంచాయతీ ఫలితాలు ట్రైలర్ మాత్రమే

బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 50 శాతం ప్రజామద్దతు కూడా పొందలేని ప్రభుత్వం ప్రజల ముందు మాట్లాడే నైతిక హక్కును కోల్పోయిందని బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జ్ ఎన్.వి.సుభాష్ అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం సుభాష్ మీడియాతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పాలనపై గ్రామీణ ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తిరస్కారమన్నారు. ఈ ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయ రిఫరెండం లాంటివన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 12,728 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగితే, వాస్తవంగా కాంగ్రెస్‌కు వచ్చిన సర్పంచుల సంఖ్య సుమారు 6,300 నుంచి 6,400 మధ్యే ఉంటుందన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే బిజెపి సర్పంచ్ స్థానాలు ఆరు రెట్లకు పైగా పెరిగాయన్నారు. గతంలో కేవలం 167 సర్పంచ్ స్థానాలు ఉన్న బిజెపికి ఈసారి 1,000కి పైగా స్థానాల్లో మద్దతున్న అభ్యర్థులు గెలిచారన్నారు. బిఆర్‌ఎస్‌తో కుమ్మక్కైంది కాంగ్రెస్‌నేనని, అందుకే గత 10 ఏళ్ల అవినీతిపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను రాజీనామా చేయించి మళ్లీ ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. నిజంగా ప్రజల మద్దతు ఉంటే ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలను ఎందుకు వాయిదా వేస్తున్నారని ప్రశ్నించారు. గ్రామం నుంచి పార్లమెంట్ వరకూ బిజెపినే ప్రత్యామ్నాయమని, గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు రాబోయే ఎంపిటిసి, జెడ్‌పిటిసి, మున్సిపల్, అసెంబ్లీ ఎన్నికలకు ట్రైలర్ మాత్రమేనని సుభాష్ అన్నారు.

# "క్షేత్రస్థాయిలో ప్రజలు కెసిఆర్ వైపే"

సిరిసిల్ల నియోజకవర్గంలో 117 గ్రామ పంచాయతీలకు 80 చోట్ల బిఆర్‌ఎస్ మద్దతుదారులు

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు గ్రామ పంచాయతీ ఎన్నికలలో ఎలాంటి ప్రలోభాలకు గురిచేసినా క్షేత్రస్థాయిలో ప్రజలు కెసిఆర్ నాయకత్వం వైపే మొగ్గు చూపారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు, వార్డు సభ్యులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ అధికార పార్టీ దౌర్జన్యాలను ఎదుర్కొని సిరిసిల్ల నియోజకవర్గంలోని 117 గ్రామ పంచాయతీలకు గాను 80 చోట్ల బిఆర్‌ఎస్ మద్దతుదారులు అఖండ విజయం సాధించడం గర్వకారణమన్నారు. పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాతపెట్టి సిరిసిల్లలో 50 పంచాయతీల్లో గులాబి జెండా ప్రభంజనం సృష్టించింది అన్నారు. గంభీరావుపేట వంటి మండలాల్లో కాంగ్రెస్ ఖాతా తెరవలేకపోవడం ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సర్పంచులను బెదిరించడంపై స్పందిస్తూ, ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి పైసా ప్రజలు పన్నుల రూపంలో కట్టిన సొమ్ము అని, అది ఎవరి అత్త సొమ్ము కాదని కెటిఆర్ ఘాటుగా విమర్శించారు. గత పదేళ్లలో కెసిఆర్ పల్లె ప్రగతి ద్వారా గ్రామాలను నందనవనాలుగా తీర్చిదిద్దారని,నేడు కాంగ్రెస్ పాలనలో కనీసం ట్రాక్టర్లలో డీజిల్ పోయించే పరిస్థితి కూడా లేదని విమర్శించారు.

**దమ్ముంటే ఆ 10 మందితో రాజీనామా చేయించు..**

పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ వెంట ఉన్నారని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే, నైతికత ఉంటే బిఆర్‌ఎస్ నుంచి అక్రమంగా చేర్చుకున్న 10 మంది ఎమ్మెల్యేలతో తక్షణమే రాజీనామా చేయించి ఎన్నికలకు రావాలని కెటిఆర్ బహిరంగ సవాల్ విసిరారు. అప్పుడు ప్రజలు ఏవైపు ఉన్నారో నిర్ణయిస్తారని, దమ్ముంటే తన సవాల్ స్వీకరించాలని అన్నారు.

**66 శాతం నిజమైతే.. తేల్చుకుందాం రా!**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట మార్చడంలో సిద్ధహస్తుడని కేటీఆర్ విమర్శించారు. నిన్న హైదరాబాద్ ప్రెస్ మీట్‌లో రేవంత్ రెడ్డి మొదట కాంగ్రెస్ 66 శాతం గెలిచిందని, ఇది ప్రభుత్వంపై ప్రజల ఆశీర్వాదమని గొప్పలు చెప్పారు. కానీ, సరిగ్గా ఐదు నిమిషాలకే మాట మార్చి.. ఇవి స్థానిక అంశాలపై జరిగిన ఎన్నికలని, ప్రభుత్వానికి సంబంధం లేదని తప్పించుకున్నారు. ముఖ్యమంత్రి మీకు నిజంగానే 66 శాతం ప్రజాదరణ ఉంటే, నా సవాల్ స్వీకరించండి. మా పార్టీ నుంచి మీరు సంతలో పశువుల్లా ఎత్తుకెళ్లిన ఆ పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించండి. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, కొండూరి రవీందర్‌రావు, చిక్కాల రామారావు, తుల ఉమ, జిందం చక్రపాణి, న్యాలకొండ అరుణ, గూడూరి ప్రవీణ్, తిరుపతి, దిడ్డి శ్రీనివాస్, మల్లారెడ్డి నూతనంగా ఎన్నికైన సర్పంచులు, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


**తెలంగాణ ప్రభుత్వం**
**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం :: ఆదిలాబాద్, ఆదిలాబాద్ జిల్లా.**

ఆసక్తి వ్యక్తీకరణ కోసం నోటీస్ ఆహ్వానం

నోటీసు R.O.C.No. E1/EOI-08/2025-26 తేదీ: 18-12-2025

ఆదిలాబాద్ మునిసిపాలిటీ పరిధిలో 2 మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న మేజర్ స్టోర్మ్ వాటర్ డ్రెయిన్స్ కనెక్టివిటీ ఓపెన్ నాలాలకు ఇరువైపులా రిటైనింగ్ వాల్స్ యొక్క డీటైల్డ్ ప్రాజెక్ట్ నివేదికల (డిపిఆర్‌లు) తయారీ కోసం భారత కేంద్ర ప్రభుత్వం పట్టణాభివృద్ధిలో ఎంప్యానెల్ జాబితాలోని అనుభవజ్ఞులైన కన్సల్టెన్సీ సంస్థల నుండి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రజారోగ్య మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం లేదా R&B విభాగం నీటి పారుదల విభాగం నుండి ఆసక్తి వ్యక్తీకరణ (EOI)ఆహ్వానించబడింది. ఇలాంటి పనుల విషయాలలో కనీసం 10సంవత్సరాల అనుభవానికి తక్కువకాకుండా ఉన్న ఎంప్యానెల్డ్ కన్సల్టింగ్ సంస్థలు, పైన పేర్కొన్న ఏదైనా రాష్ట్ర ప్రభుత్వ విభాగాల ఆథరైజ్డ్ అధికారం కలిగిన ఇంజనీర్ ఇన్ చీఫ్ ద్వారా ముందుగా ఆమోదించబడిన డిపిఆర్‌లను పూర్తిగా విజయవంతంగా పూర్తి చేయడం చూపించాలి.

| క్ర.సం. | పనిపేరు |
|---|---|
| 1 | విలీన G.P వార్డులు, కోర్ ప్రాంతంలో తుఫాన్ నీటి కాలువల కోసం డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారీ ఆదిలాబాద్ మునిసిపాలిటీలోని 1నుండి 49వార్డులను పూర్తిగా కవర్ చేయడం. |
| 2 | ఆదిలాబాద్ మునిసిపాలిటీలోని 1నుండి 49వార్డులలో 52 పనులకు రూ.18.70 కోట్ల వ్యయంతో UIDF కింద ప్రతిపాదించబడిన పనులకు డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టును రూపొందించడం. |
| 3 | ఆదిలాబాద్ మునిసిపాలిటీలోని వివిధ ప్రదేశాలలో నాలా క్రాసింగ్ మైనర్ /మేజర్ బ్రిడ్జిల కోసం మైనర్, మేజర్ బ్రిడ్జిలకు సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు తయారీ, సంబంధిత DPRలు, సంస్థలు వాటి మునుపటి సంబంధిత సారూప్య అనుభవం 10 సంవత్సరాల కంటే తక్కువ కాకుండా సమర్పించాల్సి ఉంటుంది. మునుపటి అనుభవాల రుజువులను కూడా సమర్పించాలి. పైన పేర్కొన్న డిపార్ట్‌మెంట్‌ల ప్రకారం సమర్థ సాంకేతిక అధికారం కలిగిన వారిచేత కౌంటర్ సంతకం చేయబడిన సర్టిఫైడ్ కాపీలను కింద సంతకం చేసిన వారికి సమర్పించాలి. |

పైన పేర్కొనబడిన పనుల EOI సమర్పించడానికి చివరితేదీ 30-12-2025 సాయంత్రం 5గంటల వరకు. వారు ఆదిలాబాద్ మునిసిపల్ కమిషనర్ పేరుతో విడివిడిగా (1నుండి 3 వరకు) ప్రతీ పనివారీగా రూ.5,000.00 డిమాండ్ డ్రాఫ్ట్ (డి.డి) (నాన్ రిఫండబుల్) ఏదైనా షెడ్యూల్డ్ జాతీయ బ్యాంకులలో **కమిషనర్, ఆదిలాబాద్ మునిసిపాలిటీ** పేరిట తీసినది సమర్పించడం ద్వారా ఆసక్తి యొక్క వ్యక్తీకరణ (EOI)ను దరఖాస్తు చేసుకోవచ్చు.
ఇతర వివరాలకు ఆదిలాబాద్ మునిసిపాలిటీలోని ఇంజనీరింగ్ విభాగంలో కార్యాలయ పనివేళల్లో సంప్రదించండి.
**కాంటాక్ట్ మొబైల్ నెంబర్స్ :** కమిషనర్, ఆదిలాబాద్ మునిసిపాలిటీ - 9849905885
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆదిలాబాద్ మునిసిపాలిటీ - 8008712444.
**గమనిక :** ఎటువంటి కారణం చూపకుండానే అందిన ఏవైనా లేదా అన్ని దరఖాస్తులను అంగీకరించే లేదా తరిస్కరించే హక్కు సమర్థ అధికారికి ఉన్నది.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్. ఆదిలాబాద్ మునిసిపాలిటీ.
సం/- కమిషనర్ ఆదిలాబాద్ మునిసిపాలిటీ.

DIPR R.O. No. : 12288-PP/CL/ADVT/1/2025-26, Date: 19-12-2025

## డంపింగ్‌యార్డు సమస్యకు త్వరలో పరిష్కారం



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణంలోని ఈదులగూడ శివారులోగల మున్సిపల్ డంపింగ్‌యార్డు సమస్యకు త్వరలో పరిష్కారం చూపుతానని ఎమ్మెల్యేల బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన డంపింగ్ యార్డు పరిశీలించి మాట్లాడారు. సమస్యకు చెక్ పెట్టేందుకు డంపింగ్‌యార్డులోని చెత్తను రీసైకిల్ చేసి చెత్తను అక్కడి నుంచి తొలగించేందుకు ప్రైవేట్ కంపెనీతో చర్చించి వారితో కలిసి డంపింగ్‌యార్డును సందర్శించడం జరిగిందన్నారు. త్వరలో ఇక్కడ నుంచి తొలగించి పట్టణ ప్రజలకు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు డంపింగ్‌యార్డు సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని అన్నారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు ఉన్నారు.

## దోనిపాములు ఉప సర్పంచ్‌గా తిప్పరి రాములు

ప్రజాపక్షం/చండూరు: నల్లగొండ జిల్లా చండూరు మండలంలోని దోనిపాముల గ్రామ పంచాయితీలో సిపిఐ బలపర్చిన నాల్గవ వార్డు సభ్యుడుగా ఎన్నికైన తిప్పర్తి రాములు ఉప సర్పంచ్‌గా ఎన్నికైయ్యారు. సిపిఐ నుండి వార్డు మెంబర్‌గా ఎన్నికైన సభ్యుడని కాంగ్రేస్ పార్టీ తరుపున ఎన్నికైన వార్డు సభ్యులు అందరూ కలిసి గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్‌గా తిప్పర్తి రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వార్డు మెంబర్‌గా విజయం సాధించి దోనిపాములు గ్రామానికి ఉప సర్పంచ్‌గా ఎన్నికైన తిప్పర్తి రాములును సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య , సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ ,కాంగ్రేస్ చండూరు మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం , కాంగ్రేస్ చండూరు పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ అభినందించారు.



## ఆలేరు ఫలితాలపై టిపిసిసి చీఫ్ హర్షం

### ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యను అభినందించిన పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్



ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి : గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఆలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించడంపై పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను అభినందించారు. శుక్రవారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అయిలయ్య పీసీసీ అధ్యక్షుడికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి పవిత్ర ప్రసాదాన్ని అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. నియోజకవర్గంలో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడంలో బీర్ల అయిలయ్య పోషించిన కీలక పాత్రను, ఆయన నాయకత్వ పటిమను పీసీసీ అధ్యక్షుడు కొనియాడారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న అయిలయ్యని అభినందిస్తూ, రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. 'నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఐక్యంగా పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి' అని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

## కౌంటింగ్ ఏజెంట్‌పై దాడి

### 18 మందిపై బైండోవర్ కేసు నమోదు



ప్రజాపక్షం/గరిడేపల్లి : మండలంలోని అప్పన్నపేట గ్రామంలో స్థానిక ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్‌పై జరిగిన దాడి కేసులో 18 మందిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చలిగంటి నరేష్ తెలిపారు. బుధవారం జరిగిన ఘర్షణలో ఎడవెల్లి చంద్రారెడ్డి అనే మాజీ సర్పంచ్ కౌంటింగ్ ఏజెంట్‌గా ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించగా బిఆర్ఎస్ పార్టీ ఓటమిని అంగీకరించలేక కౌంటింగ్ ఏజెంట్‌గా ఉన్నటువంటి చంద్రారెడ్డిపై బిఆర్ఎస్ అభ్యర్థి కుటుంబ సభ్యులు, కొందరు స్థానిక, స్థానికేతరులు అయిన అల్లరి మూకలను వెంటబెట్టుకొని కౌంటింగ్ హాల్‌పై దాడి చేయడం జరిగింది. ఈ దాడిలో గాయపడిన ఎడవెల్లి చంద్రారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పది మందిపై కేసు నమోదు చేసి అదేవిధంగా సోషల్ మీడియాలో వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఫేక్ న్యూస్ క్రియేట్ చేసిన మరికొంత మందిని మొత్తం 18 మందిని శుక్రవారం హుజూర్‌నగర్ ఆర్‌డిఓ ముందు బైండోవర్ చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు పెరిగిన బలం

### ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి



ప్రజాపక్షం/హాలియా: స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్‌కి గ్రామస్థాయిలో ఓటర్లు ఇచ్చిన మద్దతు పార్టీకి మరింత బలం పెరిగిందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం హాలియాలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యకర్తలు చేసిన కృషి కారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పుంజుకొని మంచి ఫలితాలు సాధించి కాంగ్రెస్ పార్టీకి గట్టి పోటీ ఇచ్చిందని చెప్పారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో గ్రామపంచాయతీలకు జరిగిన ఎన్నికల్లో తమ పార్టీ సుమారు 45 శాతం ఓట్లు సాధించి కాంగ్రెస్ పార్టీకి ధీటుగా సమాధానమిచ్చిందని తెలిపారు.నియోజకవర్గంలో 195 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగగా అందులో 35 ఏకగ్రీవం కాగా మిగిలిన 160 స్థానాలలో 65 స్థానాలు బిఆర్ఎస్ అభ్యర్థులు సర్పంచులుగా గెలిచి పార్టీ సంస్థాగతంగా బలంగా ఉందని నిరూపించినట్లు చెప్పారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యకర్తలు అధైర్య పడవద్దని కార్యకర్తలకు వెన్నంటే తాము ఉంటామని ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో కెవి రామారావు,ఎక్కలూరి శ్రీనివాస్ రెడ్డి,వర్ర వెంకటరెడ్డి,వెంకటేశ్వర్లు,యనమల సత్యం,హలీం పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు నల్లగొండ జిల్లా క్రీడాకారుల ఎంపిక

ప్రజాపక్షం/నందికొండ: నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలోని డిఎవి హైస్కూల్లో శుక్రవారం జిల్లా స్థాయి సీనియర్ నెట్‌బాల్ ఎంపికలు విజయవంతంగా ముగిశాయి. ఈ ఎంపికలను ఉమ్మడి నల్లగొండ జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగగాఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఎవి హై స్కూల్ ప్రిన్సిపాల్ జే. పవన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా జనరల్ సెక్రటరీ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 24, 25,26 తేదీల్లో కేసముద్రం, మహబూబాబాద్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. ఈ పోటీల్లో నల్లగొండ జిల్లా జట్టు మెరుగైన ప్రదర్శన కనబర్చి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు.ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించేందుకు జాతీయస్థాయి సీనియర్ క్రీడాకారులు అనురాగ్ నాయక్, అతిక్ ప్రేమ్ కుమార్,రాము సాయి,సంయుత్ నాయుడు హాజరయ్యారు. డిఎవి స్కూల్ పీఈటీ సాయికుమార్ ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.



# ఇసుకను తెగ తోడేస్తున్నారు!

### రాజకీయ నాయకుల కనుసైగల్లోనే పట్టించుకోని అధికారులు



ప్రజాపక్షం/సూర్యాపేట : సూర్యాపేట నియోజకవర్గంలో మూసీ పరివాహక ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమార్కులు ఇసుకను తెగ తోడేస్తున్నారు. రాజకీయ నాయకుల కనుసైగల్లోనే ఈ ఇసుక దందా కొనసాగుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవల్సిన మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు వారు ఇచ్చే మామూళ్ళకు ఆశపడి ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. సూర్యాపేట నియోజక వర్గంలోని మూసీ పరివాహక ప్రాంతాలైన సూర్యాపేట మండలం కాసరబాద, రాయినిగూడెం, కెటిఅన్నారం, పెన్‌పహాడ్ మండలంలోని దోసపహాడ్, నాగులపాటి అన్నారం గ్రామాల్లో అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతుంది. అక్రమార్కులు రాత్రనక పగలనక మూసి వాగులో ఇసుకను తెగ తోడేస్తున్నారు. మూసీ వాగులో నీరు ప్రవహిస్తున్నా తెప్పలతో వెళ్ళి ఇసుకను కూలీలతో తోడించి ఒడ్డుకు తెస్తున్నారు. అనంతరం ఆ ఇసుకను ట్రాక్టర్ ట్రక్కుల్లో నింపుతూ సూర్యాపేట పట్టణంతో పాటు ఇతర ప్రాంతాల్లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. మైనింగ్ అధికారులు ఇసుక సరఫరా కోసం ఆన్‌లైన్ విధానం తీసుకవచ్చినా సరఫరాకు ఆలస్యం అవుతుండడంతో భవన నిర్మాణదారులు ఇసుక అందక పనులు ఆగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు ట్రాక్టర్ ట్రక్కు ఇసుకను రూ.5వేల నుండి రూ.5 వేల 5 వందలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్న పరిస్థితి. మూసీ పరివాహక ప్రాంతాలలోని ఆయా గ్రామాల రాజకీయ నాయకుల కనుసైగల్లోనే అక్రమ ఇసుక రవాణా సాగుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మూసీ వాగు నుండి ఇసుక అక్రమ రవాణా కోసం కొంతమంది నాయకులు ప్రత్యేకంగా ట్రాక్టర్లు కొనుగోలు చేయడంతో పాటు గ్రామంలోని మరికొంత మంది ట్రాక్టర్ ఉన్నవారిని కూడా ఎంగేజ్ చేసుకొని ఈ అక్రమ ఇసుక దందాను మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాలో లాభాలు ఎక్కువగా ఉండడంతో ఈ దందాను వదులుకోకుండా వృత్తిగా ఎంచుకున్నారు. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవల్సిన మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. అక్రమ రవాణాదారుల నుండి కొంతమంది అధికారులకు రోజువారీ, నెలవారీ మామ్మూళ్ళు అందుతుండడంతోనే అడ్డుకోవడంలేదనే పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా పోలీస్‌లు ఈ అక్రమ వసూళ్ళ కోసం ప్రత్యేక దఫేదారిని ఏర్పాటు చేసుకున్నారు. అక్రమ ఇసుక రవాణాదారుల నుండి గతంలో అనేక మంది పోలీసులు అక్రమ వసూళ్ళకు పాల్పడుతుండగా జిల్లా ఉన్నతాధికారులు వారిపై వేటు వేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అయినా వారి తీరులో మాత్రం ఎలాంటి మార్పు రాలేదు. కొంతమంది పై అధికారులు తమ అక్రమ సంపాదన కోసం కిందిస్థాయి సిబ్బందిని బలిచేస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి ఈ అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా ఘంటసాల జయంతి వేడుకలు

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : గాన గంధర్వ పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వర రావు 103వ జయంతి సందర్భంగా జ్ఞాన సరస్వతి కళావేదిక బుర్రి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా బాలభవన్ ఆవరణలో రాష్ట్రస్థాయి పాటల పోటీలను నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వూర రామమ్మూర్తి యాదవ్ ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట కళలకు పుట్టినిల్లు అని ఎందరో కళాకారులుగా ఎదిగారని పేటకు వారి ప్రతిభతో వన్నె తెచ్చారని అన్నారు. జీవితంలో ఎంతో ఒత్తిడిలు ఉన్నా కళల వల్ల ప్రతి ఒక్కరూ సేదతీరుతారని తెలిపారు. ఏదో ఒక కళలో రాణించడం లేదా ఆసక్తి కనబరచడం ద్వారా ఆరోగ్యానికి మేలు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్న జూనియర్ ఘంటసాలగా పేరుగాంచిన బుర్రి వెంకటేశ్వర్లుకి అభినందనలు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో భూపతి రాములు, జైలర్ సుధాకర్ రెడ్డి, చిన్న శ్రీరాములు, డాక్టర్ రంగారెడ్డి, హమీద్‌ఖాన్, సైదులు, వరప్రసాద్, పోతురాజ్, రాధాకృష్ణ పాల్గొన్నారు.




# విద్యార్థిని ఆత్మహత్యాయత్నం..

### భవనంపై నుండి దూకిన శివాణి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డిగ్రీ విద్యార్థిని



ప్రజాపక్షం/నల్లగొండ : నల్లగొండ మండలం చర్లపల్లి ఎస్‌సి గురుకుల కళాశాలలో చండూరు మండలం జోగిగూడెం చెందిన రాసాల శివాణి డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.శుక్రవారం ఉదయం 6:41నిమిషాల సమయంలో తోటి విద్యార్థినిలు అందరు కింద ఉన్న సమయంలో తన రూమ్ నుండి పరుగున వచ్చి కళాశాలలోని మూడవ ఫ్లోర్ నుండి కిందకి దూకింది.బిల్డింగ్ పై నుండి దూకిన శివానిని గుర్తించిన సహచర విద్యార్థులు,అధ్యాపకులు కలిసి వెంటనే పట్టణంలోని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం యువతి పరిస్థితి విషమంగా ఉంది.కాగా జీవితంపై విరక్తి చెంది తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు శివాణి సూసైడ్ లెటర్ రాసిందని రూరల్ ఎస్ఐ సైదాబాబు చెపుతున్నారు. అయితే విద్యార్థినికి తల, మెడ ప్రాంతంలో తడుతో ఊరి వేసినట్లు తీవ్ర గాయాలయలు కవడంతో విద్యార్థులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.విషయం తెలుసుకున్న ఎఐఎస్ఎఫ్ రాష్ట ఉపాధ్యక్షలు బరిగెల వెంకటేష్ చికిత్స పొందుతున్న విద్యార్దిని శ్రావణిని పరామర్శించి కళాశాలలో జరిగిన సంఘటనపై తోటి విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. చదువులో మంచి ప్రతిభ కనబరిచే శ్రావణి ఆత్మహత్యాయత్నం చేసుకోవడం గల కారణాలు తెలపాలని కళాశాల ప్రిన్సిపాల్‌ను డిమాండ్ చేశారు. సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్యాయత్నం ఎందుకు చేసుకున్నట్లు అనే విషయంపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. కళాశాలలో విద్యార్థుల పట్ల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే ఇలాంటి సంఘటనలు ఆయా గురుకుల,ప్రైవేట్, ప్రభుత్వ వసతి గృహాలలో చోటు చేసుకుంటున్నయని పేర్కొన్నారు.ఇప్పటికైనా విద్యార్థులకు చదువులతో పాటు మనోధైర్యం నింపి ఇలాంటి సంఘటనలు పునావృతం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## అర్హులైన ప్రతి విద్యార్థికి సంక్షేమ పథకాలు

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: ప్రభుత్వ విద్య, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి విద్యార్థికి పూర్తిస్థాయిలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.ఫ్రీ మెట్రిక్ స్కాలర్షిప్ ల పై శనివారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విద్య, సంక్షేమ శాఖలు, లీడ్ బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు.స్కాలర్షిప్ దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, అర్హత, నిర్ధారణ, బ్యాంకు ఖాతాల ధ్రువీకరణ వంటి అన్ని దశలను సమయపాలనతో పూర్తి చేయాలని సూచించారు.ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాల అనుసంధానంలో లోపాలు, ఆధార్ సీడింగ్ సమస్యల వల్ల విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా లీడ్ బ్యాంక్ అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. 50 శాతం దరఖాస్తులు పూర్తిచేసిన మండలాలు 100 పూర్తి చేసే విధంగా ప్రయత్నం చేయాలని ఎంఈ ఓ లకు ఇచ్చిన టార్గెట్ ను పూర్తి చేయాలని కోరారు . జిల్లాలో 6 శాతం ఉన్న స్కాలర్షిప్ దరఖాస్తులను 60 పూర్తి చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లా కు అభినందనలు తెలియజేశారని, ఇది అందరి సమిష్టి కృషి అని తెలిపారు. 100 దరఖాస్తులు పూర్తిచేసిన తిరుమలగిరి సాగర్ ఎంఇఒను కలెక్టర్ అభినందించారు. విద్యాశాఖ,సంక్షేమ శాఖ అధికారులు విద్యాసంస్థల స్థాయిలో అవగాహన కల్పిస్తూ విద్యార్థులు స్కాలర్షిప్లకు దూరం కాకుండా పర్యవేక్షణ చేసి స్కాలర్షిప్ అందే విధంగా చూడాలని అన్నారు.రెవిన్యూ అదనపు కలెక్టర్ జే .శ్రీనివాస్,జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి,జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శశికళ లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ శ్రామిక్ ఉన్నారు.

# సైబర్ నేరగాళ్ల ఉచ్చులో రిటైర్ టీచర్

### డిజిటల్ అరెస్ట్ చేస్తామని బెదిరిస్తూ ఫోన్ కాల్స్

### రూ.18 లక్షలు ట్రాన్స్‌ఫర్ కాకుండా నిలువరించిన పోలీసులు



ప్రజాపక్షం/నలగొండ : నల్లగొండ పట్టణానికి చెందిన రిటైర్ టీచర్ పుచ్చకాయల దేవేందర్ రెడ్డి పేరుతో కొత్త సిమ్ తీసుకుని బెంగళూరులో డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు తప్పుడు ఆరోపణలు చేస్తు డిజిటల్ అరెస్ట్ చేస్తామని బెదిరిస్తూ సైబర్ నేరగాళ్ల ఫోన్ కాల్స్ చేశారు. తమమిచ్చిన అకౌంట్ నెంబర్‌కు వెంటనే రూ.18 లక్షలు డిపాజిట్ చేయాలి అంటూ డిమాండ్ చేశారు.సైబర్ నేరగాళ్ల ఫోన్ కాల్స్ బెదిరింపులకు భయపడిన దేవేందర్ రెడ్డి రూ.18 లక్షలు ట్రాన్స్ఫర్ చేయడానికి ప్రకాశం బజార్‌లోని ఎస్‌బిఐ బ్యాంకులో ఒక్కసారిగా రూ.18 లక్షలు డిపాజిట్ చేయాలని బ్యాంక్ మేనేజర్ ను కోరడంతో మేనేజర్‌కు అనుమానం వచ్చి వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.తక్షణమే సంబంధిత బ్యాంకుకు చేరుకున్న సైబర్ క్రైమ్ డిఎస్‌పి లక్ష్మీనారాయణ,ఎస్ఐ విష్ణుకుమార్‌లు దేవేందర్ రెడ్డికి వచ్చిన ఫోన్ కాల్ లిస్ట్‌ను పరిశీలించి సైబర్ నేరగాళ్లకు తిరిగి కాల్ చేసి పోలీసులు ప్రశ్నలకు తడబడిన సమాధానాలు చెపుతు వెంటనే ఫోన్ స్విచ్ ఆఫ్ చేశారు.పోలీసులు వేంటనే అప్రమత్తంమై రూ.18 లక్షలు ట్రాన్స్ఫర్ కాకుండా నిలువరించగలిగరు.ఈ ఘటనపై డిఎస్‌పి లక్ష్మీనారాయణ డిజిటల్ అరెస్ట్ పేరుతో ప్రభుత్వ సంస్థలు లేదా అధికారులు గాని బెదిరించటం,భయపెట్టడం, వీడియో కాల్స్ ద్వారా అరెస్టులు చేయరని ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. అటువంటి కాల్స్ వస్తే నమ్మకుండా వెంటనే డబ్ల్యూ డబ్ల్యూ సైబర్ క్రైమ్ గౌట్ ఇన్ కు లేదా 1930 టోల్ ఫ్రీ నెంబర్ కి ఫోన్ చేసి రిపోర్ట్ చేయాలని సూచించారు. సకాలంలో స్పందించి సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా కాపాడిన నల్లగొండ సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ, ఎస్ఐ విష్ణు,హెడ్ కానిస్టేబుల్ రియాజ్, కానిస్టేబుల్ మోక్షిద్ లను జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అభినందించారు.

## గ్రూప్ (-)3 లో మెరిసిన ఆణిముత్యాలు



ప్రజాపక్షం/మోతె : గ్రూప్ 3లో మెరిసిన ఆణిముత్యాలు మండల కేంద్రానికి చెందిన బొల్లం గోపాలకృష్ణ 1 నుంచి 4వ తరగతి వరకు శ్రీవేంకటేశ్వర విద్యానికేతన్ మామిళ్ళగూడెం పాఠశాల 5 నుంచి 10వ తరగతి వరకు సర్వేల్ పాఠశాల నందు గ్రాడ్యూయేషన్ ఎన్ఐటి రాయ్‌పూర్ చత్తీస్‌ఘడ్‌లో చదువుకొని గ్రూప్ 3లో జూనియర్ అసిస్టెంట్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఉద్యోగం సాధించాడు. దీంతో తల్లిదండ్రులు బొల్లం వెంకన్న యల్లమ్మల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మండల పరిధిలోని గోపతండకు చెందిన జరుపుల రంగ 1 నుంచి 5వ తరగతి వరకు గోపతండ ప్రభుత్వ పాఠశాల, 6 నుంచి 10వ తరగతి వరకు తుమ్మగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్ ఎస్‌విఎస్ కూసుమంచి కళాశాల బిటెక్ ఖమ్మం జిల్లా కారేపల్లి కవిత ఇంజనీరింగ్ కళాశాలలో చదివి నేడు గ్రూప్‌లో అసిస్టెంట్ ఆడిటర్‌గా సెలెక్ట్ కావడంతో రంగ తండ్రి జరుపుల భీమ్లా నాయక్ 2013 చనిపోవడంతో తల్లి జరుపుల బుజ్జి రెక్కల కష్టంతో చదివించడంతో తల్లిని గ్రామ ప్రజలు ప్రశంశిస్తున్నారు.

### విపత్తు సమయంలో ప్రజలకు

# అధికార యంత్రాంగం సేవలందించాలి

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్





ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : విపత్తు సమయంలో ప్రజలకు అవసరమైన సేవలందించేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వరదలు, పరిశ్రమల ప్రమాదాల నివారణపై ఈనెల 22న నిర్వహించు మాక్ ఎక్సర్సైజ్ గురించి శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎన్‌డిఎంఎ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటి) డైరెక్టర్ సుధీర్ బాల్, తెలంగాణ ఫైర్ సర్వీస్ డైరెక్టర్ నారాయణ రావు, సంబంధిత శాఖల అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ వరదలు, విపత్కర పరిస్థితులలో అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ శాఖలు అప్రమత్తంగా ఉండి తగిన విధంగా చూసుకోవాలని అన్నారు. వరదలు వచ్చినప్పుడు ఏ ప్రాంతం నుండి ఏ ప్రాంతం వైపు వెళ్ళాలి, ఉపశమన శిభిరం ఎక్కడ పెట్టాలి అనేది ముందుగానే చూసుకోవాలని చెప్పారు. సహాయక శిభిరంలో ఆహారం, త్రాగునీరు, శానిటేషన్, మెడిసెన్స్ ఉండే విధంగా చూసుకోవాలని, శిభిరంలో ఎక్కువ రోజులు బాధితులు ఉన్నట్లయితే వారికి సరిపోను రేషన్ బియ్యం, సరుకులు, నూనెలు పంపిణీ చేయాలని, పాఠశాలలోకి వరద నీరు వస్తే ముందుగా పిల్లలను రక్షించాలని, పంటలకు నష్టం జరగకుండా ముందుగానే తగిన ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రైతులను న్యూస్ ఛానల్, రేడియోల ద్వారా తుఫాన్ హెచ్చరికలు జారీ చేయాలని చెరువుగట్లు, ఏటి గట్లు పటిష్టంగా ఉండే విధంగా చూసుకోవాలని వరదలు, విపత్కర పరిస్థితులలో ప్రజలను అప్రమత్తం చేయడానికి మూడు మున్సిపాలిటిలు, నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏదో ఒక ప్రాంతంలో మాక్ డ్రిల్ ఎక్సర్సైజ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇట్టి డ్రిల్‌లో అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖలను, ప్రజలను భాగస్వాములు చేయాలని సూచించారు. మాక్ డ్రిల్ ద్వారా ప్రజల్లో ఒక అవగాహన కలిగి వరదలు, విపత్కర పరిస్థితిలో తమను తాము రక్షించుకోవడంలో ఉపయోగపడతాయన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు అదనపు కలెక్టర్ కె సీతారామారావు, అదనపు ఎస్‌పిలు రవీందర్ రెడ్డి, జనార్థన్ రెడ్డి, జడ్‌పి సిఇఓ అప్పారావు, డిపిఓ యాదగిరి పాల్గొన్నారు.

# సాగర్‌లో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తం

### క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ శూన్యం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం...



ప్రజాపక్షం/నందికొండ: నాగార్జునసాగర్ లో విద్యుత్ సరఫరా పూర్తిగా గాడి తప్పుతుంది. రోజుకు గంటల తరబడి ఎన్నోసార్లు తెలియకుండా విద్యుత్ నిలిచిపోతూ ఉండటం పరిపాటిగా మారింది వర్షం లేదు,ఈదురు గాలులు లేవు,అయినా సరే ప్రతిరోజు గంటల తరబడి విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం పక్కనే ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఉండి, పుష్కలంగా పవర్ ఉన్నా కూడా నందికొండమున్సిపాలిటీలో అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరాను చేయడంలో విద్యుత్ శాఖ పూర్తిగా విఫలమవుతోంది ఇది సాంకేతిక లోపం కాదు పూర్తిగా అధికారుల వైఫల్యమేనని ప్రజలు మండిపడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి స్థానికులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నార న్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.పగలురాత్రి తేడా లేకుండా విద్యుత్ నిలిచిపోవడం వల్ల గృహజీవితం ఇబ్బందికరంగా మారడం విద్యార్థులు చదువుకోలేని పరిస్థితి, ఏర్పడడం వ్యాపారాలు మూతపడే స్థితి,రోగులు అంధకారంలో విలవిల్లే దుస్థితి నెలకొంది.అయినా విద్యుత్ శాఖ అధికారులు మౌనవ్రతం పాటిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఎన్నో నెలలుగా కొనసాగుతున్న ఈవ్యవహారంతో ప్రజల సహనం అంచులకు చేరుతోంది. అధికారులు తమ బాధ్యతలను పూర్తిగా విస్మరించిన ఫలితంగా విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి ఇంత జరుగుతున్నా అధికారుల్లో చలనం కనిపించడం లేదు.ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల నిర్వహణకు సరైన చర్యలు లేకపోవడం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పూర్తిగా శూన్యమని విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు చేసినా,సమస్యలు చెప్పినా స్పందన లేకపోవడం ప్రజల ఆగ్రహాన్ని మరింత పెంచుతోంది.ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామంటూ స్థానిక ప్రజలు హెచ్చరిస్తున్నారు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## జార్ఖండ్ వాసిని కొట్టి చంపినందుకు ఐదుగురి అరెస్టు

**పాలక్కాడ (కేరళ) :** ఇక్కడ వలయార్ సమీపంలో దొంగతనం చేశాడనే అనుమానంతో జార్ఖండ్‌కు చెందిన ఒక వ్యక్తిని కొట్టి చంపినందుకు ఐదుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి ఆలస్యంగా అరెస్టులను అధికారికంగా నమోదు చేశామని, నిందితులందరిపై భారతీయ న్యాయ సంహిత కింద హత్య నేరం కింద కేసు నమోదు చేసినట్లు వలయార్ పోలీస్ స్టేషన్ అధికారి తెలిపారు. మృతుడు రామనారాయణ్ భయార్ (31) వలయార్ ప్రాంతంలో కూలీగా పనిచేస్తున్నాడు. పోలీసుల ప్రకారం, బుధవారం సాయంత్రం వలయార్ సమీపంలోని కిళక్కేటప్పల్లంలో జరిగిన దొంగతనంలో భయార్ ప్రమేయం ఉందని ఆరోపిస్తూ కొందరు వ్యక్తులు అతనిపై దాడి చేశారు. ఎఫ్ఐఆర్ ప్రకారం, ఈ ఘటన రాత్రి 7.40 గంటలకు ముందు జరిగింది, గాయపడిన భయార్‌ను పాలక్కాడ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ అతను చికిత్స పొందుతూ మరణించాడు. ఈ ఘటనకు దారితీసిన పరిణామాలను నిర్ధారించడానికి వివరణాత్మక దర్యాప్తు జరుగుతోందని పోలీసులు తెలిపారు.

# పార్లమెంట్ నిరవధిక వాయిదా

● ఎంఎన్ఆర్ఇజిఎ చట్టం రద్దు, పౌర అణుశక్తి రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం వంటి కీలక బిల్లులు ఆమోదం
● లోక్‌సభలో 92.25 గంటల పాటు
● రాజ్యసభ సుమారు 92 గంటల పాటు కార్యకలాపాలు

**న్యూఢిల్లీ :** పార్లమెంటు శీతాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. డిసెంబర్ 1న ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. మొత్తం 15 రోజుల పాటు పార్లమెంట్ ఉభయ సభలు పనిచేశాయి. శుక్రవారం లోక్‌సభలో సభ్యులు జాతీయ గీతం ఆలపించిన తర్వాత స్పీకర్ ఓం బిర్లా సభను నిరవధికంగా వాయిదా వేశారు. అటు రాజ్యసభలో ప్రశ్నోత్తరాల తర్వాత రాజ్యసభ చైర్మన్ సిపి రాధాకృష్ణన్ సభను నిరవధికంగా వాయిదా వేశారు. ఇరు సభలు నిరవధిక వాయిదా పడడంతో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగిశాయి. ఈ సమావేశాల్లో 20 ఏళ్ల నాటి ఎంఎన్ఆర్ఇజిఎ చట్టాన్ని రద్దు చేసే బిల్లుతో పాటు, పౌర అణు రంగాన్ని ప్రైవేటు రంగానికి తెరిచేందుకు సంబంధించిన మరో బిల్లుతో సహా పలు కీలక బిల్లులు ఆమోదం పొందాయి. శీతాకాల సమావేశాలు 92 గంటల 25 నిమిషాల పాటు సాగాయి. ఉదయం సభ సమావేశమైన వెంటనే, స్పీకర్ ఓం బిర్లా తన సంక్షిప్త ముగింపు ప్రసంగాన్ని చదివారు. కీలకమైన చట్టాలపై చర్చించడానికి సభ్యులు ఆలస్యంగా కూర్చున్నందున, ఈ సమావేశాల్లో లోక్‌సభ ఉత్పాదకత 111 శాతంగా నమోదైందని ఆయన పేర్కొన్నారు. బిర్లా తన ముగింపు ప్రకటనను చదువుతున్నప్పుడు, కొంతమంది సభ్యులు 'మహాత్మా గాంధీకి జై' అని నినాదాలు చేయడం వినిపించింది. సభా కార్యకలాపాలు వాయిదా పడినప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభలోనే ఉన్నారు. శీతాకాల సమావేశాల 15 సిట్టింగ్‌లలో, సభ రెండు రాజకీయంగా ప్రాధాన్యత ఉన్న చర్చలను చేపట్టింది. అందులో ఒకటి వందేమాతరం 150 వార్షికోత్సవం కాగా, మరొకటి ఎన్నికల సంస్కరణలపై ఉన్నది. జాతీయ గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధానమంత్రి ఒక చర్చను ప్రారంభించారు. సభ ఈ విషయంపై 11 గంటల 32 నిమిషాల పాటు చర్చించింది, ఈ చర్చలో 65 మంది సభ్యులు పాల్గొన్నారు. 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై చర్చ జరపాలని ప్రతిపక్షం పట్టుబట్టింది, అయితే ఎన్నికల సంఘం, దాని పనితీరుపై సభలో చర్చించలేమని ప్రభుత్వం పేర్కొంటూ దానికి బదులుగా ఎన్నికల సంస్కరణలపై చర్చకు అంగీకరించింది. ఈ విషయంపై సుమారు 13 గంటల పాటు చర్చ జరిగింది. ఇందులో 63 మంది ఎంపిలు పాల్గొన్నారు. అయితే, ప్రతిపక్షం ఎస్ఐఆర్, ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకంపై కొత్త చట్టం, 'ఓట్ల దొంగతనం' సమస్యపై తమ దృష్టి కేంద్రీకరించి కేంద్ర సర్కార్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఈ సమావేశాల్లో ఎనిమిది బిల్లులు ఆమోదం పొందాయి. గ్రామీణ భారత దేశానికి 125 రోజుల పాటు హామీతో కూడిన ఉపాధిని కల్పించే వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) లేదా 'విబి–జి రామ్ జి' బిల్లు, ప్రతిపక్షాల నిరసనలు, పత్రాల చించివేతల మధ్య గురువారం ఆమోదం పొందింది. కట్టుదిట్టంగా నియంత్రించబడుతున్న పౌర అణు రంగాన్ని ప్రైవేట్ భాగస్వామ్యానికి తెరిచేందుకు సస్టైనబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (శాంతి) బిల్లు కూడా ఈ సమావేశాల్లో ఆమోదం పొందింది. ప్రస్తుతం ఉన్న 74 శాతం నుండి బీమా రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డిఐ) 100 శాతానికి పెంచే బిల్లును కూడా లోక్‌సభ ఆమోదించింది. లోక్‌సభలో ఆమోదం పొందిన ఇతర బిల్లులలో సబ్‌కా బీమా సబ్‌కీ రక్ష (బీమా చట్టాల సవరణ) బిల్లు, 2025 రాజ్యసభలో మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. కాలం చెల్లిన 65 సవరణ చట్టాలు, ఆరు ప్రధాన చట్టాలను రద్దు చేసే బిల్లును కూడా సభ ఆమోదించింది. మణిపూర్ వస్తువులు, సేవల పన్ను (రెండవ సవరణ) బిల్లు, 2025; కేంద్ర ఎక్సైజ్ (సవరణ) బిల్లు, 2025, ఆరోగ్య భద్రత నుండి జాతీయ భద్రతా సెస్ బిల్లు, 2025 కూడా ఆమోదం పొందిన బిల్లులలో ఉన్నాయి. 2025–26 సంవత్సరానికి సంబంధించిన అనుబంధ పద్దుల డిమాండ్ల మొదటి విడతను కూడా సభ ఆమోదించింది. ఉన్నత విద్యా నియంత్రణ సంస్థను ఏర్పాటు చేసేందుకు ఉద్దేశించిన వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు, 2025ను ఉభయ సభల సంయుక్త కమిటీకి పంపారు. మార్కెట్ సెక్యూరిటీల కోడ్‌పై మరో బిల్లును ప్రవేశపెట్టి, తదుపరి పరిశీలన కోసం సంబంధిత



స్టాండింగ్ కమిటీకి పంపారు. ఈ సమావేశాల్లో 300 నక్షత్రపు గుర్తు గల ప్రశ్నలు స్వీకరించబడ్డాయి. 72 నక్షత్రపు గుర్తు గల ప్రశ్నలకు మౌఖికంగా సమాధానాలు ఇచ్చారు. ఈ సమావేశాల్లో మొత్తం 3449 నక్షత్రపు గుర్తు లేని ప్రశ్నలు స్వీకరించబడ్డాయి. జీరో అవర్‌లో సభ్యులు మొత్తం 408 అత్యవసర ప్రజా ప్రాముఖ్యత గల అంశాలను లేవనెత్తారు. రూల్ 377 కింద మొత్తం 372 అంశాలు చర్చకు తీసుకోబడ్డాయి. 2025 డిసెంబర్ 11న, సభలో జీరో అవర్ సమయంలో 150 మంది సభ్యులు తమ అంశాలను ప్రస్తావించారు.

### రాజ్యసభలో 121 శాతం ఉత్పాదకత

రాజ్యసభ చైర్మన్ సి పి రాధాకృష్ణన్ శుక్రవారం గ్రామీణ ఉపాధి హామీ బిల్లు (జి రామ్ జి) ఆమోదం సమయంలో ప్రతిపక్ష సభ్యులు సృష్టించిన అంతరాయాలను తీవ్రంగా ఖండించారు. వారి ప్రవర్తన పార్లమెంటు సభ్యులకు తగనిదని పేర్కొంటూ, భవిష్యత్తులో ఇటువంటి ప్రవర్తనకు దూరంగా ఉండాలని, ఆత్మపరిశీలన చేసుకోవాలని వారిని కోరారు. 15 రోజుల పాటు జరిగిన శీతాకాల సమావేశాల సందర్భంగా జరిగిన శాసనపరమైన, ఇతర కార్యకలాపాల సారాంశాన్ని రాధాకృష్ణన్ చదివి వినిపించిన తర్వాత సభను నిరవధికంగా వాయిదా వేశారు. ఎగువ సభ 269వ సమావేశం అత్యంత ఉత్పాదకతతో సాగిందని, సుమారు 92 గంటల పాటు సమావేశాలు జరిగి 121 శాతం ఉత్పాదకతను నమోదు చేసిందని ఆయన అన్నారు. తన ముగింపు ప్రసంగంలో, రాధాకృష్ణన్ మాట్లాడుతూ, పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత సభకు అధ్యక్షత వహించడం ఇదే తన మొదటి సారి కాబట్టి శీతాకాల సమావేశాలు ముఖ్యమైనవని అన్నారు. ఈ సమావేశంలో జీరో అవర్ కార్యకలాపాలలో అపూర్వమైన పెరుగుదల నమోదైందని, సగటున ప్రతిరోజూ 84 కంటే ఎక్కువ నోటీసులు అందాయని, ఇది గత రెండు సమావేశాల కంటే 31 శాతం ఎక్కువ అయితే వాస్తవానికి లేవనెత్తిన అంశాలు రోజుకు సగటున 15 కంటే ఎక్కువగా ఉన్నాయని, ఇది దాదాపు 50 శాతం పెరుగుదల అని ఆయన అన్నారు. వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా 82 మంది సభ్యుల భాగస్వామ్యంతో రెండు రోజుల పాటు ప్రత్యేక చర్చ జరిగింది. ఎన్నికల సంస్కరణలపై జరిగిన మూడు రోజుల చర్చలో 57 మంది సభ్యులు ప్రసంగించారు.


ఈ సమావేశాల సందర్భంగా రాజ్యసభ ఎనిమిది బిల్లులను ఆమోదించింది లేదా తిరిగి పంపింది. 212 మంది సభ్యుల భాగస్వామ్యంతో జల (కాలుష్య నివారణ, నియంత్రణ) సవరణ చట్టం, 2024పై ఒక శాసన తీర్మానాన్ని ఆమోదించింది. ఏకంగా 59 ప్రైవేట్ సభ్యుల బిల్లులు ప్రవేశపెట్టబడ్డాయి. ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యం సజీవత్వాన్ని ప్రతిబింబిస్తుందని రాధాకృష్ణన్ అభివర్ణించారు. సమావేశాల సందర్భంగా 58 నక్షత్రపు గుర్తు గల ప్రశ్నలు, 208 జీరో అవర్ ప్రస్తావనలు, 87 ప్రత్యేక ప్రస్తావనలు ఉన్నాయని కూడా చైర్మన్ పేర్కొన్నారు, రూల్ 267 పరిధిని స్పష్టం చేస్తూ తాను ఒక వివరణాత్మక తీర్పును జారీ చేశానని చెప్పారు. సభా కార్యకలాపాలు సజావుగా జరిగేలా చూడటంలో తమ పాత్ర పోషించినందుకు ఉపరాష్ట్రపతి, ఉపాధ్యక్షుల ప్యానెల్ సభ్యులకు, రాజ్యసభ సచివాలయానికి మరియు మీడియాకు రాధాకృష్ణన్ ధన్యవాదాలు తెలిపారు.

### వాడీవేడీగా సమావేశాలు

ఈ శీతాకాల పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం నుంచే వాడీవేడీగా జరిగాయి. ఇండిగో సంక్షోభం, ఎస్ఐఆర్, ఎన్నికల సంస్కరణలు వంటి అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ సమయంలో అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. ఈ సెషన్ లో మొత్తం 59 బిల్లులను ప్రవేశపెట్టారు. ఎనిమిది బిల్లులను పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదించాయి. అందులో ఎంజీ నరేగా స్థానంలో తీసుకొచ్చిన వీబీ జీ రామ్ జీ బిల్లు, పౌర అణు రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనుమతించే బిల్లులు, బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితిని 100 శాతానికి పెంచే బీమా సవరణ బిల్లు సహా మరి కొన్ని ఉన్నాయి.

## 'చాయ్ రాజా చాయ్'

లోక్‌సభ స్పీకర్ తేనేటి విందులో పాల్గొన్న అధికార, ప్రతిపక్ష నేతలు



**న్యూఢిల్లీ:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు శుక్రవారం నిరవధికంగా వాయిదా పడిన తర్వాత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా, ఎన్‌సిపిఎస్‌పికి చెందిన సుప్రియా సూలే, ఇతర నాయకులు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ఆయన ఛాంబర్‌లో కలిశారు. సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించినందుకు నాయకులు బిర్లాకు ధన్యవాదాలు తెలిపారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రులు కె రామ్ మోహన్ నాయుడు, రాజీవ్ రంజన్ సింగ్ 'లలన్', చిరాగ్ పాశ్వాన్, ప్రహ్లాద్ జోషి స్పీకర్‌తో కలిసి తేనీటి విందులో పాల్గొన్నారు. '18వ లోక్‌సభ ఆరవ సమావేశం ముగిసిన తర్వాత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అన్ని పార్టీల గౌరవనీయ నాయకులతో ఒక ఆహ్లాదకరమైన సంభాషణ జరిగింది' అని బిర్లా ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో తెలిపారు.

శబరిమలలో బంగారం చోరీ కేసు

## ఇడికి దర్యాప్తునకు కోర్టు ఆదేశం

**తిరువనంతపురం:** శబరిమల అయ్యప్ప ఆలయంలోని బంగారు చోరీ కేసులో కొల్లం విజిలెన్స్ కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. బంగారు దోపిడీపై దర్యాప్తు చేయడానికి కొల్లం విజిలెన్స్ కోర్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)కి అనుమతి ఇచ్చింది. ఈ కేసుకు సంబంధించిన అన్ని పత్రాలను ఇడికి అప్పగించాలని కోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఆదేశించింది. ఇప్పటివరకు నమోదైన రెండు ఎఫ్ఐఆర్ కాపీలు, నిందితులకు సంబంధించిన రిమాండ్ రిపోర్టులు సహా ఇతర కీలక దస్త్రాలను ఇడికి తక్షణమే ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసులో ఇడి త్వరలో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదుచేయనుందని తెలిసింది. శబరిమల ఆలయంలోని దేవుడి విగ్రహాల బంగారు తాపడం బరువులో వ్యత్యాసంపై దర్యాప్తు చేపట్టేందుకు కేరళ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా సిట్ ఏడుగురిని అరెస్టు చేసింది. అయితే మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టేందుకు అనుమతించాలని కోరుతూ ఈడీ తొలుత కేరళ హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు సూచన మేరకు కొల్లాం విజిలెన్స్ కోర్టులో పిటిషన్ వేయగా, ఇడి విజ్ఞప్తిని సిట్ వ్యతిరేకించింది. ఒకేసారి రెండూ కొనసాగడం దర్యాప్తును ప్రభావితం చేస్తాయని అభిప్రాయపడింది. సిట్ వాదనలను తిరస్కరించిన కొల్లాం విజిలెన్స్ కోర్టు, ఇడి విచారణకు అనుమతిచ్చింది.

పార్లమెంట్ ఔచిత్యం క్రమంగా తగ్గడం

## ప్రజాస్వామ్యానికి తీవ్ర ప్రమాదం

● రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ ధ్వజం



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ ఔచిత్యం క్రమంగా తగ్గడం ప్రజాస్వామ్యానికి తీవ్ర ప్రమాదం అని రాజ్యసభ్య సభ్యుడు, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న వారు దాని గురించి పెద్దగా పట్టించుకోకుండా ప్రస్తుత కాలంలో అసంబద్ధమైన అంశాలపై దృష్టి సారిస్తున్నారని ఆరోపించారు. సీనియర్ న్యాయవాది, స్వతంత్ర ఎంపి కపిల్‌సిబల్ మాట్లాడుతూ ఇది ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరం అన్నారు. ఫలితంగా నిజమైన సమస్యలు పార్లమెంట్‌లో చర్చించబడటంలేదన్నారు. ఆయన శీతాకాలం సమావేశాల చివరిరోజైన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. శీతాకాలపు సమావేశాలు డిసెంబరు 1నుంచి 19వరకు 15 సమావేశాలు జరిగాయని కపిల్ సిబల్ ఎత్తిచూపారు. తాను గతంలో పార్లమెంట్ సభ్యుడుగా ఉన్నప్పుడు నవంబరు 20న ప్రారంభమయ్యేవన్నారు. 2017లో 13 సిట్టింగ్స్, 2022లో 13 సిట్టింగ్స్, 2023లో 14 సిట్టింగ్స్ జరిగాయని చెప్పారు. చర్చలు కొనసాగితే జరగాల్సినవి జరగవని, అధికారంలో ఉన్నవారు పార్లమెంట్‌లో పెద్దగా ఏమీచేయనట్లు కనిపిస్తోందని మాజీ కేంద్రమంత్రి కూడా అయిన కపిల్ సిబల్ నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలదాడికి దిగారు. డిసెంబరు 1న ప్రతిపక్షాలు ఓటర్ల జాబితాపై చర్చ లేదా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కోరుతున్నాయని, ఎందుకంటే నేడు ఎస్ఐఆర్ దేశంలో అతిపెద్ద సమస్య అని ఎత్తి చూపారు. ఓటర్ల జాబితా కలుషితమైతే మనం ప్రజాస్వామ్యంలో ఊపిరి ఎలా పీల్చుకుంటామని సిబల్ ప్రశ్నించారు. కాబట్టి ఎస్ఐఆర్ గురించి మనం చర్చించాలన్నారు. కానీ కోర్టులో ఉన్నప్పుడు మనం దాని గురించి చర్చించలేమన్నారు. కానీ బోఫోర్స్ అంశం కూడా పార్లమెంట్‌లో ఉన్నప్పుడు దానిని చర్చించడం జరిగిందని ఆయన గుర్తుచేశారు. కానీ ఎన్నికల సంఘం తమ ఆదేశం మేరకు తీసుకునే చర్యలను ప్రజలకు బహిర్గతం చేయకూడదనే ఒక సాకును చూపిస్తున్నారని కపిల్ సిబల్ ఆరోపించారు. ముందుగా ప్రభుత్వం వందేమాతరంపై చర్చిస్తామని ప్రకటించిందని, బిజెపి తన సమావేశాలను వందేమాతరంతో ప్రారంభిస్తుందా అని ప్రశ్నించారు. వారు జాతీయ గీతాన్ని నమ్మేవారు కాదని, 1942లో బ్రిటీష్‌వారి పక్షాన నిలిచిన వారు నేడు వందేమాతరం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని సిబల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చడమే వారి లక్ష్యమని, అన్ని రాష్ట్రాలు వారి నియంత్రణలో ఉన్నప్పుడు వారు ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే భాష, ఒకే జాతి, ఒకే పార్టీ అంటూ రాజ్యాంగాన్ని మార్చాలని అనుకుంటున్నారని ఆయన ఆరోపించారు. 20ఏళ్లనాటి ఎంఎన్ఆర్ఇజిఎ రద్దు చేయడం శోచనీయమన్నారు. పౌర అణురంగాన్ని ప్రైవేట్ భాగస్వామ్యం కోసం తెరవడం వంటి కీలకమైన బిల్లులను ఆమోదించిన 19 రోజుల శీతాకాలపు సమావేశాలను శుక్రవారం నిరవధికంగా వాయిదా వేశారు. గ్రామీణ భారతదేశంలో125 రోజుల ఉద్యోగ హామీనిచ్చే 'జీరామ్ జి బిల్లు' గురువారం ప్రతిపక్షాల నిరసనల మధ్య కాగితాలను చించివేస్తున్న తరుణంలో ఆమోదించబడింది. ఈ నేపథ్యంలో రాజ్యసభ కూడా వాయిదా పడింది.

## ఓడరేవులు, నౌకల భద్రతకు ప్రత్యేక దళం

● కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సమావేశానికి మంత్రులు సోనోవాల్, కె.రామ్మోహన్ నాయుడు హాజరు

**న్యూఢిల్లీ:** ఓడ రేవులు, నౌకల భద్రత మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం 'బ్యూరో ఆఫ్ పోర్ట్ సెక్యూరిటీ' (బిఓపీ'ఎస్) అనే ఒక చట్టబద్ధమైన సంస్థను ఏర్పాటు చేయనున్నదని శుక్రవారం అధికారులు వెల్లడించారు. ఇది ఓడ రేవులు నౌకల భద్రతా సంబంధిత సమాచారాన్ని సకాలంలో విశ్లేషించడం, సేకరించడం, మార్పిడి చేయడం నిర్ధారిస్తుందని తెలియజేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా గురువారం బ్యూరో ఆఫ్ పోర్ట్ సెక్యూరిటీ ఏర్పాటు కోసం ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దీనికి ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు హాజరయ్యారని ఒక అధికారిక ప్రకటన తెలియజేసింది. దేశ విధానపరంగా బలమైన ఓడరేవు భద్రతా చట్టాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని హోం మంత్రి అమిత్‌షా నొక్కిచెప్పారు. భద్రతా చర్యలను గ్రేడెడ్, రిస్క్ ఆధారిత పద్ధతిలో అమలు చేయాలని అమిత్‌షా ఆదేశించారు. ఖాతా దుర్బలత్వాలు, వాణిజ్య సామర్థ్యం, స్థానం ఇతర సంబంధిత పారామితులను పరిగణలోనికి తీసుకోవాలని ఆయన ఆదేశించారు. సముద్ర భద్రతా చట్రం నుంచి నేర్చుకున్న పాఠాలు విమానయాన భద్రతా రంగంలో ప్రతిబింబించాలని కూడా సమావేశం గుర్తించిందని ఆ ప్రకటన తెలిపింది. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బిసిఎఎస్) తరహాలో రూపొందించబడిన ఈ కొత్త సంస్థ నూతన మార్కెట్ షిప్పింగ్ చట్టం2025 ప్రకారం చట్టబద్ధమైన సంస్థగా ఏర్పడి ఓడరేవులు, షిప్పింగ్ జలమార్గాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుందని తెలియజేసింది. సీనియర్ ఐపిఎస్ అధికారి డైరెక్టర్ జనరల్‌గా వ్యవహరించే బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ సంస్థ ఓడలు, ఓడరేవు భద్రత సౌకర్యాలకు సంబంధించిన ఈ సంస్థ నియంత్రణ, పర్యవేక్షణ విధులకు బాధ్యత వహిస్తుంది. ఒక సంవత్సరం పరివర్తనకాలంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ బిఓపీఎస్ లాగా పనిచేస్తారని ప్రకటన వెల్లడించింది. 'బిఓపీ'ఎస్ భద్రతా సంబంధిత సమాచారానికి సంబంధించిన విశ్లేషణ, సేకరణ, తొలగింపును నిర్ధారిస్తుంది. డిజిటల్ బెదిరింపుల నుంచి ఓడరేవు ఐటి మౌలిక సదుపాయాలను రక్షించడానికి ప్రత్యేక విభాగంతో సహా సైబర్ భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తుంది' అని ఆ ప్రకటన వెల్లడించింది. ప్రభుత్వం సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్)ను రికగ్నైజ్డ్ సెక్యూరిటీ ఆర్గనైజేషన్ (ఆర్ఎస్ఓ)భద్రతా అంచనాలను చేపట్టడం, సౌకర్యాల కోసం భద్రతా ప్రణాళికలను తయారు చేయడం బాధ్యత. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ (సిఏపిఎఫ్) ఓడరేవుల భద్రతలో నిమగ్నమైన ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల (పిఎస్ఏ'ల)సామర్థ్యాల నిర్మాణానికి శిక్షణ ఇస్తుంది.



## అలాంటి ఒప్పందమేదీ జరగలేదు

● సిఎం పదవిపై కర్ణాటక సిద్ధరామయ్య



**బెంగళూరు:** కర్ణాటకలో సిఎం మార్పుపై సందిగ్ధత ఇంకా కొనసాగుతూనే ఉంది. త్వరలో కర్ణాటకలో సిఎం మార్పు ఉంటుందని, డికె శివకుమార్ సిఎం అవుతారని డికె వర్గం ప్రచారం చేస్తుండగా.. సిఎం మార్పు జరిగే అవకాశం లేదని, పూర్తిగా ఐదేళ్లు తానే సిఎంగా కొనసాగుతానని సిద్ధరామయ్య సంకేతాలు ఇస్తున్నారు. ఈ విషయంపై ఆయన తాజాగా మరోసారి స్పందించారు. అసెంబ్లీలో మాట్లాడుతూ.. సిఎం పదవి షేరింగ్‌కు సంబంధించి నాడు (అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తర్వాత) ఎలాంటి ఒప్పందం జరగలేదని చెప్పారు. నేను ఇప్పటికే ఒకసారి ఐదేళ్లు సిఎం పనిచేశాను. ఆ తర్వాత మళ్లీ ముఖ్యమంత్రిని అయ్యాను. నాకు తెలిసినంతవరకు పార్టీ అధిష్ఠానం నాకే అనుకూలంగా ఉంది. సిఎం పదవిని ఇద్దరు వ్యక్తులు 2.5 ఏళ్ల చొప్పున పంచుకోవాలనే ఒప్పందమేదీ జరగలేదు అని సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో ప్రతిపక్షాల కామెంట్స్‌కు స్పందనగా.. ఐదేళ్లు తానే సీఎంగా కొనసాగుతానని సిద్ధరామయ్య చెప్పడం గత నాలుగు రోజుల్లో ఇది రెండోసారి. గత మంగళవారం కూడా ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేల కామెంట్స్‌కు స్పందిస్తూ.. 'ఇప్పుడు మళ్లీ చెబుతున్నా. ప్రస్తుతం నేను రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఇక ముందు కూడా నేను ముఖ్యమంత్రిగా ఉంటా' అని వ్యాఖ్యానించారు. కాగా సిఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సిఎం శివకుమార్ మధ్య వివాదం చాలారోజులుగా కొనసాగుతోంది. ఈ విషయం హైకమాండ్ సైతం జోక్యం చేసుకుని సయోధ్య కుదిర్చింది. అయినా ప్రయోజనం లేదు. సిఎం మార్పు ఉంటుందని ప్రచారం జరుగుతూనే ఉంది.

'ఠాగూర్'కు అవమానంతో షురూ

## మహాత్ముడికి అవమానంతో ముగింపు

● పార్లమెంట్ శీతాకాల సమావేశాలపై కాంగ్రెస్ విమర్శలు



**న్యూఢిల్లీ:**పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడిన తరుణంలో సమావేశాలపై కాంగ్రెస్ ఘాటుగా స్పందించింది. ప్రభుత్వం రవీంద్రనాథ్ ఠాగూర్‌ను అవమానించడంతో ప్రారంభమై, మహాత్మాగాంధీని అవమానించడంతో ముగిశాయని కాంగ్రెస్ ఆరోపించింది. దీనిని 'కాలుష్య కాలపు' సమావేశంగా అభివర్ణిస్తూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్, వాయు కాలుష్యంపై చర్చకు తమ పార్టీ పూర్తిగా సి ద్ధంగా ఉందని, అయితే ప్రభుత్వం దానిపై చర్చకు పలాయనం చిత్తగిస్తోందని అన్నారు. 'మణిపూర్, అనుబ ంధ గ్రాంట్ల డిమాండ్లపై రెండు బి ల్లులు కేవలం లాంఛనప్రాయంగా ఉంటాయని, మొత్తం 14 బిల్లులను ప్ర వేశపెడతామని మాకు చెప్పారు. 12 బిల్లులలో ఐదింటిని ప్రవేశపెట్టలేదు. బిల్లులు తీసుకురావాలని లేనప్పుడు వారు ఈ సమాచారాన్ని ఎందుకు ఇస్తారో నాకు తెలియదు' అని రమేష్ ఒక విలేకరుల సమావేశంలో అన్నారు. 'అఖిలపక్ష సమావేశంలో నేను రాజ్‌నాథ్ సింగ్‌తో ఈ సమావేశం ఒక లాంఛనప్రాయమని, సాధారణంగా సమావేశాల చివరలో వారు ఒక బ్రహ్మాస్త్రాన్ని బయటకు తీస్తారని చెప్పాను. ఆయన నవ్వారు. ఈసారి కూడా అదే జరిగింది. చివరిలో ఒక బిల్లును తీసుకువచ్చి ప్రతిపక్షాల నినాదాల మధ్య ఆమోదించారు' అని రమేష్ వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) (విబి–జి రామ్ జి) బిల్లును ప్రస్తావిస్తూ అన్నారు. సమావేశాల సమయంలో జరిగిన వందేమాతరం చర్చ అంతా ప్రభుత్వం 'నెహ్రూను అపఖ్యాతి పాలు చేయడం, చరిత్రను వక్రీకరించడం గురించేనన్నారు. 'ఠాగూర్‌ను అవమానించారు. 1937లో ఠాగూర్ సిఫార్సు మేరకే జాతీయ గీతంగా మొదటి రెండు చరణాలను పాడాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయించింది' అని ఆయన అన్నారు. భారతదేశపు మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను కూడా అవమానించారని ఆయన అన్నారు. యుపిఎ హయాం నాటి చట్టమైన ఎండిఎన్ఆర్ఇజిఎ స్థానంలో వచ్చిన 'జి రామ్ జి బిల్లు' ఆమోదాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ, ఈ సమావేశాలు గాంధీని అవమానించడంతో ముగిశాయని జైరామ్ రమేష్ అన్నారు.

## డిసెంబరు 22న ఎమర్జెన్సీ కేసుల విచారణకు 'నేను రెడీ' : సూర్యకాంత్

**న్యూఢిల్లీ:** అత్యవసర కేసుల విచారణను డిసెంబరు 22న చేపట్టేందుకు తాను సిద్ధంగా ఉన్నానని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ శుక్రవారం వెల్లడించారు. క్రిస్టమస్, నూతన సంవత్సర సెలవుల ప్రారంభరోజైన డిసెంబరు 22న ఎమర్జెన్సీ కేసుల విచారణ కోసం కేటాయిస్తున్నట్లు చెప్పారు. అత్యవసర కేసుల జాబితాను విచారించిన సిజెఐ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, విపుల్ ఎం.పాంచోలితో కూడిన త్రిసభ్య ధర్మాసనం సుప్రీంకోర్టు రిజిస్ట్రీ కేసుల అత్యవసర పరిస్థితిని ధృవీకరించి తదనుగుణంగా జాబితాను నిర్ణయిస్తుందని తెలిపింది.

## బిఎంసి ఎన్నికల్లో శివసేన, బిజెపి మధ్య ప్రతిష్ఠంభన

**ముంబయి:**మహారాష్ట్రలో త్వరలో జరుగనున్న బిఎంసి ఎన్నికల్లో సీట్ల పంపకాల విషయంలో షిండే సారథ్యంలోని నెలకొంది. 2017 బ్రిహాన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ ఆ సమయంలో ఐక్య శివసేన గెలిచిన 84 సీట్లు తమకే కేటాయించాలని షిండే శివసేన డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ డిమాండ్‌ను బిజెపి నిర్ద్వంద్వంగా తోసిపుచ్చినట్లు సమాచారం. ప్రస్తుత పరిస్థితికి, 2017 నాటి పరిస్థితికి చాలా తేడా ఉందని బిజెపి వాదిస్తోంది. షిండే శివసేన, ఉద్ధవ్ థాక్రే శివసేన మధ్య ముఖాముఖీ పోటీ వల్ల మహాయుతి కూటమికి నష్టం జరుగుతుందని బిజెపి చెబుతోంది. షిండే శివసేన ఎక్కడైతే బలంగా ఉందో గెలుపు అవకాశాలు మెండుగా ఉన్నాయో ఆయా సీట్లను మాత్రమే కేటాయించగలమని బిజెపి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. బిఎంసిలోని 227 సీట్లలో ఇరు పార్టీల మధ్య 77 సీట్ల విషయంలో విభేదాలు తలెత్తాయి. రాబోయే రెండు రోజుల్లో ఈ ప్రతిష్ఠంభనకు తెరపడే అవకాశం ఉంది. బిఎంసితో పాటు మహారాష్ట్రలోని 29 మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికల షెడ్యూల్‌ను డిసెంబర్ 15న రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. 20 26 జనవరి 15న ఒకే విడతలో ఈ ఎన్నికలు జరుగనున్నారు. జనవరి 16న ఫలితాలు.

### కమిటీ ఏర్పాటు

బిఎంసి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక కోసం ముంబయి బిజెపి అధ్యక్షుడు అమిత్ సతమ్ 20 మంది సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు. అమిత్ సతమ్ చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్, జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నార్వేకర్‌తో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు సభ్యులుగా ఉన్నారు.

## జనావాసాల్లోకి చిరుత

**థానె:** అడవిలో ఉండాల్సిన వన్య ప్రాణులు, క్రూర జంతువులు ఇటీవల కాలంలో జనావాసాల్లోకి ప్రవేశిస్తున్నాయి. గ్రామాల్లోకి వచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. తాజాగా మహారాష్ట్ర లో చిరుత కలకలం రేపింది. థానే జిల్లాలోని జనసాంద్రత ఎక్కువగా ఉన్న తూర్పు భయందర్ ప్రాంతంలోకి ప్రవేశించింది. శుక్రవారం ఉదయం ఓ భవనంలోకి ప్రవేశించి భయాందోళన సృష్టించింది. స్థానికులపై దాడి చేసింది. ఈ దాడిలో ఐదుగురికి గాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు వెంటనే అధికారులకు సమాచారం అందించారు. అనంతరం అతికష్టం మీద చిరుతను ఓ భవనంలో బంధించారు. ఇక ఘటనాస్థలికి చేరుకున్న అటవీ సిబ్బంది చిరుతను బోనులో బంధించి అక్కడి నుంచి తీసుకెళ్లిపోయారు. ఇక చిరుత దాడిలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చిరుత సంచారానికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.


SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS25T 0552 | Divaswadeenam Thumma | New Holland 4710 | 2016 |
| 2 | TS29T 5276 | Bandi Samrajyam | Tata Ace Mega XL | 2017 |
| 3 | TS27T 6821 | Gopagani Vijay Kumar | John Deere 5105 D | 2021 |

AUCTION DATE : 20-12-2025

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED

H.No :4-316,4-317,4-318, Ground Floor, Opp : Fire Station, Parkal, Warangal District Cell : 9666726222, 9989766426

ప్రజాపక్షం
శనివారం, 20 డిసెంబరు

# పేదలు కోల్పోతున్న దేమిటి?

ప్రపంచంలోనే అతిపెద్ద చట్టబద్ధ గ్రామీణ ఉపాధి హామీ (మహాత్మాగాంధి నరేగా) పథకాన్ని చరిత్రపుటల కెక్కించటమేకాదు, గత రెండు దశాబ్దాల్లో గ్రామీణ పేదల జీవన హక్కుకు భరోసా కల్పిస్తూ కోరిన వారికి పనులు చూపటం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు అది చేసిన దోహ దాన్ని యుపిఎ ప్రభుత్వ ''మహావైఫల్యానికి చిహ్నం''గా ప్రధాని నరేంద్రమోదీ అభివర్ణించటం దారుణం. అందులో వాస్తవ విశ్లేషణకన్నా కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రభుత్వ ఘనత వహిం చిన కార్యక్రమంగా అది కొనసాగటం పట్ల ఉన్న ద్వేషం వ్యక్తమవుతోంది. జాతిపిత మహాత్మా గాంధి పేరుతో ముడిపడి ఉన్న కార్యక్రమాన్ని మెరుగుపరిచి సమర్థవంతంగా అమలు చేసి ప్రతి ష్ఠను సంతరించుకోవలసిన మోదీ ప్రభుత్వం ఆ చట్టాన్నే రద్దుచేసి మహాపరాధానికి పాల్పడింది. దానికి బదులుగా, రాముడిని గుర్తుచేసే విధంగా ''విబి–జీ రామ్ జీ'' పేరును కూర్చి ప్రభుత్వం తమ సంకుచిత మనస్తత్వాన్ని బయటపెట్టుకుంది. పేరులో ఏముందిలే గ్రామీణ పేదలకు మెరుగ్గా ఉపాధి కల్పన, వేతనాల పెంపు ద్వారా వారి జీవితాల మెరుగుదలకు తోడ్పడే చట్టం తెచ్చారులే అనుకోవటానికి వీల్లేకుండా, 125 రోజుల పనిదినాలు హామీ అంటూనే, దాని అమ లును బహు పరిమితం చేస్తూ సర్వాధికారాలను కేంద్రం చేతిలో ఉంచుకుని, రాష్ట్రాలు వ్యయంలో 40 శాతం భరిస్తేనే పథకం మంజూరు అని షరతు పెట్టింది. భరింపశక్యంగాని భారాన్ని రాష్ట్రాలపై పెట్టటంలో ఆ పథకాన్ని కుదించే ఉద్దేశం చెప్పకనే వ్యక్తమవుతున్నది.

మహాత్మాగాంధి నరేగా చట్టాన్ని రద్దుచేసి కొత్త బిల్లుకు హడావుడిగా ఆమోదముద్ర వేయిం చుకోవటాన్ని పార్లమెంటులోని సర్వ ప్రతిపక్షాలు ముక్తకంఠంతో ఖండించి నిరసన తెలిపినా ఆర్ఎస్ఎస్–బిజెపి ప్రభుత్వం పట్టించుకోలేదు. దాని మిత్రపక్షాలుగా ఉన్న జెడి(యు), టిడిపి, లోక్‌జనశక్తి(ఆర్‌విపి) పార్టీలు సిగ్గువిడిచి దాని అడుగులకు మడుగులొత్తాయి. కాని ప్రపంచ ప్రసిద్ధ ఆర్థిక వేత్తలు బహిరంగలేఖలో భారత ప్రభుత్వ చర్యను తప్పుబట్టారు. ఆర్థిక ఆత్మగౌర వాన్ని ప్రాథమిక హక్కుగా పునరుద్ఘాటించిన చట్టాన్ని రద్దు చేయటాన్ని ''చారిత్రక తప్పిదం''గా వ్యాఖ్యానించారు. కేంద్రప్రభుత్వాన్ని ఉద్దేశించి ఆ లేఖ రాసిన వారిలో – నోబెల్ బహుమతి గ్రహీత జోసఫ్ ఇ స్టిగ్లిట్జ్, పవ్లినా ఆర్. టెచెర్‌నెవా, ప్రెసిడెంట్, లేవీ ఎకనామిక్స్ ఇన్‌స్టిట్యూట్ (అమెరికా); థామస్ పికెట్టి, ప్రొఫెసర్, పారిస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (ఫ్రాన్స్); ఇసాబెల్లి ఫెర్రీరాస్, ప్రొఫెసర్, యూనివర్సిటీ ఆఫ్ లోవైన్ (బెల్జియం); డార్రిక్ హామిల్టన్, ప్రొఫెసర్, న్యూ స్కూల్ ఫర్ సోషల్ రీసెర్చి (యుఎస్ఎ); రాండాల్ డబ్లురే, సీనియర్ స్కాలర్, ది లేవీ ఎక నామిక్స్ ఇన్‌స్టిట్యూట్(అమెరికా); జేమ్ గాల్‌బ్రెయిత్, ప్రొఫెసర్, యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్, ఆస్టిన్ (యుఎస్) – ఉన్నారు.

ఎంజి నరేగాను ''అడిగిన వారందరికీ ఉపాధిని లీగల్ హక్కుగా అమలులోకి తెచ్చిన ప్రపంచ ప్రాముఖ్యతగల విధాన చర్య''గా ఆర్థిక వేత్తలు పేర్కొన్నారు. దాని ప్రభావాన్ని నొక్కి చెప్పటానికి కావలసినంత ఆధారం ఉంది. ఆ చట్టం అమలులోకి వచ్చిన ఆరంభ సంవత్సరాల్లో అపూర్వంగా గ్రామీణ వేతనం పెరిగింది. ఆర్థిక ఉత్పత్తి, సమర్థతపై ఆ కార్యక్రమం సానుకూల ప్రభావాలను అధ్యయనాలు ధృవీకరించాయి. అది ఉత్పత్తి రహితమైనదన్న వాదనలను త్రోసిపు చ్చారు. అయితే ''ఏటేటా నిధుల కేటాయింపు తగ్గింపు, చెల్లింపులో జాప్యాలు'' ఆ పథకానికి ఆటంకాలు కల్పించాయి. కొత్త బిల్లు రాష్ట్రాలకు బాధ్యతను బదిలీ చేస్తున్న తీరు, అందుకు తగి నట్లు నిధుల కేటాయింపులేకపోవటం ఆ పథకం అస్థిత్వానికే ముప్పు తెస్తుంది. గత చట్టం కింద పరికరాలకయ్యే ఖర్చులో 25శాతం రాష్ట్రాలు భరించాల్సి ఉండగా కొత్త చట్టం 100శాతం వాటి నెత్తిన మోపింది. ఇదొక చిత్రమైన పరిస్థితి కల్పిస్తుంది : ఉపాధి చూపాల్సిన బాధ్యత లీగ ల్‌గా రాష్ట్రాలపై ఉంటుంది. కేంద్ర నిధులు కోతపెట్టి 40 శాతం రాష్ట్రాలపై విధించటం జరుగు తుంది. పేద రాష్ట్రాలు వర్క్ డిమాండ్‌ను అణచివేసి ప్రాజెక్టు ఆమోదాలు కుదించే స్థితి వస్తుందని వారు హెచ్చరిక చేశారు. వివక్షాపూర్వకంగా పథకాన్ని నిలుపు చేసే నిబంధనలను వారు విమ ర్శించారు. పశ్చిమ బెంగాల్‌కు నిష్కారణంగా గత మూడేళ్లుగా నిధులు ఇవ్వకపోవటాన్ని రాజ కీయ దుర్వినియోగానికి ఉదాహరణగా వారు పేర్కొన్నారు. అటువంటి చర్యలు ఉపాధి హామీని అర్థరహితం చేస్తాయన్నారు. గత చట్టాన్ని రద్దు చేయటం దారిద్ర్య నిర్మూలన, సామాజిక న్యాయం, పర్యావరణ సంరక్షణకు సాధనంగా రుజువైన పథకాన్ని విడనాడటం అవుతుంద న్నారు. అందువల్ల ఈ పథకం అమలుకు కేంద్రం నిధులకు హామీ ఇవ్వాలి, సకాలంలో చెల్లిం పులు జరపాలి, చట్టంలోని వ్యవస్థాపిత గ్యారంటీలను పునరుద్ధరించాలని ఆర్థిక వేత్తలు కోరారు. మోదీజీ, వినబడుతోందా, విఖ్యాత మేధావుల గొంతు!

## కార్మికులతో ఎక్కువ గంటలు

# పనిచేయించనున్న లేబర్ కోడ్‌లు



కృష్ణ ఝా

కార్పొరేట్ రంగానికి సాంకేతిక పురోగతి తోడవడంతో మరింత సంపాదించాలనే అంతులేని దాహాన్ని సృష్టించింది. మరింత మిగులు పొందడానికి దోపిడీ వేగం దాని శిఖరాగ్రానికి పెరి గింది. ఉద్యోగాలను తగ్గించడానికి, నిరుద్యోగ రేటును పెంచడానికి కూడా ప్రయత్నాలు జరిగాయి. తాము సొంతంగా నిలదొక్కుకో వడం గురించి కార్మికులు నిరం తరం అనిశ్చితిలో ఉంటారు. ఇది గందరగోళాన్ని సృష్టించింది. వాటి వాటి స్వీయ ప్రత్యేక లక్షణా లతో అనియత, సంఘటిత కార్మికులు ఉంటారు.. కార్మికులు అయో మయంలో ఉన్నట్లు అనిపిస్తుంది. ప్రతీ ప్రభుత్వం సరళీకరణను అనుసరిస్తూనే ఉంది.

ఇలాంటి సర్వసాధారణ అవగాహనకు మూల కారణం ఏమిటంటే, ప్రతి ఒక్కరూ ప్రైవేటీకరణను కోరుకో వడమే. ఈ ప్రక్రియలో కార్మికవర్గం ఇలాంటి వినాశకర మైన చర్య భారాన్ని భరించవలసి వస్తే, వారి పట్ల ఎలాంటి శ్రద్ధ ఉండదు. ఇప్పుడు సరళీకరణ తదుపరి దశను ఉద్యో గరహిత వృద్ధి దశ అని పిలుస్తారు. యజమానులు, వారి మద్దతుదారులు కార్మిక వ్యతిరేక చర్యలు అన్నీ తీసుకున్న ప్పటికీ, కార్మికుడు మౌనంగా అంగీకరించాల్సి వస్తుంది. ఎందుకంటే తమ స్వంత ఉద్యోగాన్ని పణంగా పెట్టడం చాలా కష్టం. రెండు శతాబ్దాల క్రితం కూడా అన్యాయా లను తిప్పికొట్టడానికి ధైర్యం చేసిన కార్మికుడికీ ఈ సంక్లిష్ట తలన్నీ జీవితంలో భాగమే. కానీ ఇప్పుడు ఉద్యోగాలు లేవు, నిరుద్యోగం అంతటా వ్యాపించింది. కొత్త శతాబ్దం సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలలో సంక్లిష్టత లను ఎదుర్కొంటోంది. ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తి ప్రక్రియ లపై యాజమాన్యం, సేవలు, కార్మికులపై ప్రభావం చూపే స్థాయిలో సాంకేతిక అభివృద్ధి జరిగింది. ప్రపంచీకరణ స్వభావంలో కూడా మార్పు చోటు చేసుకుంది. వ్యక్తిగత లాభ ఆధారిత దృక్పథం లేదా మానవ పురోగతి దిశాని ర్దేశం చేసిన సాధికారత సమానత్వం నుండి అసమాన పంపిణీకి దారితీస్తున్నది.

21వ శతాబ్దంలో ఎదురవుతున్న సవాళ్లు చాలా శక్తిమంతమై నవి. అవి ప్రధానంగా బహుళ జాతి సంస్థలు సహా యజమాని అవ లంబించే కార్మిక వ్యతిరేక విధానం నుంచి, యజమాని అనుకూల ప్రభుత్వ విధానం నుంచి వస్తున్నాయి. టెక్నాలజీ, దాని అభివృద్ధి సాధారణ సంక్షేమం వైపు ఉపయోగించబడుతుందని మనకు గొప్ప ఆశలు ఉండినాయి. కానీ వాస్తవంలో అది కనిపించడం లేదు. సవాళ్లు సిద్ధంగా ఉన్నందున, పరివర్తన రోజుల్లో వాటి స్వంత కష్టాలు ఉంటాయి.

శ్రమజీవులు ఎనిమిది గంటలకు బదులుగా పన్నెండు గంటలు శ్రమ చేయవలసి వస్తుంది.సుదీర్ఘ, తీవ్ర పోరాటం ద్వారా ప్రపంచ కార్మికులు సాధించిన ఈ హక్కును అర్థాంతరంగా తొలగించారనేది వాస్తవం. ఇది నాలుగు కార్మిక కోడ్‌ల అమలు ఫలితం. ఇది వలస వ్యవస్థను గుర్తు చేస్తుంది. బానిసలకు స్పృహ ఉండకూడదు, తద్వారా పరిణామం చెందకూడదు. కార్మికుడు యంత్రంలో ఒక భాగంగా మారి, ముందుగా నిర్ణయించిన పద్ధతిలో పనిచేయాల్సి వస్తుంది. అది కూడా పన్నెండు గంటలు. పరాయీకరణ వ్యక్తిగత కార్మికుడిని గుప్పిట పెట్టుకుంది. పెట్టుబడిదారీ విధానంలోని జాడ్యాలు జీవం పోసుకుంటాయి. కొత్త కార్మిక నియమావళి కార్మి కుల కోసం నిర్మించిన రక్షణ చర్యలను ఎత్తివేస్తున్నందున వాటితో పోరాడాలి. సుదీర్ఘ పని దినం, భద్రతా చర్యలు లేకపోవడం, రద్దీగా ఉండే పని గదులు, పేరుకుపోయిన ధూళి ప్రాణాలకు ముప్పుగా మారతాయి.

ఫ్యాక్టరీల చట్టం –1948 ప్రకారం ఓవర్ టైం చెల్లింపు లేకుండా కార్మికులను రోజుకు ఎనిమిది గంటలు లేదా వారానికి 48 గంట లకు మించి పని చేయమని బలవంతం చేయకూడదు. వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ – 2020, ఇప్పుడు ఆరు –ఎ నిమిది గంటల పని దినాల ప్రామాణిక షెడ్యూల్‌ను అట్టిపెడుతూనే దానితోపాటు నాలుగు 12 గంటల షిఫ్ట్‌ల ఎంపికను అనుమతిం చింది. కాబట్టి వారంలో 48 గంటల పరిమితిని అధికారికంగా కొన సాగిస్తూనే, సౌకర్యవంతమైన రోస్టరింగ్, ఓవర్ టైం నిబంధనల సాంప్రదాయ పరిమితులకు మించి రోజువారీ పని గంటలను గణనీ యంగా పొడిగించడానికి యజమానులను అనుమతిస్తుంది. పైకి చూస్తే, ఈ నిబంధన యజమానులు, కార్మికులిద్దరికీ ప్రయోజనం చేకూర్చే ఒక సౌకర్యవంతమైన ఏర్పాటుగా కనిపిస్తుంది. యజమా నులు ఉత్పత్తి డిమాండ్లకు అనుగుణంగా సర్దుబాటు చేసుకోవచ్చు, కార్మికులు ఓవర్ టైం వేతనం పొందవచ్చు. అయితే, ఆచరణలో పొడిగించిన పని గంటలను అంగీకరించాల్సిందిగా కార్మికులపై యజమానులు ఒత్తిడి చేయడానికి కొత్త కోడ్లు అనుమతిస్తాయి. ముఖ్యంగా తమ ఒప్పందాలను పునరుద్ధరించాలని కోరుకునే స్థిరకా లిక, కాంట్రాక్ట్ కార్మికులపై ఈ ఒత్తిడి ఉంటుంది.

కొత్త కార్మిక నిబంధనల ప్రకారం కార్మికులకు రోజుకు 12 గంటలు పనిచేయడం తప్ప వేరే మార్గం ఉండదు. అలాంటి 'ఎంపిక' అస్సలు ఎంపికే కాదు. ఓవర్‌టైమ్‌కు వేతనం చెల్లించినప్పటికీ 12 గంటల పనిదినం కార్మికుల ఆరోగ్యం, కుటుంబ జీవితం, మానవ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా శారీరకంగా, మానసికంగా అలసిపో యేలా చేస్తుంది. జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో కార్మి కవర్గ ఐక్యత కోసం బలమైన అవసరం ఏర్పడింది. కార్మికవర్గ సుదీర్ఘ పోరాటం తర్వాత 8 గంటల పని దినంపై ప్రపంచ ఏకాభిప్రాయం వచ్చిందనేది వాస్తవం. ఆ పోరాటం పందొమ్మిదవ శతాబ్దం ద్వితీయ భాగంలో కార్మికుల దినోత్సవానికి ద్వారాలు తెరిచి, అమెరికాలో మొదటి మే డేను ప్రారంభించింది.

కమ్యూనిస్ట్ మానిఫెస్టో జర్మన్‌లో నాలుగవ ప్రచురణలో 1890 మే 1న ఎంగెల్స్ రాసిన ముందుమాటలో ఆయన అంతర్జాతీయ కార్మిక సంఘాల చరిత్రను సమీక్షిస్తూ, మొదటి అంతర్జాతీయ మే దినోత్సవం ప్రాముఖ్యత గురించి ఇలా రాశారు: ''నేను ఈ పంక్తులు రాస్తున్నప్పుడు, యూరప్, అమెరికా కార్మికవర్గం, వాటి బలగాలపై సమీక్షను నిర్వహిస్తోంది; ఆది మొదటిసారి ఒకే సైన్యంగా సమీక రించబడి, ఒకే తక్షణ లక్ష్యం కోసం పోరాడుతోంది: ఎనిమిది గంటల పని దినం, చట్టబద్ధంగా స్థిరపరచబడింది. మనం ఇప్పుడు చూస్తున్న దృశ్యం అన్ని దేశాల పెట్టుబడిదారులు, భూస్వాములు నేడు అన్ని దేశాల శ్రామికవర్గం ఐక్యంగా ఉన్నారని గ్రహించేలా చేస్తుంది. మార్క్స్ నాతో ఉంటే తన కళ్ళతో దాన్ని చూడగలిగితే బాగుండు!'' అంతర్జాతీయ కార్మికవర్గ ప్రదర్శనల ప్రాముఖ్యత ప్రపంచవ్యాప్తంగా కార్మికుల ఊహకు, విప్లవాత్మక ప్రవృత్తులకు మరింత ఆకర్షణీయంగా మారింది. ఏటేటా ప్రదర్శనలలో ఎక్కువ మంది పాల్గొంటుండటం కనిపిస్తోంది.





మే 1వతేదీన 8 గంటల దినోత్సవం కోసం జరిగే ప్రదర్శన, సామాజిక మార్పు ద్వారా వర్గ వ్యత్యాసాలను ధ్వంసం చేయడానికి, తద్వారా ప్రజలందరికీ శాంతి, అంతర్జాతీయ శాంతికి దారితీసే ఏకైక మార్గంలోకి ప్రవేశించడానికి కార్మికవర్గం దృఢ సంకల్పానికి నిదర్శనంగా ఉపయోగపడుతుంది.

***(ఐపిఎ సర్వీస్)***

# సంక్షోభంలో ప్రజాస్వామ్య వ్యవస్థ

## లోక్‌సభలో సిపిఐ



**లోక్‌సభలో ఎన్నికల సంస్కరణలపై డిసెంబర్ 10న జరిగిన చర్చలో సిపిఐ తరపున ఎంపి కె.సుబ్బరాయన్ (తిరుప్పూర్) పాల్గొన్నారు. ఆయన ప్రసంగం లోని ముఖ్యాంశాలు**

''అధ్యక్షా...ఎన్నికల సంస్కరణలపై భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తర పున నా అభిప్రాయాలను ఈ సభలో ముందు ఉంచుతున్నాను. స్వతంత్ర భారతదేశంలో అనేక సంవత్సరాలుగా జరుగుతున్న ఎన్నికలు మనకు ఎన్నో అనుభవాలను ఇచ్చాయి. వాటి నుంచి నేటి పాలకులు పాఠాలు నేర్చుకొని ఈ దిశగా ఆలోచిస్తారో లేదో నాకు తెలియదు.

ఇప్పుడు అవసరమైన మొదటి సంస్కరణ ఏమిటంటే, ఓట్ల శాతానికి అనుగుణంగా దామాషా పద్ధతిలో ప్రాతినిధ్యాన్ని కల్పించాలి. నిజంగా ప్రజా స్వామ్యాన్ని ప్రేమించే, దానిపట్ల శ్రద్ధ వహించే వారు చేయవలసిన గొప్ప సంస్కరణ ఇది. అప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. జాతీయ స్థాయిలో ప్రతి పార్టీకి వచ్చిన ఓట్లు, ఓటింగ్ శాతాన్ని మీరు చూడాలి. ఆ శాతం ఆధారంగా, ప్రతి పార్టీకి ఎంపిలు, ఎమ్మెల్యేల సంఖ్యను నిర్ణయించాలి. ఇది అత్యంత అవ సరమైనది. కానీ నేటి పాలకులు అలా చేసేందుకు సుముఖంగా లేరు.

అధికార పార్టీ, ప్రభుత్వం పనితీరును దగ్గరగా గమనిస్తే, వారిలో అలాంటి ఆలోచన లేదా ఆలోచనా విధానం ఏమాత్రం లేదని స్పష్టంగా తెలు స్తోంది. తప్పుఎక్కడ జరిగింది? ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థకు నాయ కత్వం వహించే నైతిక బాధ్యత ఈ ప్రభుత్వానికి ఉందా? ఎన్నికల కమిషనర్ ఎంపిక కోసం ముగ్గురు సభ్యుల ప్యానెల్ నుండి భారత ప్రధాన న్యాయమూ ర్తి ని మీరు (ప్రభుత్వం) ఎందుకు తొలగించారు? మీ ఉద్దేశం ఏమిటి?

గౌరవ ప్రతిపక్ష నాయకుడు మిమ్మల్ని నాలుగు ప్రశ్నలు అడిగారు. అవన్నీ చాలా అర్థవంతమైనవి. అధికారంలో ఉన్నవారు సమాధానం చెప్పాలి. వారు ఈ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలి. ఈ నాలుగు ప్రశ్నల లో కుట్ర దాగి ఉంది. వారు గంభీరంగా సమాధానం ఇస్తే, అది ప్రయోజనకరంగా ఉంటుంది. వారు మూడు ఏర్పాట్లు చేశారు. మొదటిది ఏమిటంటే, వారు 2011 జనాభా లెక్కలను వాయిదా వేశారు. ఈ ప్రభుత్వం ప్రకటించినట్లు గా, ఇది 2027లో జరుగుతుంది. 2031కి ప్రకటించాల్సిన జనాభా లెక్కలు ఇప్పుడు 2027లో జరుగుతాయి.

దీని వెనుక ఒక ఉద్దేశం ఉంది. మీరు ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను చూస్తే, ఆయన 2029 సంవత్సరం వరకు ఆ పదవిలో ఉంటారు. ప్రస్తుత ఎన్నికల కమిషనర్ 2029 వరకు ఆ పదవిలో కొనసాగేలా వారు ఒక పక్కా ఏర్పాటు చేశారు. వారు ఎంత కుట్రపూరితంగా ఉన్నారో చూడండి? వారు ఈ ఏర్పాటు ఎందుకు చేశారు? ఈ విషయంపై వారు సామాన్య ప్రజలకు సమాధానం చెబుతారా? ఎందుకంటే వారిలో నిజాయితీ లేదు. ప్రజాస్వామ్యంలో వారు అనర్హులు.

పాలకులకు ఆర్ఎస్ఎస్ సంస్థ నేర్పిన పాఠం ఇదే. మీరు చేస్తున్న పనిని ప్రజాస్వా మ్యాన్ని అపహాస్యం చేయడం అంటారు. మీరు ఒక శక్తివంతమైన ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతును అణచివేస్తున్నారు. మీరు అలా చేస్తే ఓడిపోతారు. ప్రజాస్వా మ్యాన్ని అంగీకరించవద్దని వారికి ఆర్ఎస్ ఎస్ నేర్పిం ది. నేను బహిరంగ సవాలు చేస్తున్నాను. ప్రజాస్వామ్యం ఒక విదేశీ వస్తువు, అది ఏ విధంగానూ భారతీయ స్వభావం కలది కాదు — గోల్వాల్కర్ వారికి నేర్పిన పాఠం ఇదే. గోల్వాల్కర్ నుండి పాఠాలు నేర్చుకున్న తర్వా త, వాళ్ళు (బిజెపి – ఆర్ఎస్ఎస్) రాజ్యాంగం, మతాన్ని ఉపయోగించి ప్రజా స్వామ్య వ్యవస్థను చేజిక్కించుకుని అధికారాన్ని ఆక్రమించారు. దీని ద్వారా, వారు ఆ సంస్థలలో ఉంటూనే ప్రజాస్వామ్య వ్యవస్థలను నాశనం చేస్తారు లేదా కూల్చివేస్తారు. అందుకే అన్ని విధాలుగా, వారు సైన్యం, న్యాయవ్య వస్థ, అన్ని ఇతర సంస్థలలో చొరబడుతున్నారు. భారతదేశం ఒక కఠినమైన, అత్యంత దారుణమైన సమయాన్ని ఎదుర్కొంటోంది.''



# ఎన్నికల ఖర్చును ప్రభుత్వమే భరించాలి

## రాజ్యసభలో సిపిఐ



**రాజ్యసభలో ఎన్నికల సంస్కరణలపై డిసెంబర్ 15న జరిగిన చర్చలో సిపిఐ సభ్యుడు పి.పి. సునీర్(కేరళ)పాల్గొన్నారు. ఆయన ప్రసంగం లోని ముఖ్యంశాలు ఇలా ఉన్నాయి.**

''మన గణతంత్ర ప్రజాస్వామ్య సారా న్ని కాపాడటానికి ఈ సభ చర్చించి ఎన్నికల సంస్కరణలను ముందుకు తీసుకురావడం అత్యవసరం. ఎన్నికలు ఒక ఆచారం కాదు, అవి ప్రజల సంకల్పాన్ని పాలన రూపంలోకి తీసుకువచ్చే విధానం. ఈ ప్రక్రియలో ఏదైనా వక్రీకరణ జరిగితే అది పార్లమెం టరీ ప్రజాస్వామ్యం మూలం మీద, అంటే ప్రాతినిధ్యంపై దాడి చేస్తుంది.

ఓటర్ల జాబితా ప్రత్యేక ఉధృత సవ రణ (ఎస్ఐఆర్) ద్వారా ఎదురయ్యే పెను ముప్పు పై మనం దృష్టి పెట్టాలి. పారదర్శకంగా, పౌరులకు స్నేహపూర్వ కంగా ఉండాల్సిన కసరత్తుకు బదులుగా ఒక పరీక్ష మారింది. బిహార్‌లో ఈ ప్రక్రి యలో లక్షలాది మంది ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయి . ఆశ్చర్యకరంగా 2025 సెప్టెంబర్ 30న ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను ప్రకటించిన తర్వాత మూడు లక్షలకు పైగా ఓటర్లు చేర్చబడ్డారు. ఇదొక్క అంశమే ఈ కస రత్తు విశ్వసనీయత, ఉద్దేశ్యం, శాస్త్రీయ ఆధారం గురించి తీవ్రమైన ప్రశ్న లను లేవనెత్తుతుంది. అనేక రాష్ట్రాలలో ఎస్ఐఆర్ పౌరులకు, ఎన్నికల సిబ్బం దికి ఒక పీడకలగా మారింది. సాధారణ ఓటర్లు చాలా దూరం ప్రయాణించి, అనేక పత్రాలను సమర్పించి, ఓటు హక్కు తమకు రాజ్యాంగ హామీగా కాకుండా సంపాదించుకోవలసిన హక్కు అని నిరంతరం ఆందోళన చెందుతూ జీవించాల్సి వస్తోంది. అదే సమయంలో, బూత్ స్థాయి అధికా రులు, క్షేత్ర స్థాయి సిబ్బంది అస్పష్టమైన, అశాస్త్రీయమైన తొందరపాటు మార్గదర్శకాల కారణంగా అపూర్వమైన ఒత్తిడికి గురవుతున్నారు. కార్మికు లలో మానసిక ఒత్తిడి, తీవ్ర పరిణామాల నివేదికలు తీవ్రంగా కలవరపెడుతు న్నాయి. ఈ గందరగోళానికి పూర్తి బాధ్యత భారత ఎన్నికల కమిషన్‌దే.

అందరికీ సమాన అవకాశాలు, స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నిక లకు ఆత్మ వంటిది. రిఫరీ పక్షపాతంగా కనిపించినప్పుడు, మ్యాచ్ చట్టబద్ధ తను కోల్పోతుంది. అది ఎంపిక చేసిన నియమాల అమలు అయినా, స్పష్ట మైన ఉల్లంఘనలపై నిశ్శబ్దం అయినా లేదా నిగూఢంగా నిర్ణయం తీసుకో వడం అయినా, ఎన్నికల కమిషన్ విశ్వసనీయత దెబ్బతింటుంది. ఇది మన ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం.

ఈ మూడు సవాళ్లను పరిష్కరించడానికి, సిపిఐ తరుపున ఈ సభ ముందు ఈ క్రింది డిమాండ్లను పెడుతున్నాను. మొదటిది వ్యయ పరిమితు లను కఠినంగా అమలు చేయడం, ఇంద్రజిత్ గుప్తా కమిటీ సిఫార్సు చేసిన విధంగా ఎన్నికలకు ప్రభుత్వ నిధులను విధానాన్ని ప్రవేశపెట్టడం, రాజకీ యాల్లో డబ్బు పాత్రను అరికట్టడం. ఇది మన దేశంలోని మెజారిటీ పేద వర్గాల ప్రజలు ఎన్నికల రాజకీయాల్లో అర్థవంతంగా పాల్గొనడానికి వీలు కల్పిస్తుంది.

'రెండవది, నేరపూరితమవడానికి వ్యతిరేకంగా చట్టాలను బలోపేతం చేయడం, తీవ్రమైన అభియోగాలు, ముఖ్యంగా దారుణమైన నేరాలు, ద్వేష పూరిత ప్రసంగాలు చేసిన అభ్యర్థులు న్యాయస్థానాలు అర్హతను ఖరారు చేసే వరకు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిరోధించడం. ఎన్నికల కమిషన్ నియా మక ప్రక్రియను సంస్కరించడం, అధిక కార్యనిర్వాహక జోక్యం నుండి దానిని విముక్తి చేయడం, ప్రజా విశ్వాసాన్ని ప్రేరేపించే పారదర్శక, ద్వైపా క్షిక యంత్రాంగాన్ని నిర్ధారించడం. ప్రజాస్వామ్యం సంప్రదాయాలపై మాత్రమే మనుగడ సాగించదు. ఇది విశ్వాసం, న్యాయం, ప్రాతినిధ్యంపై మనుగడ సాగిస్తుంది. ఎన్నికల సంస్కరణలు పక్షపాత డిమాండ్ కాదు, అవి నేడు మనకు అవసరం. ఓటు బలహీనమైతే, గణతంత్రం బలహీనపడు తుంది. ఓటు హక్కు ఆగిపోయే ముందు మనం చర్య తీసుకుందాం.''

# పాలస్తీనా ఆర్థికవ్యవస్థను కుప్పకూల్చిన ఇజ్రాయెల్



బుడ్డిగ జమిందార్

గాజా ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత స్థితి గురించి (2024 చివరిలో నుంచి 2025 ప్రారంభం వర కూ)ఐక్యరాజ్య సమితి వాణి జ్యం అభివృద్ధి (యుఎన్‌సిటిడి ఎడి) సభ చర్చించి, అత్యంత దారుణమైన ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొంటోందని తెలిపింది. స్విట్జర్‌లాండ్‌లో జరిగిన 16 వ మహాసభలో గాజా ఆర్థిక స్థితిగతుల్ని, ప్రపంచానికి తెలియజే సింది. 2 సంవత్సరాల పాటు ఇజ్రాయిల్ యుద్ధం పేరిట కొన సాగించిన మారణకాండ పాలస్తీనాను కోలుకోలేని స్థితికి తీసు కెళ్లింది. పాలస్తీనాను ఇజ్రాయిల్ సర్వనాశనం చేసింది. 2023 సంవత్సరంతో పోల్చుకుంటే 2024లో జిడిపి 83 శాతం కుప్పకూలిందనీ, తలసరి జిడిపి 161 డాలర్లకు పడిపో యిందనీ, అంటే రోజుకు 50 సెంట్ల కంటే తక్కువ ఆదా యంతో ప్రపంచంలోని అత్యల్ప ఆదాయ స్థాయిలలో ఒకటి గా ఉందని ఐక్యరాజ్య సమితి వాణిజ్యసంస్థ తెలిపింది. ఈ సంస్థ అంచనా ప్రకారం 2022 తో గాజా ఆర్థిక వ్యవస్థను పోలిస్తే ఊహించని విధంగా 13 శాతానికి కుంచించిపోయిం ది. ద్రవ్యోల్బణం 238 శాతానికి, నిరుద్యోగం 80 శాతానికి పెరిగిందని మొత్తం 23 లక్షల మంది నివాసితులు దారిద్ర్య రేఖ దిగువకు నెట్టబడ్డారని తెలిపింది. గాజాలో దాదాపు 70 శాతం నిర్మాణాలు ధ్వంసమైనాయి.

2023 అక్టోబరు తర్వాత ఇజ్రాయిల్ జరిపిన సైనిక కార్యకలాపాలతో గాజా ఆర్థిక పునాదులు నాశనమయ్యాయి. మొత్తం పాలస్తీనా ఆర్థికవ్యవస్థ 2 సంవత్సరాల పోరాటం, ఆంక్షలు ఫలితంగా ఆర్థికవ్యవస్థ తీవ్రంగా చితికిపోయిం దని,త్సి_నా వెస్ట్‌బ్యాంక్ ప్రాంతం కూడా తీవ్రమైన తిరోగ మన ఆర్థిక వ్యవస్థకు జారిపోయిందని యుఎన్‌సిటిడిఎడి తెలి పింది. అప్పటికే అసలు లోపభూయిష్ట అభివృద్ధితో నడుస్తున్న గాజా ఆర్థిక వ్యవస్థ పూర్తి వినాశనానికి దారితీసింది. గత 69 సంవత్సరాలుగా నడుస్తున్న అంతంత మాత్రమైన అభివృద్ధిని ఈ సంక్షోభం మొత్తం తుడిచిపెట్టింది. ఇజ్రాయిల్ పాలస్తీ నాను కబళించటంతో పాలస్తీనా ఎన్‌క్లేవ్ అభివృద్ధి దేశంగా మారింది. ఎన్‌క్లేవ్ అభివృద్ధి అనగా పరరాజ్య పరివేష్ఠిత దేశంగా నిర్వచనముంది. వాస్తవానికి పాలస్తీనాలో తలదాచు కోటానికి వచ్చిన యూదులు పాలస్తీనాలో ఎన్‌క్లేవ్ రాజ్యంగా ఏర్పడి 69 సంవత్సరాల చరిత్రలో పాలస్తీనాను ఎన్‌క్లేవ్ రాజ్యంగా మార్చటం అతి దుర్మార్గం. దీనికి అమెరికా, పశ్చిమ దేశాలు మద్దతును ఇస్తున్నాయి. ప్రపంచ ముడిచ మురు నిల్వల్లో పశ్చిమాసియాలో 48 శాతం ఉన్నాయి. ఈ ముడిచమురుపై అమెరికా ఆధిపత్యం కోసం ఇజ్రాయిల్‌కు ఏటా సుమారు 400 కోట్ల డాలర్ల ఆయుధ సామాగ్రిని అమె రికా సమకూరుస్తుంది. ఒక సర్వే ప్రకారం 1946 నుంచి ఇప్పటివరకు 35 వేల కోట్ల డాలర్ల వరకూ అమెరికా సహాయ మందించింది. గాజాపై యుద్ధం ప్రారంభమైన 2023 అక్టో బరు 7 నుంచి 1630 కోట్ల డాలర్ల ఖరీదు చేసే ఆయుధ సామాగ్రి సమకూర్చింది. ఇజ్రాయిల్ ప్రధాని అడిగినప్పుడల్లా అధునాతన బాంబులను గాజా (ప్రజల)పై వేయటానికి పంపానని సాక్షాత్తు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయిల్ పార్లమెంటు క్నెసెట్‌లో ప్రకటించి గాజా వినాశనానికి ఏ విధంగా అమెరికా కారణమైందో తెలపకనే తెలిపారు. ఇప్పుడు గాజా పునర్నిర్మాణానికి కనీసం 7000 కోట్ల డాలర్లు ఖర్చవుతుందని, దీనికి దశాబ్దాలకాలం పడుతుందని నివేదిక తెలిపింది. (ఈలోగా ఇజ్రాయిల్ మరలా దాడులు చేయకమా నదని చరిత్ర నుంచి సులభంగా గ్రహించవచ్చు, అంటే పాల స్తినా ఎన్నటికీ గాడినపడటమనేది ప్రశ్నార్థకమే. ఇజ్రాయిల్ నిర్వహించిన దాడుల్లో 70,100 మంది చని పోయారని, లక్ష లాది మంది క్షతగాత్రులైనారని అధికార లెక్కలు చెబుతుండగా, అనధికారికంగా ఇంకా ఎక్కువ ప్రజలు చనిపోయి ఉంటారు.

2025 అక్టోబరు 10 ప్రారంభంతో గాజా ప్రాంతం నుంచి ఇజ్రాయిల్ వెనక్కు తగ్గాలని, కాల్పులను విరమించాల ని, హమాస్ దాదాపు 2000 పాలస్తినా యుద్ధ ఖైదీలకు బదు లుగా 20 మంది ఇజ్రాయిల్ బందీలను విడిపించాలని అమె రికా మధ్యవర్తిత్వం పిలుపునిచ్చింది. అయితే కాల్పుల విరమ ణ అమలు ప్రారంభమైనప్పటికీ, ఇజ్రాయెల్ వైమానిక దళాల కాల్పులు జరుగుతూనే ఉన్నాయి. ఈ మధ్యకాలంలో ఇజ్రా యిల్ కనీసం 500 సార్లు కాల్పుల విరమణ షరతులను ఉల్లం ఘించి అమాయక గాజా ప్రజలపై కాల్పులు జరిపిందనీ, ఈ 44 రోజుల్లో కనీసం 360 మంది సామాన్య ప్రజల ప్రాణాల ను బలిగొందని ది గార్డియన్ పత్రిక పది రోజుల క్రితం రాసింది. ఆహార సరఫరాలకు ఇప్పటికీ ఇజ్రాయిల్ అంతరాయం కల్గి స్తోంది, నెమ్మదిగా మాత్రమే సరిహద్దుల నుంచి అతి తక్కువ వాహనాలను గాజాలోనికి వదుల్తోంది. నివాస పరిస్థితులు ఘోరాతి ఘోరంగా ఉన్నాయి. అంతర్జాతీయ సహకారంపైనే ఆధారపడిన గాజా ప్రజలు ఇజ్రాయిల్ అనుమతి నిరాకర ణతో మానవతా సంక్షోభం ఏర్పడింది. దీనికితోడు డిసెంబరు 11నాడు అకస్మాత్తుగా వచ్చిన బైరాన్ తుపాను కారణంగా పిల్లలతో సహా 14 మంది పాలస్తినియన్లు మరణించారు. వినా శకరమైన యుద్ధపర్యవసానంగా టెంట్లులేక, చలినుంచి తట్టు కోటానికి శిథిలమైన భవనాల్లో ఎక్కడో ఒకమూల తల దాచు కోవాల్సిన పరిస్థితులేర్పడ్డాయి. ఈ తుపానుకు ఆ శిథిల స్లాబులు కూడా కూలటంతో ఈ విపత్కర పరిస్థితులేర్పడ్డాయి.

ఇటీవలి సంఘర్షణలకు ముందు గాజా ప్రాంతం 17 సంవత్సరాల పాటు తీవ్ర దిగ్బంధనానికి గురైంది. మునుపటి ఇజ్రాయిల్ సైనిక దాష్టిక కార్యకలాపాల వలన ఇప్పటికీ పాలస్తినా తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటోంది. వ్యవసాయ రంగం సర్వనాశనమైంది. 86 శాతం పంట భూములు, 83శాతం నీటి బావులు దెబ్బతిన్నాయి. విద్యాలయాలు ఇంకా తెరవలేదు, విద్యుత్తులేక అంధకారంతో జనాలు అల మటిస్తున్నారు, చాలీచాలని తాగునీరు అదీ కలుషితంగాను, డ్రైనేజీ సదుపాయాలు లేక అంటువ్యాధులు ప్రభలుతు న్నాయి. గతంలో ఎక్కువమంది శ్రామికశక్తిని నియమించిన కొద్దిపాటి పారిశ్రామికరంగం తీవ్రంగా దెబ్బతింది. లఘు, కుటీర పరిశ్రమలు కుదేలైనాయి. 82 శాతం వ్యాపారాలు తీవ్ర ప్రభావానికి లోనైనాయి. ఉన్న ఒక్క ఓడరేవుతోపాటుగా పనిచేసే విమానాశ్రయానికి దీర్ఘకాలిక ప్రాప్యత లేకపోవటం, తీవ్రమైన కదలిక పరిమితులతోపాటు వాణిజ్యసామర్థ్యాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పాలస్తినా ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక సంక్షోభానికి గురై ఆదాయాలు కుప్పకూలిపోవటం మరొక ప్రధాన కారణం. ప్రభుత్వానికి పన్నుల చెల్లింపులు పూర్తిగా ఆగిపోయాయి. ప్రపంచ దేశాలు పాలస్తినాకు సంఘీభావం తెలుపుతూ, ఆర్థిక సహాయం అందించటంతో పాటుగా, ఇకపై ఇజ్రాయిల్ అమెరికా అండతో పాలస్తినాపై యుద్ధం చేయకుండా, రెండు రాజ్యాల స్థాపనకై గొంతెత్తి చాటాలి.

**ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యవర్గ సభ్యుడు, 9849491969**

# ‘మీ డబ్బు మీ హక్కు’పై 20న శిబిరం

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : ఈనెల 20వ తేదీన(శనివారం) కలెక్టరేట్లో ‘మీ డబ్బు మీ హక్కు’ అనే అంశంపై ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం ఆదేశాల మేరకు బ్యాంకుల్లో సంవత్సరాలుగా క్లెయిమ్ చేసుకోని డబ్బుకు సంబంధించి అవకాశం కల్పించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.బ్యాంకులలో పొదుపు,షేర్లు,మ్యూచువల్ ఫండ్స్,డివిడెంట్స్,బీమాలు క్లెయిమ్ చేసుకునేందుకు ఈ శిబిరం అవకాశం కల్పిస్తుందని అన్నారు.ద్వారా 10 సంవత్సరాలకు పై బడి బ్యాంకుల్లో క్లెయిమ్ చేసుకుని నిల్వ వివరాలు ఆర్బీ ఉద్గం వెబ్సైట్ లో పొందవచ్చునని పేర్కొన్నారు.నిజమైన హక్కుదారులకు బ్యాంకుల్లోనే డబ్బులు పొందేందుకు ఈ శిబిరం ఆవకాశం కల్పిస్తుందని,ఈ అవకాశాన్ని అవసరమైన వారు వినియోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# అభ్యర్థులు 45రోజుల్లోగా ఖర్చుల వివరాలు సమర్పించాలి

ప్రజాపక్షం/ఎడపల్లి: ఇటీవల జరిగిన ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులందరికీ ఎడపల్లి ఎంపీడీఓ కార్యాలయం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నిబంధనల ప్రకారం పోటీ చేసిన ప్రతి అభ్యర్థి తమ ఎన్నికల ఖర్చుల వివరాలను ఫలితాలు వెల్లడైన నాటి నుంచి 45రోజుల గడువులోగా కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థులు తమ ప్రచారం కోసం చేసిన ఖర్చుల పూర్తి వివరాలు, బిల్లులు, అధికారిక ఖర్చుల బుక్లెట్ను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నిర్ణీత గడువులోగా ఖర్చుల వివరాలు సమర్పించని అభ్యర్థులపై అనర్హత వేటు పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పోటీ చేయడానికి వీరు అనర్హులుగా ప్రకటించబడతారని గెలిచిన అభ్యర్థులతో పాటు పోటీ చేసిన ఇతర అభ్యర్థులు కూడా ఈ నిబంధనను పాటించాలని అధికారులు స్పష్టం చేశారు.అభ్యర్థులందరూ సహకరించాలని, రద్దీని నివారించడానికి ముందుగానే బుక్లెట్తో పా టు అన్ని రశీదులను సిద్ధం చేసుకొని ఎంపీడీఓ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని అధికారులు సూచించారు.

## ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసిన శ్రీహరిరావు



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : ఉమ్మడి జిల్లా ఇంచ్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావును హైదరాబాద్లో నిర్మల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచ్చార్జి కూచాడి శ్రీహరిరావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.ఇటీవల నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో నిర్మల్ నియోజకవర్గంలఅట కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో విజయం సాధించారని మంత్రికి తెలిపారు.రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అద్భుతమైన విజయాన్ని అందించారని అన్నారు.రాబోయే ఎంపీటీసీ,జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని అన్నారు.

## యథావిధిగా ప్రజావాణి

ప్రజాపక్షం/నిజామాబాద్ : ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని 22 నుండి యథావిధిగా నిర్వహించటం జరుగుతుందని కలెక్టర్ వినయ్కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండటంతో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కలికంగా వాయిదా వేశామన్నారు. ప్రస్తుతం గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం తిరిగి యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

## రాజీ మార్గమే రాజ మార్గం

సంగారెడ్డి రూరల్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి



ప్రజాఫక్షం/ సంగారెడ్డి : రాజీ మార్గమే రాజ మార్గమని సంగారెడ్డి ఎస్ఐ మధుసూదన్ రెడ్డి పిలుపు నిచ్చారు. డిసెంబర్ 21,2025 ఆదివారం వరకు జరగనున్న జాతీయ మెగా లోక్ ఆదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ .ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ క్షణికావేశంలో జరిగిన చిన్న తప్పులు అనవసర వివాదాలను పరిష్కరించుకోవడానికి లోక్ ఆదాలత్ ఒక ఉత్తమ అవకాశమని పేర్కొన్నారు. రాజీ కుదుర్చుకునే అవకాశం ఉన్న అన్ని రకాల కేసుల్లో కక్షిదారులు సరస్పర అంగీకారంతో రాజీ పడవచ్చని తెలిపారు. న్యాయ ప్రక్రియల వల్ల కలిగే ఆర్థిక ,మానసిక ఒత్తిడులను తగ్గించుకోవడానికి లోక్ ఆదాలత్ ఎంతో ఉపయోగకరమని రాజీ ద్వారా ఇరు వర్గాలు గెలిచినట్లే అవుతుందన్నారు. అనవసర గొడవలకు దూరంగా ఉండి శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ నెల డిసెంబర్ 21 వరకు జరగనున్న జాతీయ మెగా లోక్ ఆదాలత్‌ను జిల్లా ప్రజలు కక్షిదారులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ మదుసూదన్ రెడ్డి కోరారు.

## అభివృద్ధి బాటసారికి పట్టం కట్టిన అష్టా గ్రామ ప్రజలు



ప్రజాపక్షం/ముథోల్ : అభివృద్ధి బాటసారి అయన రావుల లావణ్య శ్రీనివాస్ లకి మండలంలోని అష్టా గ్రామ ప్రజలు సర్పంచ్ ఎన్నికల్లో పట్టం కట్టారు.గతంలో వారు గ్రామానికి చేసిన సేవలను గుర్తించి ప్రజలు సర్పంచ్ ఎన్నికలలో అసత్య ప్రచారాలను నమ్మకుండా వారిని గెలిపించినందుకు నిత్యం సేవలందిస్తూ ప్రజలకు రుణపడి ఉ ంటామని పేర్కొన్నారు.తమపై ఉన్న నమ్మకంతో గెలిపించినందుకు గ్రామ ప్రజలకు,తమ విజయంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.తాము ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని స్పష్టం చేశారు.సర్పంచ్ ఎన్నికైన వారిని శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావుల గంగారెడ్డి వారిని శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో వారితో పాటు ఎన్నికైన వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## వర్నిలో నకిలీ నోట్ల కలకలం

ప్రజాపక్షం/బోధన్: వర్ని మండలంలో దొంగనోట్ల కలకలం రేపింది. వర్ని ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం వర్ని కెనరా బ్యాంక్‌లో క్రాప్ లోన్ కట్టడానికి వచ్చిన జలాల్పూర్ గ్రామానికి చెందిన రైతు నరేడ్ల చిన్న సాయిలు మొత్తం రూ. 2,08,500 తన ఖాతాలో జమ కోసం బ్యాంకులో క్యాషియర్ కు ఇచ్చారు.క్యాషియర్ కౌంటింగ్ మిషన్లో డబ్బు వేయగా 417(రూ.500) నకిలీ నోట్లు ఉన్నట్లు బ్యాంకు సిబ్బంది గుర్తించారు. 417 నోట్లు నకిలీ నోట్లని తేలడంతో కెనరా బ్యాంక్ మేనేజర్ పంకాజ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## జీతాలు పెంచాలని మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాపక్షం/బైంసా : బైంసా పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ ఎదుట పారిశ్యుద్ధ కార్మికులు ఆందోళనకు దిగారు.మున్సిపల్ కార్యాలం ముందు ధర్నాకు దిగారు..కొత్తగా ఏర్పడిన ఖానాపూర్ బల్దియాలో జీతాలు ఎక్కువ ఉన్నాయని,ఇక్కడ మాత్రం జీతాలు తక్కువ ఇస్తున్నారంటూ ఆందోళన చేస్తున్నారు.తమకు జీఓ ప్రకారం జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.దీంతో సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్ ఘటన స్థలానికి చేరుకొని కార్మికులతో మాట్లాడి సముదాయించే ప్రయత్నం చేశారు.కాని కార్మికులు తమ సమస్యలు పరిష్కారించేంత వరకు భీష్మించుకూర్చున్నారు.



# విపత్తుల నిర్వహణ సన్నద్ధతపై 22న ప్రయోగాత్మకంగా మాక్ ఎక్సర్ సైజ్

జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



ప్రజాపక్షం/నిజామాబాద్ : ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వాటిని సమర్థవంతంగా ఎలా ఎదుర్కొవాలనే అంశాలపై 22న జిల్లాలో ప్రయోగాత్మక రీతిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న టాప్ (మాక్) ఎక్సర్ సైజ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వినయ్కృష్ణారెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వరదలు, పారిశ్రామిక ప్రమాదాలు, విపత్తులు సంభవించిన సమయాలలో ప్రాణనష్టం, ఆస్తి నష్టం నివారించేందుకు చేపట్టాల్సిన తక్షణ చర్యలపై సన్నద్ధతను పెంపొందించేందుకు వీలుగా జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 22న అన్ని జిల్లాలో మాక్ ఎక్సర్ సైజ్‌ను నిర్వహించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని టీజీఐసీసీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఎన్డీఎంఎ మేజర్ సుధీర్, ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనర్ హసనైన్, తెలంగాణ ఫైర్ సర్వీస్ డైరెక్టర్ నారాయణరావు, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు సంబంధిత ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలే, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారులు పని చేయాల్సి ఉంటుందని, క్షతగాత్రులకు అత్యవసర వైద్య సేవలందించేలా వైద్య బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అగ్నిమాపక, విద్యుత్, రహదారుల, పో లీస్, రెవెన్యూ, వైద్య,పౌరసరఫరాల తదితర శాఖల అధికారు లు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్‌కి రణ్‌కుమార్, అదనపుడీసీపీ బస్వారెడ్డి, అగ్నిమాపక శా ఖాధికారి పరమేశ్వర్, జడ్పీ సీఈఓ సాయగౌడ్, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, లక్ష్మీ, అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి జూపల్లితో నిర్మల్,ఆదిలాబాద్ నేతల భేటీ

జిల్లా అభివృద్ధి,పార్టీ బలోపేతంపై కీలక చర్చ



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది.అదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావును హైదరాబాదులోని వారి క్యాంపు కార్యాలయంలో నిర్మల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ(డిసిసి) అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్,మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సమావేశంలో ప్రధానంగా నిర్మల్ జిల్లాలో ఇటీవల ముగిసిన గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలపై మంత్రికి నేతలు వివరించారు.క్షేత్రస్థాయిలో పార్టీ సాధించిన విజయాలు,పార్టీ బలపడిన తీరును చర్చించడంతో పాటు,రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని గ్రామ గ్రామాన మరింత పటిష్టం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై మంత్రి జూపల్లి దిశానిర్దేశం చేశారు.ముఖ్యంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని,ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని నేతలు మంత్రికి విజ్ఞప్తి చేశారు. అదిలాబాద్ డిసిసి అధ్యక్షుడు సాజిద్ ఖాన్(నరేష్ యాదవ్)ఆసిఫాబాద్ అసెంబ్లీ ఇన్చార్జ్ శ్యాం నాయక్,సీనియర్ నాయకులు లోక భూమారెడ్డి,ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్‌కు ఎమ్మెల్యే సన్మానం



ప్రజాపక్షం/లోకేశ్వరం : లోకేశ్వరం మండలంలోని జోహార్ పూర్ గ్రామానికి చెందిన దయానంద్ సర్పంచ్‌కు ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ ఆధ్వర్యంలో స్వతంత్రంగా గెలుపొందిన జోహార్‌పూర్ సర్పంచ్, ఉపసర్పంచ్ ద్యావత్ పోశెట్టి,వార్డ్ మెంబర్స్ తిరుమని యశోద,బ్యాగరి లక్ష్మ ణ్ తన అనుచరులతో కలిసి భారతీయ జనత పార్టీలో చేరడం జరిగింది.ఈ సందర్భంగా వారికి సత్కారం చేశారు.అలాగే గ్రామ అభివృద్ధికి ఎల్లవేళలా తోడ్పడతానని ఎమ్మెల్యే పవర్ రామారావు తెలిపారు.

# ప్రజల సహకారంతో ప్రశాంతంగా ఎన్నికలు

జిల్లా ఎస్పి జానకి షర్మిల



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ జిల్లా వ్యాప్తంగా మూడు విడతలుగా నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలు అత్యంత శాంతియుత వాతావరణంలో,విజయవంతంగా ముగిశాయని జిల్లా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల ఐపీఎస్ అధికారికంగా ప్రకటించారు.ఈ ఎన్నికల ప్రక్రియ అంతటా ప్రజలు అందించిన అపారమైన సహకారం,వివిధ ప్రభుత్వ శాఖల మధ్య నెలకొన్న సమన్వయం,పోలీసు విభాగం ప్రదర్శించిన అచంచలమైన కర్తవ్యనిష్ఠ వల్లే ఈ విజయం సాధ్యమైందని అమె కొనియాడారు.ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుం డా, ప్రజాస్వామ్య పండుగను దిగ్విజయంగా పూర్తి చేయడంలో జిల్లా పోలీసు యంత్రాంగం కీలక పాత్ర పోషించిందని ఆమె వివరించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 900 మందికి పైగా పోలీసు అధికారులు,సిబ్బంది విడతల వా రీగా క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా విధులు నిర్వహించారు.ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తొలి రోజు నుంచే జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణకు కఠినమైన చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు.ముఖ్యంగా జిల్లా సరిహద్దుల్లో 12 వ్యూహాత్మక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడమే కాకుండా గ్రామాల్లో ప్రత్యేక నిఘా వ్యవస్థను బలోపేతం చేశారు. సరైన ఆధారాలు లేని 14,67,700 రూపాయల నగదును సుమారు 7 లక్షల రూపాయల విలువైన అక్రమ మద్యం నిల్వలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పా ల్పడిన వారిపై కఠినంగా వ్యవహరిస్తూ పలు కేసులు కూడా నమోదు చేశారు. అతేకాకు ఒడా, ఎన్నికల సమయం లో ఎటువంటి ఘర్షణలు తలెత్తకుం డా పాత నేరస్తు లు ,రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తులపై పోలీసు యంత్రాంగం ఉ క్కుపాదం మోపింది. ము ందస్తు చర్య ల్లో భాగ ంగా 151 కేసుల్లో సు మారు 201 మందిని బైం డోవర్ చే యడం ద్వా రా పల్లెల్లో ప్ర శాంత వాతావరణాన్ని నెలకొల్పారు. గడ్డకట్టే చలిని సైతం లెక్కచేయకుం డా,పగలు రాత్రి అన్న తేడా లేకుండా నిరంతరం శ్రమించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఎన్నికలు ముగిశాయని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

# కొలువుదీరనున్న గ్రామ కొత్త సారథులు

ముస్తాబవుతున్న పంచాయతీలు




ప్రజాపక్షం/ఎడపల్లి: పంచాయతీ ఎన్నికల కోలాహలం ముగిసింది. మూడు విడతల్లో జరిగిన ఎన్నికల ప్రక్రియ బుధవారంతో పూర్తికావడంతో ఇప్పు డు అందరి దృష్టి బాధ్యతల స్వీకారంపై మళ్లింది. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా ఎన్నికైన సర్పంచులు ఈ నెల 22వ తేదిన పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారనే ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామ పంచాయతీల్లో ఒకే రోజు ఈ కార్యక్రమం జరగనుండటంతో గ్రామాలు పండగ వాతావరణం సంతరించుకుంటున్నాయి. సర్పంచులు తమ తొలి అడుగు చిరస్మరణీయంగా మార్చుకోవాలని తపిస్తున్నారు. చాలా చోట్ల పంచాయతీ కా ర్యాలయాలకు కొత్త రంగులు వేయిస్తూ విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు.నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలో సర్పంచ్‌లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సొంత ఖర్చులతో కార్యాలయాలకు మరమ్మతు లు చేయిస్తూ రం గులు వేయిస్తున్నారు. వార్డు సభ్యుల కోసం ప్రత్యేకంగా పర్నిచర్‌ను సిద్ధం చేస్తున్నారు. తమ పదవీ కాలం సాఫీగా సాగాలని వాస్తు దో షాల ను సరిచేయించుకుంటూ కార్యాలయాల్లో మార్పులు చేస్తున్నారు.

## రైతులు ఆప్ ద్వారానే యూరియా బుక్ చేయాలి

జిల్లా వ్యవసాయాదికారి దేవ్‌కుమార్

ప్రజాపక్షం/రామాయంపేట: రైతులు ఫర్టిలైజర్ యూరియా ఆప్ ద్వారానే యూరియాను బుక్ చేసుకొని కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయాదికారి దేవ్‌కుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం రామాయంపేట వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో మోబైల్ ఆప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుండి యూరియా ఆప్‌ను లైవ్ చేయడం జరుగుతుందన్నారు. యూరియా బుకింగ్ చేయడానికి పట్టా భూ యజమానులు, నాన్ పట్టా రైతులు, కౌలు రైతులు మాత్రమే అర్హులన్నారు. మీగుర్తింపును నిర్ధారించడానికి మరియు బుక్ చేయడానికి పట్టాపాస్ పుస్తకంతో లింక్ చేయబడిన మోబైల్ నంబర్కు వన్‌టైం పాస్ వర్డ్ (ఓటిపి) వస్తుందని తద్వారా యూరియాను బుక్ చేసుకోవాలని ఆయన సూచించారు. రైతులకు సులభంగా ఉన్న ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాదికారి రాజ్‌నారాయణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి



ప్రజాపక్షం/శివ్వంపేట : నూతనంగా గెలుపొందిన సర్పంచ్‌లు అందరు గ్రా మాల అభివృద్ధియే లక్ష్య ంగా పనిచేయాలని జిల్లా గ్రంధాలయ చైర్మన్ సుహాసినిరెడ్డి, డీసీసీ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులుగౌడ్‌లు అన్నారు. శుక్రవారం శివ్వంపేట మండలంలో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేసిన కాంగ్రెస్ మండలాధ్యక్షులు కొడకంచి సుదర్శన్‌గౌడ్, ప్రముఖ సంఘ సేవకులు బండారి గంగాధర్‌తో పాటు పలువురిని అభినందించారు.

# జాన్కంపేట్‌లో అనుమానాస్పద వ్యక్తుల గుర్తింపు

పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు



ప్రజాపక్షం/ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో శుక్రవారం బిక్షాటన పేరుతో గ్రామంలో అనుమానస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. శుక్రవారం గ్రామంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బిక్షాటన చేస్తూ ఇళ్ల మధ్య తిరుగుతూ, అనుమానస్పదంగా వ్యవహారించడం గ్రామస్తుల దృష్టికి వచ్చింది. వారు అడిగిన ప్రశ్నలకు సదరు వ్యక్తులు పొంతన లేని సమాధానాలు, పేర్లలో తేడాలు, బిక్షాటన చేస్తూ మధ్యప్రదేశ్ నుంచి తెలంగాణ వచ్చామని చెప్పడంతో స్థానికులకు అనుమానం బలపడింది. వెంటనే అప్రమత్తమైన గ్రామస్తులు వారిని నిలదీసి, అనంతరం ఎడపల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడ్డ వ్యక్తులు ఎక్కడి నుంచి వచ్చారు.. బిక్షాటన ముసుగులో ఏవైనా నేరాలకు పాల్పడే ఉద్దేశం ఉందా..? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. కొత్త వ్యక్తులు ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఘటన గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

## క్రీడా పోటీలు వ్యక్తిత్వ నిర్మాణానికి పునాదులు

తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్



ప్రజాపక్షం/భీమ్‌గల్ : విద్యార్థి దశలో క్రీడలతోవ్యక్తిత్వ నిర్మాణం, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. శుక్రవారంజిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్సియల్ పాఠశాల స్కూల్స్, జోష్ 3వ క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు క్రీడా వందనాన్ని సమర్పించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్య, ఆరోగ్యకరమైన ఆహారం, తెలంగాణ మైనార్టీ రెసిడెన్సియల్ పాఠశాలలు, కళాశాలలో ఆధునిక సౌకర్యాలతో పాటు క్రీడా రంగంపై దృష్టి సారించిందని తద్వారా విద్యార్థులు మానసిక ఒత్తిడి లేకుండా క్రీడా రంగంలో మెరుగ్గా రాణించగలరన్నారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం పెరుగుతుందని క్రీడలు కూడా విద్యలో ఒక భాగమన్నారు. ప్రతి విద్యార్థి తమ కళను తన సామర్థ్యం మేరకు ప్రదర్శించాలని ప్రోత్సహించాలని జిల్లా ప్రాంతీయ సమన్వయకర్త మహ్మద్ అబ్దుల్ బాసిర్ క్రమశిక్షణ, ధైర్యానికి ఒక వేడుక అన్నారు. ప్రిన్సిపాల్ సూర్యకాంత్‌రెడ్డి, హిర్మేన్, అంతిరెడ్డి రాజారెడ్డి, బరున్‌ఖాన్, ఇజాజ్ హుస్సేన్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెద్దాం

గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

ప్రజాపక్షం/గజ్వేల్: గజ్వేల్ నియోజకవర్గంలో అత్యధిక సర్పంచ్ స్థానాలను దక్కించుకొని కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిందని, అయితే కార్యకర్తల కష్టంతోనే ఇది సాధ్యపడిందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్ మండల సర్పంచ్ల ఫోరం ఎన్నికలు జరగగా, పిడిచెడ్ సర్పంచ్, న్యాయవాది అశోక్ రెడ్డిని అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నర్సారెడ్డి ఆయనను సత్కరించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెద్దామని స్పష్టం చేస్తూ ఊహించని విధంగా గణనీయమైన ఫలితాలు సాధించినట్లు చెప్పారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో సత్తా చాటుదామని స్పష్టం చేశారు. గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ ను ఇక్కడి ప్రజలు ఫాంహౌజ్ కు పరిమితం చేయగా, వచ్చిన ఫలితాలతో ఇంకా ఆయన ఏ ముఖం పెట్టుకొని తిరుగుతారని ఎద్దేవా చేశారు. గజ్వేల్ ప్రజల సమస్యలను గాలికొదిలిన కేసీఆర్, రెండేళ్ల కాలంలో రూ రెండు కోట్ల ప్రజల సొమ్మును అప్పనంగా మెక్కినట్లు విమర్శించారు. త్వరలోనే ఇక్కడి నూతన సర్పంచులను సీఎం రేవంత్ రెడ్డి వద్దకు తీసుకెళ్లి తగిన నిధులు సాధిస్తామని వివరించారు.

## హైకోర్టు జడ్జిని కలిసిన అఖిలపక్షం



ప్రజాపక్షం/భీమ్‌గల్ : భీమ్‌గల్ పట్టణంలో కోర్ట్ మంజూరు చేసిన నేపథ్యంలో శుక్రవారం తెలంగాణ హై కోర్ట్ జడ్జీ గాడి ప్రవీన్‌రావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో హైదరాబాద్ వెళ్లిన నాయకులు కోర్ట్ మంజూరు చేయటం పట్ల మండల ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కోర్ట్ మంజూరైందని కోర్ట్ ఏర్పాటుకు కావల్సిన సౌకర్యాలు నాయకులు సమకూర్చటంతో కోర్ట్‌కు సంబంధించిన పనులు ప్రారంభం చేయటం జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపినట్లు అఖిల పక్షం నాయకులు తెలిపారు. అనంతరంజిల్లా కోర్ట్ ఇన్‌చార్జి జడ్జీ మేడం మాధవిలతను అఖిలపక్షం నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కోర్ట్ ఏర్పాటుకు కావల్సిన భవనం, ఇతర సౌకర్యాలను అఖిలపక్షం ఆధ్వర్యంలో చూస్తామని తెలిపారు. కోర్ట్ మంజూరైన నేపథ్యంలో అన్ని సమకూర్చేందుకు ఏర్పాటు చేయాలని సూచించారు. అక్కడి నుండి భీమ్‌గల్ మండల వాస్తవ్యులు, రహత్‌నగర్ గ్రామస్తులు పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వీరిని కలిసిన వారిలో అఖిలపక్షంనాయకులు సభ్యులు ఉన్నారు.

## క్షయ నివారణకు కృషి

**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలోనిమోతేవాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం టీబీ అలర్ట్ ఇండియా వారు టీబీ ఛాంపియన్ల కోసం శిక్షణా కార్యక్రమాన్నినిర్వహించగా శిక్షణ కార్యమానికి ముఖ్య అతిథిగా జగిత్యాల జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్.శ్రీనివాస్ హాజరయ్యారు. కొత్త క్షయ కేసులను తొలి విడతలోనే గుర్తించి చికిత్స అందిస్తున్నామని డా.ఎన్.శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న టీబీ నిర్మూలన చర్యలు ప్రతి ఏఎం సెంటర్ మరియు సబ్ సెంటర్ స్థాయిలో టీబీ లక్షణాలపై అవగాహన కార్యక్రమాల ఆవశ్యకత గురించి టీబీ ఛాంపియన్లకు వివరించడం జరుగుతుందని తెలిపారు. అలాగే క్షయ వ్యాధిగ్రస్తులకు నిక్షయ్ పోషణ్ యోజన పథకం క్రింద ప్రభుత్వం అందిస్తున్న నెలకు 500 రూపాయలను పోషకాహారం నిమి త్తం నేరుగా పేషెంట్ల యొక్క ఖాతాలోకి జామ చేయడం జరుగుతుందని ఇటువంటి ప్రయోజనాల గురించి టీబీ ఛాంపియన్లకు వివరించామన్నారు. సీనియర్ టీబీ సూపర్వైజర్ శ్రీనివాస్, జిల్లా లీడ్ రవి, రిసోర్స్ పర్సన్ దత్తురామ్, ప్రతి సెంటర్ నుండి వైద్య ఆరోగ్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## 'ఓటు'తో అనేక ప్రయోజనాలు

**ప్రజాపక్షం/శంకరపట్నం:** శంకరపట్నం మండల కేంద్రం లోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కే. ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా తహసిల్దార్ సురేఖ మండల విద్యాశాఖ అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడారు ఓటు యొక్క ప్రాధాన్యత, ఓటు ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలు, ప్రజాస్వామ్య దేశంలో ఓటు విలువను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. ఎన్నికల నిర్వహణ విధానం, పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, ఓటు వేసే పద్ధతులను విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులే ప్రిసైడింగ్ అధికారులుగా, ఏపీవోగా, పోలింగ్ అధికారులుగా, పోలింగ్ ఏజెంట్లుగా వ్యవహరిస్తూ మాక్ పోలింగ్ ను నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, భారతదేశంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరునికి ఓటు హక్కు ఉంటుందని తెలిపారు.ఆ ఓటు హక్కును నిజాయితీగా వినియోగించి మంచి పాలకులను ఎన్నుకునే అవకాశం రాజ్యాంగం ప్రతి పౌరునికి కల్పించిందని వివరించారు. ముఖ్యంగా విద్యార్థులు నిర్వహించిన మాక్ పోలింగ్ కార్యక్రమం అభినందనీయమని ప్రశంసించారు.

## బస్తి దవఖానాకు సుస్తి.. డాక్టర్ కుర్చీకి దుమ్ము పట్టింది

* ఆరునెలలుగా డాక్టర్లు లేరు
* ప్రజావైద్యాన్ని నిర్వీర్యం చేస్తున్న తెలంగాణ సర్కార్

**మాజీ మంత్రి హరీశ్‌రావు**



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా కేంద్రం లోని బస్తి దవఖానను మాజీ మంత్రి హరీష్ రావు శుక్రవారం అకస్మీకంగాతనిఖీ చేశారు. బస్తి దవఖానలో ఉన్న స్టాఫ్ నర్సులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సిద్దిపేలో నాలుగు చోట్ల బస్తి దవఖానాలు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఒక్క కెసిఆర్ నగర్‌లోని బస్తి దవఖానను మినహాయించి మిగత మూడు చోట్ల బస్తి దవఖనాలు కాళ్లకుంట కాలనీ, లింగారెడ్డిపల్లి, ఆర్అండ్‌బి కార్యాలయం సమీపంలోని దవఖానల్లో డాక్టర్లు లేకపోవటం వల్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్లు లేక మెడికల్ అధికారులు రూమ్ పెచ్చులు ఊడిపోయి, డాక్టర్లు కూర్చునే కుర్చీ దుమ్ము పట్టి ఉండటం వల్ల ఇదేనా బస్తి దవఖాన తీరు అని, డాక్టర్లు లేకుండ ప్రజలకు వైద్యం ఏలా అందిస్తారని ప్రశ్నించారు. పేద ప్రజల కోసం బిఆర్ఎస్ బస్తి దవఖానలు ఏర్పాటు చేస్తే వాటిని సుస్తి దవఖానలుగా కాంగ్రెస్ ప్రభుత్వం మార్చిందన్నారు. ఒక వైపు ఆరునెలలు గాడాక్టర్ రావటం లేదని, మరో వైపు ఉన్న అటెండర్లకు మూడు నెలలుగా జీతాలు రావటం లేదన్నారు. ఉన్న స్టాఫ్‌నర్స్‌కు నవంబర్ నుండి వేతనం ఇప్పటికి రాలేదని సీరియస్ అయ్యారు. దవఖాన మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. మల్టీవిటమిన్, లోప్రై మేడ్, లివో సిట్రిజన్ జలుబు టాబ్లెట్. షుగర్ టాబ్లెట్. మెటఫిన్‌తో ఉండాల్సిన గ్లిమి ఫిరైడ్ 2ఎంజీ లేదని .అదే విధంగా చిన్న పిల్లలకు సంబంధించిన జింక్ సల్పేట్ లేవన్నారు. డాక్టర్లు వస్తారలేరని, మందులు లేవని, అలాంటప్పుడు ప్రజలకు వైద్య సేవలు ఏలా అందుతాయన్నారు. ప్రజావైద్యం పట్ల నిర్లక్ష్యం వీడాలని వెంటనే బస్తి దవఖానలో వైద్యులను ఏర్పాటు చేయాలన్నారు.

## డిజిఎం జియాలజిస్టుకు అభినందన



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని ఎక్స్ ప్లోరేషన్ డిపార్ట్మెంట్ కు నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన డిజిఎం జియాలజిస్టు రమేశ్ కు గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులు పూల బోకే అందించి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ఎక్స్ ప్లోరేషన్ డిపార్ట్మెంట్ లో పని చేస్తున్న ఏఐటియుసి డిపార్ట్మెంట్ కమిటీ సభ్యులను జియాలజిస్టు రమేశ్ కు పరిచయం చేస్తూ, కార్మికుల కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఉపాధ్యక్షులు సంకె అశోక్, సహాయ కార్యదర్శి రంగు శ్రీను, నాయకులు ఎం ఎ గౌస్, సయ్యద్ సోహేల్, పొన్నాల వెంకటయ్య, గుర్రం ప్రభుదాస్, నాయిని శంకర్, డిపార్ట్మెంట్ కార్యదర్శి ఎం సత్యనారాయణ, వెంకటేష్, ఎర్రగొల్ల చేరాలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్‌కు సన్మానం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** జూలపల్లి మండలంలోని కుమ్మరి కుంట గ్రామానికి నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ సర్పంచ్ ప్రభుదాస్ మర్యాదపూర్వకంగా మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డిని శుక్రవారం కలిశారు.ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు కుమ్మరి కుంట గ్రామ సర్పంచ్ ప్రభుదాస్‌ను సన్మానించారు.పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంధాలయ చైర్మన్ రఘువీర్ సింగ్ , మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.

## యూరియా కోసం ప్రత్యేక యాప్



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని రైతులు బుకింగ్ యాప్‌ను వినియోగించుకొని యూరియాను సులభంగా పొందవచ్చని సిద్దిపేట అర్బన్ మండల వ్యవసాయ అధికారి బి శ్రీనాథ్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలంలోని పోన్నాల రైతు వేదికలో రైతులకు యూరియా బుకింగ్ యాప్‌పై మండల వ్యవసాయ అధికారి బి శ్రీనాథ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ మొబైల్ నంబర్‌తో యూరియా బుకింగ్ యాప్‌లోకి సులభంగా లాగిన్ కావచ్చని, యూరియా బుకింగ్ చేసుకోవడానికి భూయాజమానులు, పట్టాదారులు, కౌలు రైతులు మాత్రమే అర్హులని,పట్టా పాస్‌బుక్‌తో లింక్ గల ఫోన్ నంబర్‌తో లాగిన్ అవ్వాలని,వన్‌టైం పాస్‌వర్డు వస్తుందని తెలిపారు. జిల్లాలోని రిటైలర్ల వద్ద స్టాక్ లభ్యతను బట్టి యూరియాను బుక్ చేసుకోవచ్చన్నారు. ఒకవేళ బుక్ చేసుకోని యూరియాను 24గంటలలో పొందలేకపోతే ఆటోమేటిక్‌గా గడువు ముగుస్తుందన్నారు. రైతులు సాగు టాబ్లో భూమి విస్తీర్ణాన్ని నమోదు చేసుకోవాలని సూచించారు.

## వల చుట్టుకొని మత్స్య కారుడు మృతి

**ప్రజాపక్షం/మల్యాల :** చేపల వేటకు వెళ్ళి ప్రమాదవశాత్తు వరధ కాల్వలో పడి చేపల వల చుట్టుకొని మత్స్య కారుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది.ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా మల్యాల మండలం నూక పెల్లి గ్రామానికీ చెందిన దువ్వక నడిపి నర్సయ్య వయస్సు (55) అను నతడు గురువారం రామన్నపేట గ్రామ శివారులో గల ఎస్సారెస్పీ వరద కాలువ లో చేపలు పట్టుటకు వెళ్లి ప్రమాదవశాత్తు చేపల వలలో చిక్కుకొని ఊపిరి ఆడక చనిపోయినట్లు ఎస్సై వివరించారు. మృతుని కొడుకు దువ్వాక నరేష్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# మహాత్మాగాంధీ పేరు తొలగింపు దుర్మార్గం

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి**



**ప్రజాపక్షం/చిగురుమామిడి:** దేశవ్యాప్తంగా అనేక సంవత్సరాలుగా వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు అభ్యుదయవాదులు,వ్యవసాయకార్మికసంఘాలుపోరాడి సాధించుకున్నమహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపేరుమార్చిఉపాధి కూలీల పని హక్కును హరించే విధంగా బిజెపి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గసభ్యుడుచాడ వెంకటరెడ్డి ఆరోపించారు.శుక్రవారం చిగురుమామిడి మండల కేంద్రం లోని సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వెంకటరెడ్డి మాట్లాడుతూఎంతో మంది కూలీలు పనులు లేక ఇబ్బందులు పడుతూ కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితుల్లో ఉంటున్నారని నాడు వామపక్ష పార్టీలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి 2005లోయూపీఏ ప్రభుత్వాన్ని అన్ని పక్షాలు ఒప్పించి కూలీలకు పని హక్కును కల్పించడం కోసం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకువచ్చిందని ఆ పథకం ద్వారా దేశవ్యాప్తంగా కోట్లాది మంది కూలీలు బ్రతుకుతున్నారని, ఆనాడు వంద రోజులు పని కల్పిస్తే 200 రోజుల పని కల్పించాలని సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తూ వస్తున్నాయని, పని ప్రదేశాల్లో అన్ని రకాల సౌకర్యాలు పనిముట్లు, త్రాగడానికి త్రాగునీరు, మెడికల్ కిట్లు తదితర సౌకర్యాలు కల్పించాలని పోరాటాలు నిర్వహించడం జరిగిందన్నారు. పేద కూలీలకు వరప్రసాదంలాంటి ఈ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని దానికి ఉదాహరణ మహాత్మా గాంధీ పేరును ఆ పథకానికి తొలగించిందని, పార్లమెంటులో ప్రతిపక్షాల గొంతు నొక్కి బిల్లు పాస్ చేసుకోవడం దుర్మార్గమైన చర్య, సిపిఐ ఖండిస్తుందని పేర్కొన్నారు.

### గెలుపు, ఓటములు సహజం

ఎన్నికల్లో గెలుపు ఓటమిలు సహజమని ఓడిపోయినంత మాత్రాన కృంగిపోకుండా ప్రజాక్షేత్రంలో ఉండి ప్రజల కోసం నిరంతరం పనిచేయాలని సిపిఐ శ్రేణులకు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. చిగురుమామిడి మండలం ముఖ్య కార్యకర్తల సమావేశం ముల్కనూర్ ఉప సర్పంచ్ పైడిపల్లి వెంకటేష్ అధ్యక్షతన మండల కేంద్రంలోని ముస్కు రాజిరెడ్డి స్మారకభవన్‌లో జరిగింది.ముఖ్యఅతిథిగాచాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇటీవల 3 విడతల్లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు పార్టీకి కొంత నిరాశ కలిగించాయని, చిగురుమామిడిమండలంలోసర్పంచ్ అభ్యర్థులుగా,వార్డు సభ్యులుగా పోటీ చేసి ఓడిపోయినంత మాత్రాన ఏమాత్రం నిరాశ చెందవద్దన్నారు. సిపిఐ జిల్లాకార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీకి కంచుకోటగా నిలిచిన చిగురుమామిడి మండలంలో ఏ ఒక్క సర్పంచ్ స్థానం కూడా దక్కించుకోకపోవడంబాధాకరమైనప్పటికీ పార్టీ నిర్మాణాన్ని పటిష్టపరచుకుందామన్నారు. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, నియోజకవర్గ కన్వీనర్ జాగీరు సత్యనారాయణ, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, గూడెం లక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్న స్వామి, చాడ శ్రీధర్ రెడ్డి, బోయిని పటేల్, బూడిద సదాశివ, తేరాల సత్యనారాయణ,ముల్కనూర్ ఉప సర్పంచ్ పైడిపల్లివెంకటేష్,నూతన వార్డు సభ్యులు అందె సంపత్, తిరుపతి, బింగి విజయస్వామి, బరిగెల చొక్కయ్య,దున్నపోతుల సౌందర్య, కంతం అనిల్ ఉన్నారు.

# విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

**విద్యార్థులందరికీ దంత వైద్యపరీక్షలు**
**కలెక్టర్ పమేలా సత్పతి**



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఏ ఒక్క విద్యార్థి దంత సమస్యలతో బాధపడకుండా చూడాలని వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. జిల్లాలో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక క్యాంపు నిర్వహించి విద్యార్థులందరికీ దంత వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.శుక్రవారం కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో మంకమ్మ తోట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వైద్యులు దంత వైద్య చికిత్స నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆసుపత్రి నుంచి వైద్య చికిత్స తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. దంత వైద్యులు చేస్తున్న పరీక్షలను పర్యవేక్షించి విద్యార్థులతోనూ మాట్లాడారు. కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా అందిస్తున్న దంత వైద్య సేవలను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 10నుంచి కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో దంత వైద్యులు ప్రత్యేకంగా క్యాం పులు నిర్వహిస్తూ విద్యార్థులకు పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో దాదాపు వైద్యుల బృందం 12 వేల మంది విద్యార్థులకు పరీక్షలు చేస్తున్నామని, ఇందులోదంత సమస్యలతో బాధపడుతున్న వారిని 1500మందిని గుర్తించినట్లు తెలిపారు. ఈ నెల 23 వరకు మొదటి విడత క్యాంపులను పూర్తిచేయాలని ఆదేశించారు. జనవరి ఫస్ట్ నుంచి రెండో విడత పరీక్షల నిర్వహణ ప్రారంభించాలని సూచించారు. కార్పొరేట్ ప్రభుత్వ ఆసుపత్రులకు దీటు గా వైద్యులు చికిత్స అందిస్తున్నారని తెలిపారు. దంత వైద్య పరీక్షలను పకడ్బంధిగా నిర్వహిస్తున్న వైద్యులను జిల్లా కలెక్టర్ అభినందించారు. కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెంట్ జి వీరారెడ్డి, ఆర్ఎంవో నవీనా వైద్యులు రవి ప్రవీణ్, రణధీర్, ప్రవీణ్, రాజిరెడ్డి, మంగ, శరత్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


## పంచాయతీ ఎన్నికల్లో కరీంనగర్ ఫస్ట్




**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ జిల్లాలో ఇటీవల మూడు దశల్లో నిర్వహించిన పంచాయతీ ఎన్నికల ప్రక్రియను ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ప్రశాంత వాతావరణంలో అత్యంత సమర్థవంతంగా విజయవంతంగా పూర్తిచేసినందుకు గౌరవ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కి టీఎన్జీవోల సంఘం, టీజీవోల సంఘంల తరఫున పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల కంటే ముందుగానే ఎన్నికల ప్రక్రియను పూర్తిచేసి కరీంనగర్ జిల్లాను ముందువరుసలో నిలిపేందుకు జిల్లా యంత్రాంగం చూపిన సమన్వయం ప్రశంసనీయమని టీఎన్జీవోల జిల్లా అధ్యక్షులు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి,టీజీవోల జిల్లా అధ్యక్షులు, జేఏసీ కన్వీనర్ మడిపెల్లి కాళీచరణ్ గౌడ్ పేర్కొన్నారు.సంగం లక్ష్మణరావు, అరవింద్ రెడ్డి, గడ్డం సుధాకర్, ముప్పిడి కిరణ్ కుమార్, ఒంటెల రవీందర్ రెడ్డి రాగి శ్రీనివాస్, సర్దార్ అరవింద్ సింగ్, అభినవ రెడ్డి, మహేందర్ రెడ్డితో పాటు నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు కోటా రామస్వామి, శంకర్ శ్రీనివాస్,ఉద్యోగసంఘ నాయకులు పాల్గొన్నారు.

# బోడిగపల్లిలో రీ-కౌంటింగ్ జరపాలి

**సర్పంచ్ అభ్యర్థి బొల్లి రవీందర్**



**ప్రజాపక్షం/అక్కన్నపేట :** ఈ నెల 17న సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం బొడిగపల్లిలో జరిగిన పంచాయతీ ఎన్నికల పోలింగ్ ఫలితాలపై సర్పంచ్ అభ్యర్థి బొల్లి రవీందర్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ రికౌంటింగ్ జరపాలని స్థానిక ఎంపిడివోకు వినతి పత్రంఅందజేసి మాట్లాడారు. వివరాల్లోకి వెళ్ళితే మండలంలోని బొడిగపల్లి గ్రామ పంచాయతీకి సంబంధించి సర్పంచ్ అభ్యర్థిత్వానికి జనరల్ స్థానం (అన్ రిజర్వ్‌డ్ కేటగిరి) కేటాయించడంతో గ్రామానికి చెందిన బొల్లి రవీందర్ స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేశారు.తన ప్రత్యర్థులుగా మరో ఇద్దరు పోటీలో నిలవగా ముగ్గురికి జరిగిన ఈ ఎన్నికల్లో గ్రామ ఓటర్లు 351 మంది గానూ 315 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.జరిగిన ఈ ఎన్నికల ఫలితాలను మధ్యాహ్నం 2 గంటల తర్వాత కౌంటింగ్ నిర్వహిస్తున్న సమయంలో తమ ఏజెంట్లనులోనికి రాకుండా ఒక్కరికి మాత్రమే అనుమతి ఉందని స్థానిక రిటర్నింగ్ అధికారులు అడ్డుకోవడంతో తమని మాత్రమే అనుమతించారని సర్పంచ్‌అభ్యర్థిబొల్లి రవి ఆరోపించారు. ఆ సమయంలో తనను మాత్రమే లెక్కింపు సమయంలో లోనికి అనుమతించగా వెళ్ళానన్నారు. 4 వార్డుల లెక్కింపు తదనంతరం తాను సొమ్మసిల్లి పడిపోయానని,స్పృహలో లేని ఆ సమయంలోనే తన ఎన్నికల ఫలితాల లెక్కింపు పూర్తయిందని అధికారులు తనతో ధృవీకరణ పత్రాలపై సంతకాలు చేయించారని,ఆ తర్వాత తాను బయటకు రాగానే తన కూతురు సైతం స్పృహకోల్పోవడంతో తాను హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళి తిరిగి తాను మళ్ళీ గ్రామంలోని ఎన్నికల కేంద్రానికి చేరుకోగానే ఎన్నికల ఫలితాల లెక్కింపు పూర్తయిందని అధికారులు వెల్లడించారన్నారు.కాగా తాను లేని సమయంలో తన ప్రత్యర్థులతో అధికారులు కుమ్మక్కై లెక్కింపు ప్రక్రియలో అవకతవకలకు పాల్పడ్డారనిఆరోపించారు. రికౌంటింగ్ జరపాలని, న్యాయమైన ఫలితాలు వెల్లడించాలని జిల్లాసహాయ ఎన్నికల అధికారి,ఎంపిడివో భానోతు జయరాంనాయక్‌కు వినతిపత్రం అందించానని ప్రజాపక్షం'తో తన బాధని వెలిబుచ్చారు.

## మత్స్యకారులకు ప్రమాద బీమా అందజేత

**ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం క్రింద గ్రూప్ ప్రమాద బీమా పత్రాలను పలువురికి ధృవీకరణ పత్రాలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం అందజేశారు. కోనరావుపేట మండలం కొలనూర్ గ్రామానికి చెందిన కూన తిరుపతి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీంతో అతడి భార్య కూన లావణ్యకు, అలాగే గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామానికి చెందిన కుంట రమేష్ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీంతో అతడి తల్లి కుంట మల్లవ్వ బ్యాంక్ ఖాతాల్లో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం క్రింద గ్రూప్ ప్రమాద బీమా కింద రూ. ఐదు లక్షల చొప్పున ఇద్దరికి జమ అయ్యాయి. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం క్రింద గ్రూప్ ప్రమాద బీమా పలువురికి ధృవీకరణ పత్రాలను ఇంచార్జి కలెక్టర్ అందజేశారు.జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, మత్స్యకారుల సహకార సంఘం అధ్యక్షులు మామిండ్ల అంజయ్య, చింతకింది పోచయ్య, కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# 'జి రాం జీ' బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలి

**సిపిఐ మాజీ కార్యదర్శి గుంటి వేణు**




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** గ్రామీణ పేదలకు ఆధారంగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పూర్తిగా నిర్వీర్యం చేసే ప్రయత్నంలో భాగంగా ప్రస్తుతం అధికారంలో ఉన్న బిజెపి సర్కారు కుట్రలు చేస్తుందని సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ కూలీల పొట్ట గొట్టే జిరాంజి బిల్లును ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో సిపిఐ పార్టీ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం మరియు తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి నూతనంగా వి.బి జీ రామ్ జి పేరుతో కేంద్రం తీసుకొచ్చిన కొత్త బిల్లు ఉపాధి హామీ బిల్లును పూర్తిగా నీరుగార్చే విధంగా ఉందని విమర్శించారు. గతంలో ఉపాధి హామీ పథకానికి కేంద్రం నుండి 90 శాతం నిధులు వచ్చేవని ప్రస్తుతం నూతన బిల్లులో కేంద్రం నిధులు 60 శాతం, రాష్ట్రం నిధులు 40 శాతం అని ప్రకటించడం చాలా దుర్మార్గమని మండిపడ్డారు. ఈ దీనివల్ల రాష్ట్రాలపై మరింత అదరపు భారం పడే అవకాశం ఉందని 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని చెప్పినా పనుల పర్యవేక్షణ మాత్రం పూర్తి అధిపత్యాన్ని కేంద్ర ప్రభుత్వం చలాయించే విధంగా ఈ బిల్లు ఉందన్నారు. టెక్నాలజీ పేరుతో కూలీల పని దినాలలో కోతపెట్టేందుకు కుట్ర చేస్తుందని ఆధార్ ఆధారిత చెల్లింపులు డిజి టెల్ హాజరుతో ఇప్పటికే కూలీలు సతమతమవుతూ ఉంటే కొత్త బిల్లులో బయోమెట్రిక్ ధ్రువీకరణ జియో స్పెషల్ టెక్నాలజీని తప్పనిసరి చేయనున్నారని వ్యవసాయ కూలీలు వృద్ధులకు బయోమెట్రిక్ పడడం ఎంతో కష్టమో తెలిసినా ప్రభుత్వం ఈ నిబంధ పెట్టి పథకం నుంచి పేదలకు దూరం చేసే ప్రయత్నాలు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 200 రోజుల పని దినాలకు పెంచి రోజుకు 600 వేతనంతో పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుర్ర మల్లేశం, పంతం రవి, సోమ నాగరాజు, మీసం లక్ష్మణ్, మంత్రి చంద్రయ్య, గాజుల లింగం తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేటలో కాంగ్రెస్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రివివేక్ వెంకటస్వామి**



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట నియోజక వర్గంలో బిఆర్ఎస్‌ను పారదోలి.. కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని రాష్ట్ర కార్మిక,ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. బిఆర్ఎస్ పార్టీ, ,హరీష్‌రావుపై ప్రజలు విశ్వాసం కోల్పోయారన్నారు. శుక్రవారం సిద్దిపేట అర్బన్ మం డలం ఎన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ అభ్యర్థి కృష్ణమూర్తితో పాటు పలువురు నేతలు నియోజక వర్గం ఇంచార్జి పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా, జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ సిద్దిపేటలో కాంగ్రెస్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడుతామన్నారు. ఇప్పటికే సిఎం రేవంత్‌రెడ్డి. రాష్ట్ర ఇంచార్జి మీనాక్షినటరాజన్. పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో చర్చలు జరిపినట్లు తెలిపారు. సిద్దిపేట అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సిద్దిపేటలోకాంగ్రెస్ బలోపేతానికి అవసరమగు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేటలో బిఆర్ఎస్‌ను పారదోలి కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి,అర్బన్ మండల అధ్యక్షుడు బిక్షపతి,సీనియర్‌నాయకులు గంప మహేందర్‌రావు, బొమ్మల యాదగిరి, కలీమొద్దీన్, దాస అంజయ్య, అంబటి మహేశ్. కొత్త మహిపాల్‌రెడ్డి. ఎర్ర మహేందర్, ఉపసర్పంచ్ సంతోష్‌రెడ్డి, వార్డు సభ్యులుకనకరాజు,గిరి, సతీష్, దుర్గారెడ్డి. పంపరి మల్లేశం. తరిగొప్పుల స్వామి,ప్రభాకర్‌రెడ్డి, బాలరాజ్. వెంకటేశం. రమేశ్. ఆకుల మల్లేశం, సోమేష్ తిరమల్ తదితరులు పాల్గొన్నారు.

## అంబరాన్నింటిన ఆల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూలు వార్షికోత్సవం



**ప్రజాపక్షం/కరీంనగర్:** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇటెక్నో స్కూల్ లో ఇమ్మెన్స్ పేరుతో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సరస్వతి మాత విగ్రహానికి పూజ నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చక్కటి ప్రణాళికలను రూపొందించి వ్యూహాత్మకంగావ్యవహరిస్తూ చదువులో రాణించి ఉత్తమ స్థానాలలో స్థిరపడాలని, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా కృషి చేయాలని సూచించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు విద్యతో పాటు పలు నైతిక విలువలను పట్ల అవగాహన కల్పించడం చాలా గొప్ప విషయమని, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికై నరేందర్ రెడ్డి చేస్తున్నటువంటి కృషి చాలా స్ఫూర్తిదాయకమన్నారు. విద్యా సం స్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను సాధన చేయడమే కాకుండా వాటిలో పట్టు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. మన కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేల సత్పతి మీకు గొప్ప స్ఫూర్తి, మార్గదర్శకమని ప్రశంసించారు. నేటి కాలంలో విద్యార్థులకు నైతిక విలువల చాలా అవసరమని మరియు వాటి ద్వారానే విద్యార్థులకు ఖ్యాతి వస్తుందని చెప్పారు.విద్యార్థుల ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు మన దేశ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచాయి. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడ

## సెలెక్టర్లకు సవాల్ విసురుతున్న ఇషాన్..
# గిల్‌పై వేటు పడేనా?




వచ్చే టీ20 ప్రపంచకప్ కోసం భారత స్క్వాడ్ ఎంపిక ఆసక్తి రేపుతోంది. ప్రపంచకప్ బృందంలో ఎవరు ఉంటారు? ఎవరిపై వేటు పడనుంది? అని చర్చ జోరుగా సాగుతోంది. ముఖ్యంగా.. ఫామ్‌లో లేని శుభ్‌మన్ గిల్‌ను తప్పించాలనే డిమాండ్లు వినిపిస్తున్న వేళ నేనున్నానని భరోసానిస్తున్నాడు ఇషాన్ కిషన్. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ఫైనల్లో 45 బంతుల్లోనే సెంచరీతో గర్జించిన ఈ చిచ్చరపిడుగు.. ప్రపంచకప్ స్క్వాడ్‌కు గట్టిపోటీ ఇస్తున్నాడు. దాంతో.. గిల్‌ను పక్కన పెట్టేసి ఇషాన్‌కు అవకాశమిస్తారా? అనేది ఇప్పుడు అభిమానులందరి మెదళ్లలో తిరుగుతున్న ప్రశ్న. ఇంగ్లండ్ పర్యటనతో టెస్టు కెప్టెన్సీ, ఆస్ట్రేలియా సిరీస్‌తో వన్డే పగ్గాలు చేపట్టిన శుభ్‌మన్ గిల్ టీ20ల్లో మాత్రం తేలిపోతున్నాడు. వరల్డ్ కప్ సన్నద్ధతలో ఒకటైన దక్షిణాఫ్రికాపై మూడు మ్యాచుల్లోనూ (4, 0, 28 పరుగులు) గిల్ దారుణంగా విఫలమయ్యాడు. సంజూ శాంసన్‌ను బెంచ్ మీద కూర్చోబెట్టి.. వరుసగా అవకాశాలిచ్చినా సద్వినియోగం చేసుకోలేదు. దాంతో చివరి రెండు మ్యాచ్‌లకు గిల్‌ను తప్పిస్తారనే వార్తలు వినిపించాయి. అయితే.. పాదం గాయంతో గిల్ చివరి రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. వరల్డ్‌కప్ సమీపిస్తున్నందున అతడి బదులు మరో కరిని తీసుకోవడం మంచిదని మాజీలు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఇషాన్ కిషన్ తన విధ్వంసక ఆటతో సెలెక్టర్లకు సవాల్ విసురుతున్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో వీరకొట్టుడు కొట్టిన ఇషాన్.. గురువారం ఫైనల్లో రెచ్చిపోయి 45 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. టీ20 ఫార్మాట్లో జరిగిన ఈ టోర్నీలో 517 రన్స్ బాదిన ఈ లెఫ్ట్ హ్యాండర్ నేను అసలైన టీ20 క్రికెటర్ అని చాటుకున్నాడు. గిల్ విఫలమైతున్న వేళ.. ప్రపంచకప్ కోసం నా పేరును కూడా పరిశీలించాలని సెలెక్టర్లకు చెప్పకనే చెప్పాడీ కుర్ర హిట్టర్.

**సూర్య కూడా అంతే..!**

పొట్టి క్రికెట్‌లో మిస్టర్ 360గా పేరొందిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సైతం గొప్పగా ఆడడం లేదు. సఫారీలపై మూడు మ్యాచుల్లో 12, 5, 12 పరుగులతో అందర్నీ షాక్‌కు గురి చేశాడు సూర్య. స్వదేశంలో ప్రపంచకప్ జరుగనున్నందున కీలక ఆటగాళ్లైన గిల్, సూర్య ఫామ్ అందుకోకపోవడం మేనేజ్‌మెంట్, అభిమానులను కలవరపరుస్తోంది.

## అండర్ 19 ఆసియా కప్ ఫైనల్లో
# భారత్ X పాకిస్థాన్

అండర్ 19 ఆసియా కప్ 2025 వన్డే టోర్నీలో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శ్రీలంకతో శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో సమష్టిగా రాణించిన భారత్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌ను 20 ఓవర్లకు కుదించగా. భారత కుర్రాళ్లు ఆరోన్ జార్జ్ (49 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 58 నాటౌట్), విహాన్ మల్హోత్రా (45 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 61 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీలతో భారత విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 138 పరుగులు చేసింది. కెప్టెన్ విమత్ దిన్సారా(29 బంతుల్లో 4 ఫోర్లతో 32), చమికా హీనాటిగలా(38 బంతుల్లో 3 ఫోర్లతో 42) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో హెనిల్ పటేల్, కాన్నిక్ చౌహాన్ రెండేసి వికెట్లు తీయగా.. కిషన్ సింగ్, దీపేష్ దేవంద్రన్, ఖిలాన్ పటేల్ తలో వికెట్ తీసారు.

**గెలిపించిన ఆర్సీబీ బ్యాటర్..**

అనంతరం భారత అండర్ 19 టీమ్ 18 ఓవర్లలో 2 వికెట్లకు 139 పరుగులు చేసి మరో 12 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని కైవసం చేసుకుంది. కెప్టెన్ ఆయుష్ మాత్రే(7)తో పాటు వైభవ్ సూర్యవంశీ(9) విఫలమైనా.. ఆరోన్ జార్జ్(49 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 58 నాటౌట్), విహాన్ మల్హోత్రా (45 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 61 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీలతో రాణించారు. శ్రీలంక బౌలర్లలో రసిత్ నిమ్సారా (2/31) ఒక్కడే రెండు వికెట్లు తీసాడు. ఐపీఎల్ 2026 మినీ వేలంలో విహాన్ మల్హోత్రాను ఆర్సీబీ రూ.30 లక్షలకు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే.

**ఫైనల్లో భారత్ X పాకిస్థాన్**

మరో సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌పై పాకిస్థాన్ అండర్ 19 టీమ్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 27 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 121 పరుగులకు ఆలౌటైంది. అనంతరం పాకిస్థాన్ 16.3 ఓవర్లలోనే 2 వికెట్లకు 122 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. ఆదివారం జరిగే ఫైనల్లో భారత్, పాకిస్థాన్ తలపడనున్నాయి.

## టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా..
# సంజూ, సుందర్‌కు చోటు!

సిరీస్‌లో కీలకమైన ఐదో టీ20లో భారత్ మొదట బ్యాటింగ్‌కు రెఢీ అవుతోంది. అహ్మదాబాద్‌లో బ్యాటింగ్ పిచ్‌పై దంచేసి.. దక్షిణాఫ్రికా ముందు భారీ లక్ష్యాన్ని నిర్దేశించాలని టీమిండియా అనుకుంటోంది. సిరీస్‌లో 21తో ఆధిక్యంలో ఉన్న భారత జట్టు ఈ మ్యాచ్ గెలిస్తే ట్రోఫీ పట్టేస్తుంది. ప్రత్యర్థి జట్టు ఒకవేళ ఈ మ్యాచ్‌లో సూర్యకుమార్ సేనకు షాకిస్తే సిరీస్ సమం అవుతుంది. అహ్మదాబాద్‌లో జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా కెప్టెన్ ఎడన్ మర్క్రమ్ బౌలింగ్ తీసుకున్నాడు. సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే ఈ మ్యాచ్‌లో భారత్ రెండు కీలక మార్పులు చేసింది. అనారోగ్యంతో అక్షర్ పటేల్, గాయం కారణంగా శుభ్‌మన్ గిల్ అందుబాటులో లేకపోవడంతో.. సంజూ శాంసన్, వాషింగ్టన్ సుందర్‌కు తుది జట్టులో చోటు దక్కింది. సఫారీ టీమ్ సైతం ఒక మార్పుతో బరిలోకి దిగుతోంది.

**భారత తుది జట్టు :** అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా, శివం దూబే, జితేశ్ శర్మ (వికెట్ కీపర్), వాషింగ్టన్‌సుందర్, వరుణ్ చక్రవర్తి, జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్.

**దక్షిణాఫ్రికా తుది జట్టు :** క్వింటన్ డికాక్ (వికెట్ కీపర్), రీజా హెండ్రిక్స్, ఎడెన్ మర్క్రమ్ (కెప్టెన్), డెవాల్ బ్రెవిస్, డెవిడ్ మిల్లర్, డొనొవాన్ ఫెరీరా, జార్జ్ లిండే, మార్కో యాన్సెన్, కార్బిన్ బాష్, లుంగి ఎంగిడి, ఒట్నీల్ బార్ట్మన్.

# ఫోకస్ సైన్స్

## శబ్దవేగాన్ని మించిన జెట్ స్ట్రీమ్ గాలులు!



శాస్త్రవేత్తలు ఇటీవల కనుగొన్న గ్రహంపై శబ్ద వేగాన్ని మించిన జెట్ స్ట్రీమ్ గాలులు ఉన్నట్టు గుర్తించారు. 'డబ్ల్యుఎఎస్‌పి 127బి'గా పిలిచే ఈ గ్రహం మన సౌర కుటుంబానికి బయట ఉన్న ఎక్సోప్లానెట్ (ఎక్స్ట్రా సోలార్ ప్లానెట్ లేదా మన సౌర కుటుంబం వెలుపల ఉన్న గ్రహం), భూమి నుంచి సుమారు 520 కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. శాస్త్రవేత్తలు ఈ గ్రహంలో శబ్ద వేగాన్ని మించిన గాలులు గుర్తించారు. తాజా నివేదికను అనుసరించి, ఈ గాలులు కేవలం కొన్ని గంటల్లోనే గ్రహం చుట్టూ ఒక భ్రమణాన్ని పూర్తి చేస్తున్నట్టు చెప్తున్నారు. అయితే, సహజవాయుతో నిండిన ఈ గ్రహం భూమి మాదిరి జీవానికి అనుకూలమైనని కాదు. ఇప్పటి వరకూ మరే ఇతర ఎక్సోప్లానెట్‌పైనా ఇంత వేగమైన, స్థిరమైన జెట్ స్ట్రీమ్ గాలులను శాస్త్రవేత్తలు గమనించలేదు. అందుకే డబ్ల్యుఎస్‌పి 127బి అంతరిక్ష పరిశోధనలో ఒక అరుదైన, ఆసక్తికరమైన ఆవిష్కరణగా నిలుస్తున్నది. ఈ గ్రహంపై ఉన్న జెట్ స్ట్రీమ్ గాలులు కొంత భిన్నంగా ఉన్నాయి. భూమిపై కూడా జెట్ స్ట్రీమ్‌లు ఉంటాయి, కానీ అవి విమానాల వేగం కన్నా కొంచెం ఎక్కువ వేగంతో కదులుతాయి. కానీ ఈ గ్రహంలో మాత్రం గాలుల వేగం శబ్ద వేగం (సుమారు 1,235 కి.మీ/గం) కంటే చాలా ఎక్కువగా ఉంది. ఇది భూమిలాంటిది కాదని, దీనిపై అత్యధిక మోతాదులో వాయువు ఉంటుంది కాబట్టి, దీనిని 'గ్యాస్ జెయింట్'గా పేర్కోవచ్చని శాస్త్రవేత్తలు అంటున్నారు. అక్కడ తీవ్ర ఉష్ణోగ్రతలు, బలమైన వాతావరణ తుఫాన్లు ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గ్రహాల వాతావరణం ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకోవడానికి ఈ కొత్త ఆవిష్కరణ ఉపయోగపడుతుంది. భూమికి బయట ఉన్న గ్రహాల్లో వాతావరణ పరిస్థితులు ఎంత తీవ్రమై ఉంటాయో ఇది చూపిస్తుంది. భవిష్యత్తులో జీవం ఉండే అవకాశాలపై పరిశోధనలకు ఇది దోహదపడుతుంది.



## పర్యావరణ పరిరక్షణలో శాస్త్ర విజ్ఞానం

పెరుగుతున్న సాంకేతిక ఒకవైపు అనూహ్యమైన పర్యావరణ మార్పులకు కారణమవుతుండగా, మరోవైపు పర్యావరణ పరిరక్షణకు శాస్త్రవేత్తలు నిరంతర పరిశోధనలు, అన్వేషనలు కొనసాగిస్తున్నారు. అందుకే, ఇప్పుడు వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో శాస్త్ర విజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోంది. ఈ రంగంలో ఇటీవలి ప్రయోగాలు మన భవిష్యత్తును రక్షించేవిగానూ, ఆశాజనకంగానూ ఉన్నాయి. 'కార్బన్ క్యాప్చర్' పురోగతి సాధిస్తున్నారు. వాతావరణంలోకి వెళ్లే కార్బన్ డయాక్సైడ్ ($CO_2$)ను ముందే ఒడిసిపట్టి తొలగించే సాంకేతికతను కార్బన్ క్యాప్చర్ అంటున్నారు. కొత్తగా అభివృద్ధి చేసిన కొన్ని పరికరాలు, పదార్థాలు కార్బన్ డయాక్సైడ్‌ను అత్యంత వేగంగా, ఎక్కువ పరిమాణంలో స్వీకరిస్తున్నాయి. తక్కువ ఖర్చుతో ఇవి పరిశ్రమల పొగ గొట్టాల దగ్గర నుంచే కర్బనాన్ని స్వీకరించి, గాలి నుంచి దానిని తొలగిస్తున్నాయి. ఫ్యాక్టరీలు, పవర్ ప్లాంట్లు, సిమెంటు స్టీల్ తదితర పరిశ్రమలకు దీనివల్ల గ్లోబల్ వార్మింగ్‌కు కారణమైన వాయువులు గణనీయంగా తగ్గుతాయి. కాగా, మరో పరిశోధనా ఫలితంగా శుభ్రమైన శక్తి నిల్వ ఇప్పుడు సాధ్యమవుతున్నది. పునరుత్పాదక శక్తి (సూర్య, గాలి) వినియోగానికి శక్తి నిల్వ వ్యవస్థలు అత్యంత అవసరం. కొత్త బ్యాటరీలు, సాలిడ్‌స్టేట్ బ్యాటరీలలో ఈ కొత్త పరిశోధన ఉపయోపడుతుంది. ద్రవ ఎలక్ట్రోలైట్ లేకుండా ఘన పదార్థాన్ని వాడడంతో అగ్నిప్రమాద అవకాశాలు చాలా తక్కువ. తక్కువ ఖర్చు తో, ఎక్కువ శక్తిని, దీర్ఘకాలం లేదా జీవితకాలం నిల్వ చేయవచ్చు. మిథియం కంటే చౌకగా లభించే సోడియంతో తయారుచేస్తున్న సోడియంఆయాన్ బ్యాటరీలు అందుబాటులోకి వస్తున్నాయి. వీటి ధర చాలా తక్కువ. ఇవి పర్యావరణానికి ఎంతో అనుకూలం.

## భారీగా పెరుగుతున్న సముద్ర మట్టాలు



గత 4,000 సంవత్సరాలలో ఎప్పుడూ లేనంత వేగంగా భూమి సముద్ర మట్టాలు ఇప్పుడు వేగంగా పెరుగుతున్నాయి. ఈ విషయాన్ని ఉపగ్రహాల పరిశీలనలు గుర్తించాయి. దీనిని ఒక స్పష్టమైన వాతావరణ అత్యవసర పరిస్థితిగా శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. భూమి వేడెక్కడమే ఇందుకు ప్రధాన కారణం. పరిశ్రమలు, వాహనాలు, అడవుల నాశనం వల్ల గ్రీన్‌హౌస్ వాయువులు పెరుగుతున్నాయి. హిమనదాలు కరుగుతున్నాయి. ధ్రువ ప్రాంతాల్లోని మంచు కొండలు కరిగి సముద్రాల్లోకి చేరుతున్నాయి. గ్లోబల్ వార్మింగ్ కారణంగా నీరు కూడా వేడెక్కుతుంది. వెడెక్కిన నీటికి విస్తరించే గుణం ఉంది. అందువల్ల సముద్ర మట్టం పెరుగుతోంది. గతంతో పోలిస్తే ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక సాంకేతికను వినియోగించుకొని, ఉపగ్రహాల ద్వారా సముద్ర మట్టాన్ని చాలా ఖచ్చితంగా కొలుస్తున్నారు. గత వేల ఏళ్లతో పోలిస్తే ఇప్పటి పెరుగుదల అసాధారణంగా వేగం కనిపిస్తున్నది. ఈ మార్పు వల్ల తీర ప్రాంతాలు మునిగిపోవడం, చిన్న దీవులు అంతరించిపోవడం, వరదలు, తుఫాన్లు పెరగడం, తాగునీటి కొరత, లక్షలాది మంది జీవనోపాధికి ముప్పు వంటి సమస్యలు తప్పకపోవచ్చు. భవిష్యత్తులో జరిగే పరిణామాలు అనుకుంటూ లేదా సైన్స్ మాత్రమే సమాధానం వెతకాలని పొరబడుతూ కూర్చుకుంటే ప్రమాదం తప్పదు. ఇది ఇప్పుడు ముంచుకొస్తున్న సంక్షోభం. పర్యవసానాలను ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో చూస్తున్నాం. మనం ఇప్పుడే చర్యలు తీసుకోకపోతే, భూమి సమతుల్యత తీవ్రమైన ప్రమాదంలో పడుతుంది. కాబట్టి, భూమిని కాపాడటం మన అందరి బాధ్యత.

## ఘనంగా 'సింగరేణి డే' వేడుకలు
### ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ డిమాండ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ కోరారు. శుక్రవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన ఎఐటియుసి సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో గత ఇరవై సంవత్సరాలుగా డిసెంబర్ 23న ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించే ఆవిర్భావ దినోత్సవ వేడుకలను, కుదించే విధంగా నిధులు విడుదల చేస్తూ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసిందని, దీన్ని గుర్తింపు సంఘం ఎఐటియుసి తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. సింగరేణి ఆవిర్భావ దినోత్సవం రోజున జరిగే వేడుకల్లో కార్మికులు మరియు వారి కుటుంబాలు ఆనందంగా పాల్గొంటారని, వేడుకలను కుదించే విధంగా నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. యాజమాన్యం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 23న జరిగే వేడుకలకు అధికంగా నిధులు విడుదల చేసి ఘనంగా జరపాలని ఆయన డిమాండ్ చేశారు, లేకుంటే గుర్తింపు సంఘం ఎఐటియుసి ఈ వేడుకలను బహిష్కరిస్తుందని ఆయన తెలిపారు. సమావేశంలో ఎఐటియుసి ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, నాయకులు కన్నం లక్ష్మి నారాయణ, బుర్ర భాస్కర్, ఆకుల సురేష్, పడాల కనకరాజు, జనగామ జగదీశ్వర్, సిరిసిల్ల మల్లేష్, తాని రాజబాబు, తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ మ్యూజియం ప్రారంభించాలి
### ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సైన్స్ మ్యూజియంను తక్షణమే ప్రారంభించాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎఐఎస్ఎఫ్ సమావేశం జరిగింది. సమావేశంలో ఇటికాల రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ పాత డిఇఒ కార్యాలయంలోనే సర్వశిక్షాభియాన్ గదులను సైన్స్ మ్యూజియంకు కేటాయించి ఏడాదైనా ప్రారంభోత్సవానికి ఇప్పటి వరకు నోచుకోలేదన్నారు. సైన్స్ మ్యూజియం ఏర్పాటు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసి దాతల సహకారంతో రూ.1.50 కోట్ల విరాళాలు సేకరించి సైన్స్ పరికరాలను కొనుగోలు చేశారని ఆయన తెలిపారు. ఎంతో విలువైన ఫిజిక్స్, బయాలజీ, సైన్స్ పరికరాలను కొనుగోలు చేసి సైన్స్ మ్యూజియంలో ఉంచారన్నారు. ఏడాది కాలంగా ఈ మ్యూజియంను ప్రారంభించకుండా గదులకు తాళాలు వేశారని ఆరోపించారు. అధికారులు మారుతున్నారే తప్ప సైన్స్ మ్యూజియం ప్రారంభించడంలో చొరవ చూపడం లేదన్నారు. ఇప్పటికైనా సైన్స్ మ్యూజియంను ప్రారంభించి విద్యార్థులు తిలకించే విధంగా సిద్ధం చేయాలన్నారు. సైన్స్ మ్యూజియం, ప్లాంటోరియం కోసం ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించి ప్రయోగాత్మక పద్దతిలో సైన్స్ పరిజ్ఞానం వికసిల్లేలా ప్రత్యేక భవన సముదాయాన్ని నిర్మించాలని ఎఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి కోరుతుందన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ నాగులమీరా, జిల్లా నాయకులు గోపి, పవన్, యుగంధర్, నరేష్, వెంకట్ పాల్గొన్నారు.

# 'ఉపాధి' పథకం రద్దుకు బిజెపి కుట్ర

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/జనగామ :** కమ్యూనిస్టుల సహకారంతో యుపిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి కోట్లాది మంది కూలీల పొట్టగొట్టేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు మండిపడ్డారు. డిసెంబర్ 26తో సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా గ్రామ గ్రామాన శత వార్షికోత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సిపిఐ జనగామ జిల్లా విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం శుక్రవారం జనగామలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో బోనగిరి కుమారస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి తక్కెలపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. ఉపాధి హామీ పథకం చారిత్రాత్మకమైందని, కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే ఈ చట్టం వచ్చిందన్నారు. బిజెపి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే గాంధీ పేరును తొలగించాలని చూస్తుందన్నారు. చట్టం మార్పు గాంధీజీ పట్ల ఆ పార్టీకి ఉన్న గౌరవాన్ని బహిర్గతం చేస్తుందని, ఇది లోతైన ఫాసిస్టు సైద్ధాంతిక చర్యగా చెప్పవచ్చునన్నారు. బిజెపి దాని సైద్ధాంతిక మార్గదర్శకాలు చెప్పాలంటే నిజంగా గాడ్సే యొక్క నిజమైన శిష్యులని చెప్పవచ్చునన్నారు. బిజెపి తీసుకొచ్చిన ఈ నూతన చట్టం వలన ఇది ప్రస్ఫుటం అవుతుందన్నారు. వంద రోజుల పని కల్పించాలని ఈ చట్టంలో ఉందని, ప్రభుత్వం ఈ చట్టానిక తూట్లు పొడిచి 125 రోజులు పని కల్పిస్తామని, అది ప్రభుత్వ ఇష్టానుసారంగా సాగుతుందని 60 రోజులు హాలిడేగా ప్రకటించి ఉపాధి కూలీలను పనులకు దూరం చేసే కుట్రలను చేస్తుందన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా 10 శాతం ఉండగా కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు ఇచ్చి ఈ పథకం కొనసాగించాలని చట్టం చేసిందని, ఆ చట్టాన్ని నేడు 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరించాలని చట్టంలో మార్పులు చేశారన్నారు. ఇప్పటికే ఉపాధి హామీ కూలీలు పనులు చేసి కూలీ డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర నిధులు మొత్తం కేంద్రం కాజేసి రాష్ట్రంపై భారం మోపి ఈ చట్టాన్ని నిర్వేదం చేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా కోట్లాది మంది కూలీలు పనులుచేస్తూ పనులు లేని కాలంలో కూలీలకు ప్రభుత్వం పనులు కల్పించి కూలీలకు తిండి పెట్టే ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే మహాత్మా గాంధీ పేరుతో ఉన్న చట్టాన్ని పేర్లు మార్చి వికాసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజానిక మిషన్ గ్రామీణ్ కుప్తంగా జి రామ్‌జీ పేరుతో పూర్తి ఉపాధి హామీ పథకం లేకుండా చేయడం కోసం కుట్ర సాగిస్తుందన్నారు.ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవడానిక ఉపాధి హామి కూలీలు పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

**సిపిఐ శత వార్షికోత్సవాలను విజయవంతం చేయాలి : రాజారెడ్డి**

డిసెంబర్ 26కు సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి కావస్తున్న సందర్భంగా జిల్లాలోని అన్ని గ్రామాల్లో వంద సంవత్సరాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పార్టీ నాయకులు రాజారెడ్డి పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఆకుల శ్రీనివాస్, ఆది సాయన్న, రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు కావటి యాదగిరి, రావుల సదానందం, చొప్పరి సోమయ్య, జువారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారంలో ఉక్కు పరిశ్రమ



### సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయ సారథి డిమాండ్

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ మహబూబాబాద్ నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం స్థానిక వీరభవన్ సిపిఐ జిల్లా కార్యాలయంలో కట్లోజు పాండురంగా చారి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి విజయసారథి ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడారు. ఉమ్మడి విభజన చట్టం 2014 లో ఉన్న బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు బిజెపి కేంద్రప్రభుత్వం స్పందించాలన్నారు. ఈ ప్రాంతంలో నాడు బయ్యారం ఉక్కు పరిశ్రమ కోసం సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమించామని, నేడు రైల్వే పరిశ్రమ కోసం దశలవారీగా ఉద్యమిస్తామని, అది సాధించేవరకు పోరాటం ఆగద ని విజయసారథి స్పష్టం చేశారు. సమావేశంలో ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన సిపిఐ వార్డు మెంబర్లను సన్మానించారు. వందసంవత్సరాల చరిత్ర గల సిపిఐ అనునిత్యం ప్రజల కోసం ఉద్యమిస్తుందన్నారు. కార్మికుల కోసం, రైతుల కోసం, విద్యార్థుల కోసం, ఉద్యోగస్తుల కోసం, వ్యాపారవర్గాల కోసం అనునిత్యం ఉద్యమిస్తున్న సిపిఐకి రాబోయే మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలని జిల్లా ప్రజలను కోరారు. సిపిఐ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి రాబోయే ఎన్నికల్లో సత్తా చూపాలని పిలుపునిచ్చారు. నిత్యం ప్రజాసమస్యలపై చేస్తున్న ఉద్యమాలను ప్రజలకు వివరిస్తూ జిల్లా సమగ్రాభివృద్ధిలో సిపిఐ పోషిస్తున్న పాత్రను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో కంటే ఈసారి మహబూబాబాద్ మున్సిపాలిటీలో ఎక్కువ స్థానాలు పోటీచేసేలా సిద్ధం కావాలన్నారు. సమావేశంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి.అజయ్‌సారధిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి , తండా సందీప్, చొప్పరి శేఖర్, బైసా స్వామి, బానోత్ లింగ్య నాయక్, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, ఎండి ఫాతిమా, మేక వీరన్న, జలగం ప్రవీణ్, ఆబోతు అశోక్, కేదాసు రమేష్ ,వంకాయలపాటి చిరంజీవి, తూటి వెంకటరెడ్డి, చిర సత్యానారాయణ, మంద భాస్కర్, కమటం ఉపేందర్, గెలిచినవార్డు మెంబర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## భావితరాలకు ఆదర్శ కమ్యూనిస్టుల
# పోరాట చరిత్ర తెలియాలి

### సిపిఐ నేతలు బాగం హేమంతరావు, దండి సురేష్

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** భావితరాలకు ఆదర్శ కమ్యూనిస్టుల పోరాట చరిత్ర తెలియాల్సిన అవసరం ఉందని, కేవలం కమ్యూనిస్టులే పేదల కోసం పోరాటం చేసి వారి హక్కులను కాపాడారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. శుక్రవారం రావూరి బుచ్చిరామయ్య, ఆళ్ళ సీతారామయ్య, మద్దినేని వీరభద్రం వర్ధంతి కార్యక్రమాలకు వారు హాజరై చిత్రపటాలకు పూలమాలలు వేసి పార్టీ జెండాను ఆవిష్కరించి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కమ్యూనిస్టులే పేద ప్రజల కోసం పోరాడి వారి హక్కులను కాపాడారన్నారు. ఆదర్శ కమ్యూనిస్టుల పోరాట చరిత్ర భావితరాలకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలో బిజెపి మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందని, బడా పారిశ్రామిక వ్యక్తులను దేశ సంపద దోచి పెడుతుందన్నారు. అతి ముఖ్యమైన ప్రభుత్వం రంగం సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి కార్మికులను మోసం చేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకుండా ఇబ్బందులు గురి చేస్తుందని రైతులు యూరియా సరైన సమయానికి అందించకుండా ఎన్నో ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో బిజెపి ప్రభుత్వానికి తగినబుద్ధి ప్రజలే చెప్తారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శివర్గ సభ్యులు రాష్ట్ర రైతు సంఘం నాయకులు మహమ్మద్ మౌలానా, మండల కార్యదర్శి చీమ రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు తాటికొండ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.






# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## ఏజెన్సీ వైద్యసేవలు స్ఫూర్తిదాయకం
### వైద్యులకు మంత్రి దామోదర ప్రశంసలు



**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మారుమూల ఏజెన్సీ ప్రాంతాలతో ప్రభుత్వం వైద్యం రోగులకు అందిస్తున్న తీరు ప్రశంసనీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. భద్రాచలం ఏజెన్సీలోని ఆస్పత్రి సిబ్బందితో పాటు డిసిహెచ్ఎస్ డా. రవిబాబు ను హైదరాబాద్ సచివాలయంలోని తన ఛాంబర్‌కు పిలిపించుకున్న ఆయన టివివిపి ఆస్పత్రుల సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రశంసించి ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిష్టి యానాతో కలిసి జ్ఞాపికను అందించారు. అంకిత భావంతో పనిచేసే వైద్యులను రోగులు చిరకాలం గుర్తుంచుకుంటారని మంత్రి చెప్పారు.

## ఉపాధిహామీ పథకానికి కూలీలను దూరం చేస్తున్న బిజెపి ప్రభుత్వం
### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** కమ్యూనిస్టు పార్టీల సహకారంతో యుపిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి కూలీల పొట్ట కొట్టేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ ఆరోపించారు. మండల పరిదిలోని తుమ్మలనగర్‌లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వ్యవసాయ కూలీలతో కలిసి పని ప్రదేశంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క చట్టానికి తూట్లు పొడిచి పని గ్యారంటీ పథకాన్ని తీసినేసి, కూలీలను ఉపాధిహామీ పనికి దూరం చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పని అడిగిన 15 రోజుల్లో పని ఇవ్వాలని, గ్యారంటీగా వంద రోజులు పని కల్పించాలనే చట్టం ఉందని, ఆ చట్టానికి తూట్లు పొడిచి నేటి బిజెపి ప్రభుత్వం 125రోజులు పనులు కల్పిస్తామని అది ప్రభుత్వం ఇష్టానుసారం సాగుతుందని 60 రోజు హాలిడే గా ప్రకటించి ఉపాధి కూలీలను పనులకు దూరం చేసే కుట్రలకు తెరలేపిందన్నారు. ఈ కుట్రను తిప్పికొడుతూ సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలతో పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని దండు ఆదినారాయణ తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవడానికి ఉపాధి హామీ కూలీలు పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు
### ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్



**ప్రజాపక్షం/జూలూరుపాడు :** పార్టీలకతీతంగా నూతనంగా విజయం సాధించిన సర్పంచులు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయాలని వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాళోత్ రాందాస్ నాయక్ కోరారు. వైరా నియోజకవర్గ పరిధిలోని జూలూరుపాడు మండలంలో మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ మద్ధతుతో గెలుపొందిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు మండల కేంద్రంలోని యల్లంకి గార్డెన్ శుక్రవారం ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు ఎమ్మెల్యే అభినందించి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ మండల ప్రజలు మనపై విశ్వాసంతో ఓట్లు వేసి గెలిపించారని, పార్టీలను పక్కన పెట్టి, అందరిని కలుపుకొని పోవాలని సూచించారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పని చేస్తూ వారి విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని భరోసా కల్పించారు. అనంతరం స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచిన కొందరు సర్పంచ్లు మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల సమష్టి కృషితో విజయం
### పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/అశ్వాపురం :** అశ్వాపురం మండలంలో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచులను పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు శుక్రవారం శాలువాలు కప్పి స్వీట్లు తినిపించి ఘనంగా సన్మానించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య అధ్యక్షతన జరిగిన అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో సర్పంచులగా, ఉపసర్పంచులుగా, వార్డు సభ్యులుగా గెలిపించిన ప్రజలకు విశ్వసనీయతతో పని చేసి గ్రామ సమస్యల పట్ల శ్రమించాలని ఈసందర్భంగా ప్రజాప్రతినిధులకు హితవు పలికారు. ఎన్నికలు గెలుపు కోసం పని చేసిన కార్యకర్తల శ్రమని గుర్తిస్తూ ఇది కార్యకర్తల విజయమని, కార్యకర్తల శ్రమతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలే మన అభ్యర్థులను గెలిపించాయని ఇది ఏ ఒక్కరి విజయం కాదని కార్యకర్తల సమష్టి విజయం అని ఈసందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్‌బాబు, బూరెడ్డి వెంకటరెడ్డి, గాదె వెంకటరెడ్డి, బట్టా సత్యనారాయణ, బచ్చు వెంకటరమణ, నూతన సర్పంచులు, ఇర్పా కవిత, కలివేటి సరిత, జిమ్మా ఝాన్సీ, కోర్సా కృష్ణ, ఎనిక ఉషారాణి, భూరెడ్డి స్వాతి, తెల్లం నాగమణి, మచ్చా నరసింహారావు, ఎట్టి నరేష్, బానోత్ సదర్‌లాల్, సబ్కా పిచ్చయ్య, కుంజా జాను, పోడియం పవన్, యెట్టి నరేష్, కొండ్రు అంజమ్మ, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీలో భారీ కోతలు
### సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పేరు మార్పుతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్ర ప్రభుత్వం యత్నిస్తుందని దీనిని నిరసిస్తూ ఈనెల 22న కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ శుక్రవారం ఒ ప్రకటనలో తెలిపారు. అనేక దశాబ్దాల పాటు పోరాడి జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సాధించుకున్నామని బిజెపి ఇప్పుడు పేరు మార్చి పథకాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. ఇప్పటికే పని దినాలను తగ్గించిందని దినసరి వేతనంలో భారీగా కోతలు పెట్టడంతో పాటు రక రకాల కొర్రీలు పెడుతూ గ్రామీణ ప్రాంత పేద ప్రజలను బిజెపి ఇబ్బందులకు గురి చేసిందన్నారు. రానున్న కాలంలో అసలు పథకాన్ని రద్దు చేసే ప్రమాదం ఉందన్నారు. దీనిని నిరసిస్తూ ఈనెల 22న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నా విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# ఖమ్మంలో శరవేగంగా అభివృద్ధి పనులు

### జూన్ నాటికి సీతారామ ద్వారా సాగునీరు
### మంచుకొండ ఎత్తిపోతల పథకం విస్తరణ
### అమరావతి తరహాలో టిటిడి ఆలయం
### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం నగర సమగ్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలను శరవేగంగా పూర్తి చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం నగరంలో ప్రస్తుతం చేపట్టిన పనులన్నీ నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. భారీవర్షాల కారణంగా ఖిల్లా రోప్‌వే పనులు రెండు మాసాలు ఆలస్యమయ్యాయని శాశ్వత నిర్మాణం కావడంతో నాణ్యత ప్రమాణాలతో నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. సర్దార్ పటేల్ మైదానంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణం రెండు నెలల్లో పూర్తవుతుందన్నారు. అండర్ డ్రైనేజీ పనులు పురోగతిలో ఉన్నాయని చెరువుల నుంచి వచ్చే వరద నగరంలోకి రాకుండా నేరుగా మున్నేరులోకి చేరేవిధంగా పైపులైన్ నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. క్రికెట్ స్టేడియం నిర్మాణానికి 20 ఎకరాలు కేటాయించామని అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ అథారిటీ ద్వారా స్టేడియం నిర్మాణం జరుగుతుందన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్, మెడికల్ కళాశాల, హాస్టల్స్ నిర్మాణాలను త్వరలో పూర్తి చేయనున్నామన్నారు. మున్నేరుపై నిర్మాణం జరుగుతున్న కేబుల్ బ్రిడ్జి ఖమ్మంకు తలమానికం కానుందని వాస్తవానికి మార్చి నాటికి పూర్తి కావాల్సి ఉండగా అధిక వర్షాల కారణంగా రెండు నెలలు ఆలస్యమైందని జూన్ నాటికి కేబుల్ బ్రిడ్జి పూర్తవుతుందని తుమ్మల తెలిపారు. దశల వారీగా మున్నేరు వరద రక్షిత గోడలను పూర్తి చేస్తామని ఇప్పటికే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమీక్షించడం జరిగిందన్నారు. హరిత హోటల్ నిర్మాణంతో పాటు అమరావతిలో నిర్మించే టిటిడి దేవాలయ నిర్మాణ రీతిలో ఖమ్మంలో కూడా ఆలయాన్ని నిర్మించనున్నామని ఇప్పటికే 17.5 ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరిగిందని మరో రెండున్నర ఎకరాల భూమిని త్వరలో కేటాయిస్తామన్నారు. ఖమ్మంకు స్వామి నారాయణ్ గురుకుల విద్యాలయం రావడం అభినందనీయమని స్థలం కేటాయించడంతో స్వామి నారాయణ్ విద్యాలయం పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఖమ్మంలో హైదరాబాద్ శిల్పారామం తరహాలో నిర్మాణం చేసేందుకు లకారం ట్యాంక్ బండ్ సమీపంలో భూమి కేటాయించినట్లు ఆయన తెలిపారు.

**జూన్ నాటికి సాగునీరు :** సీతారామ ప్రాజెక్టు ద్వారా జూన్ నాటికి సాగునీటిని అందించనున్నట్లు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రధాన కాలువల నిర్మాణానికే అంచనాలు వేశారని ఇప్పుడు డిస్టిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. జూలూరుపాడు, పాలేరు టన్నెల్‌ను పూర్తి చేసి సాగునీటిని అందిస్తామని పినపాక, కొత్తగూడెం, అశ్వారావుపేట, వైరా నియోజక వర్గాల్లో 25 వేల ఎకరాలకు జూన్ నాటికి నీరందించేవిధంగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. భూసేకరణ సమస్య కూడా పూర్తయిందన్నారు. సీతమ్మ సాగర్‌కు సిడబ్ల్యూసి అనుమతి వచ్చిందని మరి కొన్ని అనుమతులు రావాల్సి ఉందన్నారు. మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని మరింత విస్తరించనున్నామని ఇందుకు గతంలో 23 చెరువులు నింపేందుకు మాత్రమే ప్రణాళికలు రూపొందించగా ఇప్పుడు అదనంగా మరో 17 చెరువులు నింపేందుకు పనులు చేపట్టామని ఉగాది నాటికి పనులు పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల స్థలాల సమస్యకు త్వరలో పరిష్కారం
### ముఖ్యమంత్రి వద్దకు జర్నలిస్టు ప్రతినిధి బృందం



జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గతంలో జర్నలిస్టులకు కేటాయించిన ఇండ్ల స్థలాలకు సంబంధించి జర్నలిస్టులు శుక్రవారం కలెక్టరేట్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి సమస్యను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ జర్నలిస్టుల ఇండ్లస్థలాల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. త్వరలోనే ఒక ప్రతినిధి బృందాన్ని ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. టియుడబ్ల్యుజె (ఐజెయు) ప్రతినిధి బృందంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు నర్వనేని వెంకట్రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, జర్నలిస్టు హౌజింగ్ సొసైటి అధ్యక్ష, కార్యదర్శులు కనకం సైదులు, బొల్లం శ్రీనివాస్‌తో పాటు జర్నలిస్టులు వనం వెంకటేశ్వర్లు, భూపాల్, మహేందర్, శ్రీనివాస్, రామారావు, గోపాల్ తదితరులు ఉన్నారు.

## విపత్తుల నిర్వహణకు కార్యాచరణ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జాతీయ విపత్తుల నివారణకు కార్యాచరణ రూపొందించుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులకు సూచించారు. వరదలు, పారిశ్రామిక ప్రమాదాల నివారణ పై అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు శుక్రవారం జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య పాల్గొన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ సూచనలు, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వరదలు, పరిశ్రమ భారీ ప్రమాదాల సమయంలో అధికార యంత్రాంగం స్పందించాల్సిన తీరుపై మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించేలా కార్యాచరణ తయారు చేయాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎ. పద్మశ్రీ, జెడ్‌పి సిఇఒ దీక్షారైనా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అప్రమత్తతతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట
### అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సాంకేతికత అభివృద్ధి చెందుతున్న నేటి రోజుల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరాలకు అడ్డుకట్ట పెట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సైబర్ క్రైమ్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ నందు అధికారులు, సిబ్బందికి సైబర్ క్రైమ్ నియంత్రణపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్ జరగకుండా ఉండేందుకు సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పెరుగుతున్న సాంకేతికతతో నేరాల ప్రవృత్తి మారుతుందని, ప్రతిఒక్కరికి సాంకేతికత అందుబాటులోకి రావడం వల్ల కొంత మంది వాటిని దుర్వినియోగం చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఫోన్ వాడకంలో అప్రమత్తంగా ఉండాలని, బహుమతులు గెలిచారు, రుణం మంజూరైంది. డిస్కౌంట్, వ్యాపారాల రిటర్న్, ప్లాట్‌ల విక్రయం మొదలగు వైవిధ్యమైన కారణాలతో పంపే ఎటువంటి లింకులను క్లిక్ చేయవద్దని కలెక్టర్ సూచించారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామంటూ కాల్ చేసే మోసగాళ్లకు ఎట్టి పరిస్థితుల్లో వ్యక్తిగత వివరాలు, ఒటిపి తెలియజేయరాదన్నారు. సైబర్ నేరాల్లో అధికంగా బాగా చదువుకున్న వారు చిక్కుకుంటున్నారని, ఆన్‌లైన్ గేమింగ్‌లో చాలా మంది డబ్బులు పెట్టి మోసపోతున్నారని కలెక్టర్ తెలిపారు. షాపింగ్ చేసే సమయంలో ఫోన్ నెంబర్, ఆధార్ నెంబర్, వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వవద్దని కలెక్టర్ సూచించారు. నేటి పరిస్థితులలో అధికంగా బ్యాంకుకు వెళ్లే అవసరం ఉండటం లేదని ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలు ఫోన్‌లో ఉన్నప్పుడు మనం అప్రమత్తంగా ఉండాలని అనవసరంగా ఫోన్ వివరాలు ఇవ్వవద్దన్నారు. ముఖ్యమైన పాస్‌వర్డ్‌లను రెగ్యులర్‌గా మారుస్తుండాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, చుట్టుపక్కల ప్రజలకు సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఉద్యోగులతో కలెక్టర్ సైబర్ క్రైమ్ నియంత్రణకు సంబంధించి ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో సైబర్ క్రైమ్ అడిషనల్ ఎస్‌పి జి.భిక్షంరెడ్డి, డిఎస్‌పి సిహెచ్‌ఆర్‌వి ఫణీందర్, సిఐ కె.నరేష్, డిఆర్‌వో ఎ.పద్మశ్రీ, జిల్లా అధికారులు, కలెక్టరేట్‌లోని వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులు, ఆదివాసీలను నిర్లక్ష్యం చేస్తున్న పాలకులు
### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గిరిజనులు, ఆదివాసీలను పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని, వారిని మభ్యపెట్టి రేవంత్‌రెడ్డి, భట్టి, సీతక్క అధికారంలోనికి వచ్చారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా ఆమె శుక్రవారం భద్రాచలంలో పర్యటించారు. ముందుగా సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తెలంగాణ టూరిజంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రేవంత్ ప్రభుత్వం గిరిజనాభివృద్ధి కోసం ఏ మేరకు ఖర్చు చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గడిచిన ముప్పై ఏళ్లుగా గిరిజన కార్పోరేషన్లో నియామకాలే లేవని మండిపడ్డారు. రోడ్డున పడ్డ గొత్తికోయలు, గిరిజనులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, లేదంటే రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు కొత్తగూడెంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కోసం కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రాలో విలీనం చేసిన ఐదు గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణాకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందు కోసం కేంద్రంలోని బిజెపి, ఎపిలోని తెలుగు దేశం కూటమి ప్రభుత్వం సహకరించాలని కోరారు. బొగ్గు గనులను ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని, దీనిని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమన్నారు. సింగరేణి కార్మికుల సమస్యల కోసం జాగృతి నిరంతర పోరాటాలు చేస్తుందని చెప్పారు. భద్రాచలం రామాలయాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారని, అభివృద్ధి నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జనంబాటలో భాగంగా ఇప్పటి వరకు 13 జిల్లాలో పర్యటన సాగిందని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 14వ జిల్లా అని ఈ సందర్భంగా కవిత వెల్లడించారు.

## గర్ల్స్ హాస్టల్‌పై కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మంలో బిఈడి, పిజి కళాశాలకు గర్ల్స్ హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరుతూ పిడిఎస్‌యు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు ఖమ్మం జిల్లా అధ్యక్షులు జి. మస్తాన్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలోని పిజి కళాశాల, బిఈడి కళాశాలలో విద్యను అభ్యసించే విద్యార్థినీలకు హాస్టల్ వసతి లేకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నారన్నారు. వివిధ ప్రాంతాలలో హాస్టల్‌లో ఉండి కళాశాలకు వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పిజి, బిఈడి కళాశాలలో సుమారు 100 మంది విద్యార్థినీలు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. వివిధ ప్రాంతాలలో ఉంటూ కళాశాలకు వచ్చేందుకు బస్సులు దొరక్క రోడ్ల వెంట నడుచుకుంటూ వచ్చే క్రమంలో పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థినీలకు ఇబ్బందులు లేకుండా పిజి కళాశాలలోనే లేడీస్ హాస్టల్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గాంధీ, డివిజన్ కార్యదర్శి రాము, ఉపాధ్యక్షులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటేయలేదని ధాన్యాన్ని తడిపిన నాయకుడు..!




### 60 బస్తాలు నీళ్ల పాలు
### పోలీసులను ఆశ్రయించిన రైతు

**ప్రజాపక్షం/జూలూరుపాడు :** జూలూరుపాడు మండలం గాంధీనగర్ పంచాయతీలోని గంగారం తండా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థికి ఓటు వేయలేదని వరి ధాన్యం ఆరబోసిన కల్లానికి నీళ్లు పెట్టి రైతుకు భారీ నష్టాన్ని మిగిల్చాడు కాంగ్రెస్ పార్టీ నాయకుడు. ఈ సంఘటన గురువారం రాత్రి మండలంలో జరిగింది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగారం తండా గ్రామానికి చెందిన కొర్రా చిన్న రాములు రెండు ఎకరాల పొలంలో వరి పంటను సాగు చేశాడు. పంట కోసి పొలంలో కల్లం చేసి సుమారు 60 బస్తాల ధాన్యాన్ని ఆరబెట్టాడు. ఈ క్రమంలో పంచాయతీ ఎన్నికలు జరగడంతో అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని చిన్న రాములును ఆదేశించాడు. 3 ఓట్ల మెజార్టీతో అధికార పార్టీ అభ్యర్థి విజయం సాధించాడు. అయినా తాను బలపరిచిన అభ్యర్థికి ఓటు వేయలేదని అధికార పార్టీ నాయకుడు కోపంతో పొలంలో ఆరబెట్టిన వడ్లపై కరెంట్ మోటర్‌తో సుమారు 60 బస్తాల ఒడ్లు తడిపాడు. వీటి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని రైతు వాపోయాడు. ధాన్యాన్ని తిరగబోద్దామని వెళ్లి చూడగా ధాన్యంలో మొత్తం నీరు పట్టి ఉందని తెలిపాడు. దీంతో రైతు కేకలు వేస్తూ చుట్టుపక్కల ఉన్న వాళ్లని పిలిచి ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేసినప్పటికి పూర్తిగా తడిసిపోవడంతో ధాన్యం రంగు మారింది. చుట్టుపక్కలవారు వచ్చి ఆ నీళ్లు ఆపే ప్రయత్నం చేశారు. అయినా సుమారు 60 బస్తాల వడ్లు తడిసింది. దీంతో రైతు గ్రామంలోని రోడ్డుపై ఒధాన్యాన్ని పోసి నిరసన వ్యక్తం చేశాడు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకుని తడిసిన వడ్లు పరిశీలించారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

## నేటి నుంచి భద్రాచలంలో ముక్కోటి ఉత్సవాలు

### ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయాధికారులు
### 29న తెప్పోత్సవం, 30న ఉత్తర ద్వార దర్శనం
### భక్తులకు సకల సౌకర్యాలు



**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీ సీతారామ చంద్ర స్వామివారి ఆలయంలో నేటి నుండి ముక్కోటి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందు కోసం ఆలయాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 2026 జనవరి 12వరకు అధ్యయనోత్సవాలు, 16న విశ్వరూప సేవ జరగనుంది. ఈనెల 20 నుండి 29 వరకు పగల్‌పత్తు, 30 నుండి జనవరి 12 వరకు రావత్తు ఉత్సవాలు జరగనున్నాయి. అదే విధంగా 29వ గోదావరి తీరంలో స్వామివారి విహారం జరగనుంది. దీనిని తెప్పోత్సవం అంటారు. ఇందు కోసం హంస వాహనాన్ని సిద్ధం చేస్తున్నారు. అదే విధంగా 30వ తేదిన స్వామివారు ఉత్తర ద్వారం నుండి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ముక్కోటి దేవతలు ఒక్కటై ఉత్తర ద్వారంలో ఈనెల 30న స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాల నుండి తరలివచ్చే భక్తుల కోసం అలయం తరుపున ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామివారు ఈ నెల 20న మత్స్యావతారం, 21న కూర్మావతారం, 22న వరహావతారం, 23న నర్సింహావతారం, 24న వామనావతారం, 25న పరుశురామావతం, 26 శ్రీరామావతారం, 27న బలరామావతారం, 28న శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా భక్తుల కోసం సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు.

# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్



## కార్యాలయాల్లో తెలుగు గాలికి కూడా చోటు లేదా?

ప్రజాపక్షం/నెక్కొండ: తెలుగు రాష్ట్రాల్లో ప్రతి ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయంలో తెలుగు భాషకు గౌరవం కల్పించాలన్న డిమాండ్ ఎప్పటి నుండో వినిపిస్తోంది. తమిళనాడు తరహాలో ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల్లో పూర్తి స్థాయిలో మాతృభాషనే అమలు చేయాలని ప్రజలు కోరుతున్న తరుణంలో, వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని ఎస్‌బిఐ బ్యాంక్‌లో చోటు చేసుకున్న ఘటనలు తీవ్ర విమర్శలకు దారి తీస్తున్నాయి. బ్యాంక్ బోర్డుపై శెలవు అని రాసిని వాక్యాల్లో వ్యాకరణ తప్పులు, అస్పష్టమైన పదాలు దర్శనమిస్తున్నాయి. దీనివలన బ్యాంక్ పనిచేస్తుందా? లేదా? అన్న విషయంపై ఖాతాదారులు అయోమయానికి గురవుతున్నారు. తెలుగు రాష్ట్రంలో ఉండి కూడా తెలుగు భాషను నిర్లక్ష్యం చేయడం సరికాదని, ఇది భాషాపరమైన అవమానమే కాక ప్రజలపై బాధ్యతారాహిత్యంగా కనిపిస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం బ్యాంకు నోటీసులు, బోర్డులు, దరఖాస్తులు సరైన తెలుగులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## విద్యా సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/భూపాలపల్లి : ఈనెల 21న హైదరాబాదులోని నాగోల్‌లో నిర్వహించనున్న విద్య సదస్సును విజయవంతం చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారి ఎం రాజేందర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా శాఖ 80 వసంతాల అభ్యుదయోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి పోస్టర్ ఆవిష్కరించారు.సంఘం నాయకులు 80 వసంతల అభ్యుదయ ఉత్సవానికి ఆహ్వానం పత్రిక జిల్లా విద్యాధికారి కి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ, విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు,రాబోయే పదవ తరగతి పరీక్షలలో మెరుగైన ఫలితాలు వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పెండెం మధుసూదన్,కూచనపల్లి రవీందర్ మాట్లాడుతూ నాటి ఏ పి టి ఎఫ్ లేదని టిఆర్టిఎఫ్ గా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ శాశ్వత సంఘంగా పునర్నిర్మానం చెందిందని,సంఘం ఏర్పాటై 80 సంవత్సరాలు జరుగుతున్న సందర్భంగా హైదరాబాద్ లో నాగోల్ లో డిసెంబర్ 21న విద్యా సదస్సు నిర్వహించబోతున్నామని, ఈ 80 వసంతాల అభ్యుదయోత్సవానికి ఉపాధ్యాయులు మేధావులు అందరూ హాజరుకావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నలుమాసుల రఘు కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు డెంగ్యూ రాజు, రేపాల వేణుగోపాల్ తదితర ఉపాధ్యాయ సోదరలు పాల్గొన్నారు.

## యాదాద్రి లక్ష్మీ నరసింహా స్వామి కల్యాణ మహోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/భూపాలపల్లి: ధర్మ ప్రచారంలో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న సందర్భంగా మొట్టమొదటిసారిగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు విచ్చేసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ధర్మ ప్రచార రథానికి ఐ.డి.ఓ.సి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్వాగతం పలికి శ్రీ యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. రథం ముందు కొబ్బరికాయ కొట్టి ధర్మ ప్రచారాన్ని ప్రారంభించారు. శనివారం జిల్లా కేంద్రం లోని సుభాష్ కాలనీ రామాలయంలో నిర్వహించే శ్రీ యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధర్మ ప్రచారంలో భాగంగా శ్రీ యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామి రథం మొట్ట మొదటి సారి భూపాలపల్లి జిల్లాకు రావడం చాలా సంతోషమైన విషయం అని ధర్మ ప్రచారం ద్వారా ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీవో రవి, కార్యాలయ ఏ.వో మురళీధర్ రావు, సింగరేణి జిఎం రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాలువలోకి దూకి వ్యక్తి ఆత్మహత్య



ప్రజాపక్షం/భూపాలపల్లి : దేవాదుల కాలువలోకి దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన భూపాలపల్లి మండలంలోని గొల్ల బుద్ధారం లో చోటు చేసుకుంది. సిఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్ల బుద్ధారం గ్రామానికి చెందిన సలేంద్ర శ్రీదేవి (54) తన కుమారుడు సలేంద్ర సృకేష్ (23 సం॥) నిత్యం మద్యం సేవిస్తూ కుటుంబంలో తరచుగా గొడవలకు పాల్పడుతూ ఉండేవాడని, ఈ క్రమములో గురువారం ఇంట్లో జరిగిన వాగ్వాదం అనంతరం ఇంకోసారి ఇంటికి రాను అంటూ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయిన సలేంద్ర సృకేష్ సుమారు 5.30 గంటల సమయంలో దేవాదుల కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు అతని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.ఈ విషయమై సమాచారం అందుకున్న తక్షణమే సంఘటన స్థలానికి చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించగా ఇది ఆత్మహత్యగా నిర్ధారించినట్లు తెలిపారు. మృతుడి మరణంపై దరఖాస్తు లో పాటు కుటుంబ సభ్యులకు ఎలాంటి అనుమానాలు లేవని స్పష్టం చేశారు. ఈ సంఘటనకు సంబంధించి ఎవరి మీద అనుమానాలు లేవని తెలిపారు. కేసు విషయంలో అన్ని కోణాలలో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## 23న రెడ్‌క్రాస్ హనుమకొండ జిల్లా సర్వ సభ్య సమావేశం

ప్రజాపక్షం/హనుమకొండ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ జిల్లా పాలకవర్గ సమావేశం శుక్రవారం రెడ్ క్రాస్ భవన్‌లో నిర్వహించబడింది. ఈ సమావేశంలో ఈ నెల 23న (మంగళవారం) నిర్వహించనున్న సర్వ సభ్య సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లు, కార్యక్రమ నిర్వహణ విధానంపై విస్తృతంగా చర్చించారు.అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టర్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు స్నేహ శబరీష్ ను కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 23న ఉదయం 10:00 గంటలకు, సుబేదారిలోని సమీకృత కార్యాలయ భవనం (కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్) లో నిర్వహించనున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా సర్వ సభ్య సమావేశానికి సంబంధించిన బుక్‌లెట్‌ను కలెక్టర్ కు అందజేశారు. అదేవిధంగా, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం 30 మంది టిబి (క్షయ) వ్యాధిగ్రస్తులకు ఉచిత న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కిట్లలో పౌష్టికాహార పదార్థాలు, కోడిగుడ్లు, నిత్యావసర సరుకులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా డిఎంహెచ్వో ఎ. అప్పయ్య , రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు స్వయంగా లబ్ధిదారులకు కిట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి (చైర్మన్), పెద్ది వెంకట నారాయణ గౌడ్ (వైస్ చైర్మన్), బొమ్మినేని పాపి రెడ్డి (కోశాధికారి),ఇ.వి. శ్రీనివాస్ రావు (రాష్ట్ర పాలకవర్గ సభ్యులు),జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, డా. కె. సుధాకర్ రెడ్డి, డా. సి.హెచ్. సంధ్యారాణి, జిల్లా టిబి నివారణాధికారి శ్రీమతి కె. హిమబిందు, రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్‌ను నూతన ఆవిష్కరణల హబ్‌గా

# తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం

### కేయూపై కేంద్ర మంత్రిని కలిసిన ఎంపి డా.కడియం కావ్య



ప్రజాపక్షం/హనుమకొండ: వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్‌ను కలుసుకుని, వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో అమలవుతున్న రూసా 2.0 (రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్) ప్రాజెక్టుల గడువు పెంచాలని వినతి పత్రం అందజేసి కోరారు. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీలో రూసా 2.0 కింద మొత్తం 50 కోట్లు మంజూరు కాగా, ఇందులో 35 కోట్లు పరిశోధన ప్రాజెక్టులకు, 15 కోట్లు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఉద్యోగ అవకాశాల పెంపు, ఇన్నోవేషన్ హబ్ కోసం కేటాయించారని ఎంపీ డాక్టర్ కడియం కావ్య, కేంద్ర మంత్రికి వివరించారు. 2024 జూన్‌లోనే పరిపాలనా అనుమతులు లభించడంతో ప్రస్తుతం 5 రీసెర్చ్ సెంటర్లు, 37 వ్యక్తిగత పరిశోధన ప్రాజెక్టులు క్రియాశీలంగా కొనసాగుతున్నాయని, 75 మంది రీసెర్చ్ ఫెలోస్ నియమితులయ్యారని తెలిపారు. అలాగే 9.4 కోట్లతో సివిల్ పనులు, ఐసీటీ, ల్యాబ్ పరికరాల కొనుగోళ్లు కొనసాగుతున్నాయని తెలిపారు. అయితే, ప్రస్తుత మార్చి 31–2026 గడువు ఈ విస్తృత పరిశోధన, మౌలిక వసతుల పనులు పూర్తయ్యేందుకు సరిపోదని, అందుకే గడువును మార్చి 31– 2027 వరకు పొడిగించాలని ఎంపీ డా. కడియం కావ్య కేంద్ర మంత్రిని కోరారు. గడువు పెంపుతో నిధుల సమర్థ వినియోగంతో పాటు పరిశోధన ఫలితాల సాధన విద్యార్థులు, పరిశోధకులకు దీర్ఘకాల ప్రయోజనాలు కలుగుతాయని ఎంపీ స్పష్టం చేశారు. గడువు పెంచకపోతే వరంగల్ యువత, పరిశోధకులు నష్టపోయే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేసారు. వరంగల్‌ను పరిశోధనలకు, నూతన ఆవిష్కరణల హబ్ గా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు.

## భారీగా నకిలీ ఇఎస్‌ఎస్‌ఇ సిగరెట్లు స్వాధీనం



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : నకిలీ ఈఎస్ఎస్ఈ సిగరెట్ల అక్రమ వ్యాపారాన్ని అరికట్టేందుకు కేటీ అండ్ జీ, తన లీగల్ భాగస్వామి ఎస్.ఎస్. రాణా కో, అమలు అధికారులతో కలిసి ఢిల్లీ ఎన్సీఆర్ ప్రాంతంలో ఒకే రోజులో 14 హోల్‌సేలర్లపై సమన్వయంతో కూడిన దాడులు నిర్వహించింది.ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు జరిగిన ఈ రైడ్స్‌లో, ఈఎస్ఎస్ఈ ట్రేడ్‌మార్క్‌తో విక్రయించబడుతున్న నకిలీ సిగరెట్లను భారీగా స్వాధీనం చేసుకున్నారు. దాడుల సమయంలో పరిశీలించిన పత్రాల్లో ఎక్కడా సక్రమమైన రికార్డు నిర్వహణ లేకపోవడం వెలుగులోకి వచ్చింది. ఇది నకిలీ వ్యాపారం పూర్తిగా అసంఘటితంగా కొనసాగుతున్నట్టు స్పష్టం చేస్తోంది.ఈ చర్యలతో అక్రమ సరఫరా గొలుసు తీవ్రంగా దెబ్బతిన్నదని కేటీ అండ్ జీ తెలిపింది. ఈ కేసులో మొత్తం 14 మంది నిందితులపై ఢిల్లీ హైకోర్టులో కేసు నమోదు చేయబడింది.భారతదేశంలోని పలు నగరాల్లో నకిలీ, అక్రమ పొగాకు ఉత్పత్తులు విస్తరిస్తున్న నేపథ్యంలో, కేటీ అండ్ జీ దేశవ్యాప్తంగా కఠిన చర్యలు చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా త్వరలోనే ముంబయి, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో మరిన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు చేపట్టనుంది.ఈ సందర్భంగా కేటీ అండ్ జీ హెడ్‌క్వార్టర్స్‌లోని ఐపీ డివిజన్ డైరెక్టర్ మిస్టర్ యంగ్‌హూన్ కిమ్ మాట్లాడుతూ, ఇలాంటి ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు వినియోగదారుల రక్షణ పట్ల కేటీ అండ్ జీనిబద్ధతకు నిదర్శనం. ట్రేడ్‌మార్క్‌ను దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు కొనసాగిస్తాం తెలిపారు. కేటీ అండ్ జీ నకిలీ ఈఎస్ఎస్ఈ సిగరెట్ల తయారీ, పంపిణీ లేదా విక్రయాల్లో పాల్గొనే వారిపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వినియోగదారులు ఈఎస్ఎస్ఈ ఉత్పత్తులను కేవలం అధికారిక డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు.

## యూరియా బుకింగ్ యాప్ ప్రారంభం

ప్రజాపక్షం/జఫర్‌గడ్: ఈ నెల 20వ తేది నుండి యూరియా బుకింగ్ యాప్‌ను ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.నర్సింగ రావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.రైతులకు యూరియాను సులభంగా, పారదర్శకంగా, కూలైన్ల ఇబ్బందులు లేకుండా చేసేందుకు యాప్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.రైతులు తమకు అందుబాటులో ఉన్న సమీప అధీకృత ఎరువుల డీలర్స్ ఎంపిక చేసుకుని యూరియా బుక్ చేసుకునే సౌకర్యం ఈ యాప్‌లో పొందుపర్చడం జరిగిందన్నారు.రైతులు తమ యొక్క పంట నమోదు కూడా ఇందులో పొందుపర్చుకోవచ్చని, దీని ద్వారా యూరియా సరఫరాలో అంతరాయం లేకుండా ఉండడంతో పాటు అక్రమ నిల్వలు, దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయబడుతుందన్నారు.రైతులు సహకరించి ఈ యూరియా బుకింగ్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## తడి, పొడి చెత్తపై అవగాహన కార్యక్రమం



ప్రజాపక్షం/హసన్‌పర్తి: గ్రేటర్ వరంగల్ 55వ డివిజన్ భీమారం బ్యాంక్ కాలనీలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నగర్ మేయర్, కమిషనర్, సీఎంహెచ్ఓ రాజారెడ్డి ఆదేశాల మేరకు 55వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లు తడి, పొడి చెత్త అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హానికరమైన చెత్తను వేర్వేరుగా చేసి మున్సిపాలిటీ చెత్తను తీసుకుని స్వచ్ఛ ఆటో కార్మికునికి ఇవ్వాలని, బ్యాంకు కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు, జవాన్లు, వాలంటీర్లను కేటాయించి ప్రజల్లో అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేరు చేద్దామనే నినాదంతో ముందుకు వెళ్తూ 100 రోజుల్లో వరంగల్ నగరాన్ని స్వచ్ఛ నగరంగా నిర్మిద్దాం అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జవాన్లు అందిస్తున్న పారిశుద్ధ్య సేవలకు గాను వారిని శాలువాలతో సన్మానించారు.

## గుగులోతు కోట మృతి బాధాకరం

### సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ మాజీ సభ్యులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు

ప్రజాపక్షం/తొర్రూరు : మండలంలోని అమ్మాపురం గ్రామ శివారు జీకె తండా గ్రామానికి చెందిన రైతు గుగులోతు కోట విద్యుత్ షాక్‌తో మృతి చెందడం బాధాకరమని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ మాజీ సభ్యులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు అన్నారు. విద్యుత్ షాక్‌తో కోట మృతి చెందడంతో భారత కమ్యూనిస్టు పార్టీ పక్షాన శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం విశ్వేశ్వర్‌రావు మాట్లాడుతూ అందరితో కలిసి మెలిసి ఉండే గుగులోతు కోట అకాల మరణం చెందడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, రమేశ్, లక్ష్మణ్, యాకాంతం, యాకయ్య, కోటగిరి చైతన్య, గణపురం సునీత, జీకె తండా శాఖ నాయకులు, తదితరులు ఉన్నారు.

## ప్రతి కాలనీ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు

### 2కోట్ల 70 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాగరాజు



ప్రజాపక్షం/వరంగల్ టౌన్: ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని వర్ధన్నపేట నియోజక వర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం రోజున ఎమ్మెల్యే నాగరాజు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ ఫేస్1, పండ్ల మార్కెట్ రోడ్డు, లక్ష్మి గణపతి కాలనీ, మధురనగర్ కాలనీలలో అంతర్గత రోడ్ల నిర్మాణం, సైడ్ డ్రైన్ ల నిర్మాణ పనులకు సుమారు 2కోట్ల 70 లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయా డివిజన్ లలో పర్యటించిన ఎమ్మెల్యే నేరుగా ప్రజలతో మాట్లాడి స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గత పాలకుల నిర్లక్ష్యంతో వెనుకబడిన ప్రతి కాలనీలో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు.ఇప్పటికే నియోజవర్గంలోని అన్ని డివిజన్ లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని,శంకుస్థాపన చేసిన అనతి కాలంలోనే పూర్తి స్థాయి నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.గతంలో పలు కాలనీల్లో కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న చాలా కాలనీలకు మెరుగైన సౌకర్యాలు కల్పించామని తెలిపారు.ప్రజా ప్రభుత్వం ఏర్పాటు జరిగిన తరువాత నియోజకవర్గం ప్రత్యేక అభివృద్ధి జరుగుతున్నదని,రానున్న రోజుల్లో మరింత మెరుగైన పాలన అందిస్తామని అన్నారు.ఏనుమాముల గ్రామంలో శివాలయం లింగం, బొడ్రాయి పునప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా కొబ్బరి కొట్టి పనులు ఎమ్మెల్యే నాగరాజు ప్రారంభించారు. ఇందిరమ్మ కాలనీ ఫేస్ 1 కాలనీ లో ప్రధాన సమస్యగా ఉన్న స్మశాన వాటిక, రేషన్ షాప్, అంగన్వాడి, ఇంటి నెంబర్, ఇండ్ల పట్టాలు తదితర సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తాను అని హామీ ఇచ్చారు.అభివృధి అనేది నిరంతర ప్రకియ అని, ఎవరూ అధైర్య పడొద్దు విలీన గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనులు చేస్తూ ముందుకు వెళ్తున్నాను అన్నారు.ఈ కార్యక్రమాలలో స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన, స్థానిక డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, గ్రామాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు,ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

## గ్రామాలలో అన్ని సమస్యలు పరిష్కరించాలి: ఎమ్మెల్యే



కేసముద్రం/ప్రజాపక్షం: ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుతో కేసముద్రం మండలంలోని వివిధ గ్రామాలలో విజయం సాధించిన సర్పంచ్, ఉపసర్పంచ్‌ల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం కేసముద్రం మున్సిపాలిటి పరిధి అమీనాపురం గ్రామంలోని ఎం.కే కన్వెన్షన్ హాల్‌లో కేసముద్రం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిధిగా మహబూబాబాద్ శాసనసభ్యుడు డాక్టర్ భూక్య మురళీ నాయక్ హాజరై మాట్లాడారు. ఈ సంధర్భంగా సర్పంచ్‌లను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామంలో మొదటి వ్యక్తిగా సర్పంచ్ ఉంటాడని, అతని పాలన వలన గ్రామంలో ఉన్న అన్ని సమస్యలను వివిధ కార్యక్రమాల ద్వారా పరిష్కరించాలని, గ్రామానికి తల్లిలా ప్రజా పాలన చేయాలన్నారు. గ్రామ సర్పంచ్ అంటే ఒక బాధ్యత గల పౌరునిగా ఉండాలన్నారు. అనంతరం సమావేశానికి హాజరైన సర్పంచ్, ఉపసర్పంచ్ లను కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లాధ్యక్షుడు అజ్మీరా సురేష్ నాయక్, పిసిసి సభ్యులు దస్రూ నాయక్, జిల్లా రవాణా అథారిటి సభ్యుడు రావుల మురళీ లతో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు ఎండి ఆయూబ్‌ఖాన్, ఓలం రమేష్, కాకి విజయ, చింతకుంట్ల యాదగిరి, వీరన్న, సంకెపెల్లి నారాయణరెడ్డి, చిదురాల వసంతరావు, సీనియర్ నాయకులు బండారు వెంకన్న, బండారు దయాకర్, పోలేపాక నాగరాజు, దామరకొండ ప్రవీణ్, తోట వెంకన్న, రఫీఖాన్, వివిధ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## శాస్త్ర, సాంకేతిక రంగాలలో దేశం మరింత అభివృద్ధి



ప్రజాపక్షం/హనుమకొండ : శాస్త్ర, సాంకేతిక రంగాలలో భారతదేశం మరింత అభివృద్ధి చెందాలని, అప్పుడే విశ్వ గురువుగా కీర్తించబడుతుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. పాఠశాల విద్యాశాఖ, హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి విద్యా,వైజ్ఞానిక ప్రదర్శనను శుక్రవారం హనుమకొండ లోని సెయింట్ పీటర్స్ ఎడ్యు స్కూల్ ఆవరణలో ఆయన దీప ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. వి. గిరిరాజ్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దేశాలతో, అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడాలంటే శాస్త్ర, సాంకేతిక రంగాలలో మరింత పురోభివృద్ధి అవసరం అన్నారు. చైనా వ్యవసాయ రంగంలోకన్నా కూడా పారిశ్రామిక రంగ అభివృద్ధితోనే ప్రపంచాన్ని శాసిస్తున్నదన్నారు. విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థులు తీసుకువచ్చే ప్రదర్శనలు సృజనాత్మకతతో కూడిన కొత్త ఆలోచనలతో ఉండాలన్నారు. అప్పుడే మంచి శాస్త్ర,సాంకేతిక రంగానికి బాటలు వేసిన వారవుతారన్నారు. విద్యార్థుల పరిశోధనలే దేశ ప్రగతికి సోపానాలు అవుతాయని ఆయన పేర్కొన్నారు. జిల్లాస్థాయి నుండి 12 ఎగ్స్ బిట్స్ రాష్ట్రస్థాయి ప్రదర్శనకు గత సంవత్సరం ఎంపికకావడం అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మేన శ్రీను, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస స్వామి, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, నెహ్రూ నాయక్, నారాయణరెడ్డి, ప్రిన్సిపల్ వివిధ కమిటీల కన్వీనర్లు, కో కన్వీనర్లు పాల్గొన్నారు.

## కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని సోనియా, ఖర్గేలకు వినతి

ప్రజాపక్షం/జనగామ : ఆర్‌బిఐ స్ఫూర్తి ప్రధాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఫోటోను కరెన్సీపై ముంద్రించేలా పార్లమెంట్‌లో చర్చించాలని కోరుతూ కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాదన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ, జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గెకు వినతిపత్రం సమర్పించారు. కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాదన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ ఆధ్వర్యంలో సోనియాగాంధీ, మల్లికార్జున్ ఖర్గేలకు వినతి పత్రం సమర్పించి అంబేద్కర్ ఫోటో ముద్రన ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా పరశురామ్ మాట్లాడుతూ కరెన్సీపై అంబేద్కర్ ఫోటో ముద్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రూపాయి దాని సమస్య పరిష్కార మార్గం, ఇండియా బ్యాంకింగ్ చరిత్ర పుస్తకాన్ని వ్రాసి హిల్టాన్ యాంగ్ కమీషన్, రాయల్ కమీషనర్, సైమన్ కమీషన్‌కు ఇవ్వడం జరిగిందన్నారు. కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో ముద్రించకపోవడం అంటే రాజ్యాంగాన్ని విస్మరించినట్టేనన్నారు. ఈ కార్యక్రమంలో కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధన సమితీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు కంత వేణు, సలహాదారులు తైకొండ శ్రీనివాస్, చంద్రహాస్ పాల్గొన్నారు.



## మొబైల్ యాప్ ద్వారానే యూరియా బుకింగ్



ప్రజాపక్షం/జనగామ: ఇక నుండి మొబైల్ యాప్ ద్వారానే యూరియా బుకింగ్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ తెలిపారు. జనగామతో సహా రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో శనివారం నుండి అమలు చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ రంగంలో పారదర్శకతను పెంచేందుకు, ఎరువుల వాడకాన్ని క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ కీలక నిర్ణయం తీసుకుందని, ఇకపై రైతులు యూరయా కేవలం మొబైల్ అప్లికేషన్ ద్వారానే బుక్ చేసుకోవాలని స్పష్టం చేశారు. మాన్యువల్, ఆన్‌లైన్ బుకింగ్‌లకు ఇకపై అనుమతి ఉండదన్నారు. తొలి విడతలో ఎంపిక చేసిన జిల్లాలో జనగామ జిల్లా కూడా ఉందన్నారు. రైతులు ఈ విషయాన్ని గమణించాలని కలెక్టర్ తెలిపారు. సహాయం కోసం హెల్ప్‌లైన్ నెంబర్‌కు కాల్ చేయాలన్నారు. యూరియా బుకింగ్‌పై జిల్లాలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో వ్యవసాయ శాఖ అధికారులకు అవగాహన కల్పించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా అందే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# రీల్

## తొక్కలో మనసు పగిలేనే అంటున్న విజయ్ ఆంటోని



తమిళ నటుడు విజయ్ ఆంటోని తెలుగులో మంచి మార్కెట్ సంపాదించుకున్నాడు. బిచ్చగాడు సినిమా సక్సెస్‌తో తెలుగు ట్రేడ్‌లో మార్కెట్ సంపాదించుకున్న విజయ్ ఆంటోని తీసిన ప్రతి సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్నా డు. తాజాగా బుకి అనే సినిమాను కూడా విడుదలకు సిద్ధం చేశాడు. ఈ సినిమాలో తాను నటించడం తో పాటు నిర్మాతగా కూడా ఉ న్నా రు. అజయ్ దిషన్, ధనుష హీరో హీరోయిన్స్‌గా గణేష్ చంద్ర దర్శకత్వంలోరూపొందుతున్న యూ త్ ఫుల్ ఎంటర్‌టైనర్ 'బుకీ'. విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, శరవంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై రామంజేయులు జవ్వాజీని ర్మిస్తున్నారు. విఎఎఫ్సి ప్రజెంట్ చేస్తున్నారు.తాజాగా మేకర్స్ 'బుకీ' బ్రేకప్ యాంథమ్ తొక్కలో మనసు పగిలేనే సాంగ్‌ని రిలీజ్ చేశారు. విజయ్ ఆంటోని ఈ సాంగ్ ని అద్భుతమైన వైబ్‌తో కంపోజ్ చేశారు. విజయ్ ఆంటోని, ఖరెస్మా రవిచంద్రన్ ఎనర్జిటిక్ వోకల్స్ ఆకట్టుకున్నాయి. భాష్యశ్రీ సాహిత్యం అందించారు. ఈ చిత్రం లో పాండియరాజన్, సునీల్, లక్ష్మి మంచు, ఇందుమతి, వివేక్ ప్రసన్న కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకత్వం డీవోపీ: గణేష్ చంద్ర.

## ముస్తాబవుతున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన తాజా చిత్రం మన శంకర వరప్రసాద్ గారు. ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా విడుదలకు ముస్తాబవుతోంది. సినిమాపై ఆసక్తిని పెంచడానికి దర్శకుడు అనిల్ రావిపూడి రకరకాలుగా బాబ్లిసిటి చేస్తున్నారు. వెంకటేష్ ఓ కీలక పాత్రను పోషిస్తున్న ఈ సినిమాలో చిరంజీవి, వెంకటేష్‌పై ఒక మాస్ పాటను చిత్రీకరించారు. ఇప్పుడు ఈ సినిమా నుంచి ఒక మూడు ఫోటోలను సోషల్ మీడియాలో రిలీజ్ చేశారు. చాలా స్టైలిష్‌గా, స్లిమ్‌గా చిరంజీవి కనిపిస్తున్నారు. దీంతో ఈ మెగా ఫాన్స్ పండుగ చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. అన్ని పనులు పూర్తి చేసుకుని జనవరి 12న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల అయిన రెండు పాటలు సూపర్ హిట్ అయ్యాయి. చిరంజీవి సరసన నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సంగీతం అందిస్తున్నారు. క్యాథరిన్ తెరిసా మరో కీలక పాత్ర పోషిస్తోంది. సుస్మిత కొణిదల, సాహు గారపాటి ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

# ఛాంపియన్ సినిమా మగధీరలా హిట్ కావాలి

### ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రామ్ చరణ్



స్వప్న సినిమాస్ అప్‌కమింగ్ మూవీ 'ఛాంపియన్' ఆసక్తికరమైన ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో రోషన్, అనస్వర రాజన్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణలో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. మిక్కీ జే మేయర్ అందించిన పాటలు చార్ట్ బస్టర్ అయ్యాయి. ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా రామ్ చరణ్ చీఫ్ గెస్ట్‌గా ఈ సినిమా ట్రైలర్ లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మాట్లాడుతూ కో ఇన్సిడెంట్‌గా నేను పక్క స్టూడియోలోనే షూటింగ్ చేస్తున్నాను. ఎన్టీఆర్‌కి మొదటి సినిమా స్టూడెంట్ నెంబర్ వన్, అల్లు అర్జున్‌కి మొదటి సినిమా గంగోత్రి, మహేష్‌కి రాజకుమారుడు, నాకు చిరుత.. మా అందరికీ మోస్ట్ కామన్ బ్యూటిఫుల్ పర్సన్ మా దత్తుకి, వైజయంతి మూవీస్‌కి మన స్ఫూర్తిగా ధన్యవాదాలు. మేము ఎలా పెర్ఫాం చేస్తామో తెలియకుండానే మా అందరికీ మొదటి సినిమా ఇచ్చి ఇంత అద్భుతమైన ప్రయాణాన్ని ఇచ్చినందుకు దత్తుకి థాంక్యూ సో మచ్. రోషన్ కూడా ఇవాళ ఛాంపియన్‌తో వస్తున్నాడు. తనకి వైజయంతి మూవీస్‌లో అద్భుతమైన సక్సెస్ రావాలని కోరుకుంటున్నాను. నా రెండో సినిమా మగధీర ఎంత పెద్ద హిట్ అయిందో ఛాంపియన్ అంత పెద్ద హిట్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. డిసెంబర్ 25న రిజల్ట్ ఇస్తుందని గట్టిగా నమ్ముతున్నాను అని అన్నారు. డైరెక్టర్ నాగ్ అశ్విన్ మాట్లాడుతూ కల్కి చివర్లో ఉన్నప్పుడు ఈ సినిమా మొదలైంది. ఈ సినిమా బిగినింగ్ నుంచి జర్నీ తెలుసు. వైజయంతి ప్రొడక్షన్ స్టాండర్డ్స్ ఏ స్థాయిలో ఉంటాయో అందరికీ తెలుసు. ఈ సినిమా చాలా అద్భుతంగా అనిపించింది. ప్రదీప్ చాలా ముఖ్యమైన కథ చెబుతున్నారు. రోషన్ చాలా అద్భుతంగా కనిపిస్తున్నాడు. అనస్వర ఈ సినిమా తర్వాత చాలామందికి ఫేవరెట్ అవుతుంది. బైరాన్‌పల్లి వీరులందరి పెర్ఫార్మన్స్ మీ అందరికీ నచ్చుతుంది. అందరు కూడా ఈ సినిమా గురించి మాట్లాడతారు. గిరగిర సాంగ్ ట్రెండ్ అవుతుంది ఛాంపియన్ మన నేల కథ. బైరన్‌పల్లి విలేజ్‌లో ఏం జరిగిందనేది చాలామందికి తెలీదు. అలాంటి కథ చెప్పాలనే వైజయంతి మూవీస్ ఈ సినిమా చేస్తోంది అని చెప్పారు. హీరో రోషన్ మాట్లాడుతూ ఈ మూడేళ్లలో నేను చాలా నేర్చుకున్నాను. ఇక ఆగేది లేదు. ప్రదీప్ ఆల్రెడీ నేషనల్ అవార్డు గెలిచారు. నాకు మైకేల్ క్యారెక్టర్, ఛాంపియన్ సినిమా ఇచ్చినందుకు ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఆయన చేసిన హార్డ్‌వర్క్‌కి నిజంగా హ్యాట్సాఫ్. డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం మాట్లాడుతూ మమ్మల్ని బ్లెస్ చేయడానికి వచ్చిన రామ్ చరణ్‌కి థాంక్యూ. నా లైఫ్‌లోకి వచ్చిన ఏంజిల్స్ స్వప్న రోషన్. సప్న సంకల్పం రోషన్ నమ్మకంతోనే ఈ సినిమా మీ ముందుకు వస్తుంది. డిసెంబర్ 25వ తేదీన ఈ సినిమా హిట్ కాబోతుందనే నమ్మకం ఉందన్నారు. ప్రొడ్యూసర్ అశ్విని దత్ మాట్లాడుతూ నేను ఇంట్రడ్యూస్ చేసిన చరణ్ ఎంతో ఎత్తుకు ఎదిగాడు. ఆయన సినిమా పెద్ది వస్తుందంటే నుంచే చూడాలి అనిపించేంత కోరిక ఉంది. ఇప్పుడు ఇంట్రడ్యూస్ చేస్తున్న రోషన్ కూడా వారి అడుగుజాడల్లో నడవాలని కోరుకుంటున్నాను అని అన్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ రోషన్‌ని బ్లెస్ చేయడానికి వచ్చిన రామ్ చరణ్‌కి థాంక్యూ. ఈ సినిమా కోసం మీ అందరి లాగానే నేను కూడా ఎదురు చూస్తున్నాను. ప్రదీప్ అద్భుతమైన దర్శకుడు. తన భవిష్యత్తులో చాలా పెద్ద దర్శకుడు అవుతాడు. మా దత్తుతో పెళ్లి సందడి చేశా. ఇప్పుడు రోషన్‌తో సినిమా చేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. అనస్వర రాజన్ మాట్లాడుతూ నేను రామ్ చరణ్‌కి పెద్ద ఫ్యాన్‌ని. ఆయన మగధీర సినిమా ఎన్నోసార్లు చూశాను. ఆయన మా ట్రైలర్‌ని లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాతో తెలుగులో లాంచ్ కావడం చాలా ఆనందంగా ఉంది. ఈ అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు అని చెప్పారు.

# సోషల్ మీడియాలో నన్ను హేట్ చేస్తున్నారు!

### సంగీత దర్శకుడు డైరెక్టర్ తమన్



నందమూరి బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఇటీవల విడుదలైన సినిమా 'అఖండ 2: ది తాండవం. ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మీడియాతో చిట్ చాట్ జరిపారు. సినిమా బాగుంటే అన్ని బాగుంటాయి. మ్యూజిక్ అనేది ఒక క్రాఫ్ట్. మన క్రాఫ్ట్‌ని మనం బెస్ట్‌గా చేయాలి. ఈ ఏడాది డాకు మహారాజ్, గేమ్ చేంజర్, ఓజి.. అఖండ2.. రాబోతున్న రాజాసాబ్ ఇవన్నీ కూడా వరుసగా కలిసి వచ్చాయి. మనం స్క్రిప్ట్ అనుకున్నప్పుడే కొన్ని హై మూమెంట్స్ అనుకుంటాం. బోయపాటి ఆషామాసి డైరెక్టర్ కాదు. కమర్షియల్ సినిమా నమ్మించేలా తీయడం నిలబెట్టడం చాలా గొప్ప విషయం. అందులోనూ సనాతన ధర్మం కంటెంట్‌గా తీసుకుని దాన్ని కమర్షియల్‌గా చెప్పడం, అందులోనూ బాలయ్య లాంటి సూపర్ మాస్ ఎనర్జిటిక్ స్టార్‌తో చేయడం మామూలు విషయం కాదు. ఈ క్రెడిట్ అంతా బాలయ్యకి, బోయపాటికి ఆ క్రెడిట్ దక్కుతుంది. బోయపాటికి నాకు రెండు నెలలు సమయం కావాలని అడిగాను ఒక్క రీల్ చేసి చూపించాను. ఆయనకు చాలా నచ్చింది. అప్పుడు నాకున్న బడ్జెట్‌ని మార్చి, నాకు మరింత సమయాన్ని ఇచ్చి ఎంతగానో సపోర్ట్ చేయించి చేసి మ్యూజిక్ చేయించారు. అఖండకి ఆయన నాకు వెన్నుముకలాగా నిలిచారు. ఆడియన్స్‌ని ఎలా ట్రాన్స్‌లోకి తీసుకువెళ్లాలి అని ఆలోచన చేస్తూ చాలా హార్డ్ వర్క్ చేసి ఈ సినిమా చేశాం. ఈ సినిమాకి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చేయడానికి 73 రోజులు పట్టింది. జనరల్‌గా బోయపాటి సినిమాలో ఇంటర్వెల్ క్లైమాక్స్ చేయడం చాలా కష్టం. మొదటి రీల్ నుంచి నాకు చాలెంజ్ మొదలైంది. అష్టసిద్ధి కుంభమేళా ఇంటర్వెల్, ఆది గారి ఎపిసోడ్, హనుమంతుడు ఎపిసోడ్ లాస్ట్‌లో అవెంజర్స్ లాంటి క్లైమాక్స్ ఇవన్నీ చాలా హార్డ్ వర్క్‌తో కూడుకున్నవి. గేయ రచయితలు కాసర్ల శ్యామ్, కళ్యాణ్ చక్రవర్తి, శర్మ అందరూ చాలా అద్భుతంగా సపోర్ట్ చేశారు. ఈ సినిమా కోసం సర్వేపల్లి సిస్టర్స్, సుబ్బలక్ష్మి మనవరాలు, కనకవ్వ ఇలా చాలా ఫ్రెష్ వాయిస్‌లు మీకు వినిపించాయి. చివరి నిమిషంలో విడుదల ఆగిపోవడం నిజానికి నాకు అది షాకింగ్. ఎందుకంటే ఎవరూ కూడా ఊహించలేదు. ఒక సినిమా రిలీజ్ అయినప్పుడు సోషల్ మీడియాలో చాలా హేట్ వస్తుంది. అంత హేట్ అవసరం లేదని చెప్పడమే నా ఉద్దేశం.

## బాహుబలి వంటి సినిమా చేయాలనుంది



రకుల్ ప్రీత్ సింగ్

తెలుగు సినిమాను ఓ ఊపు ఊపిన రకుల్ ప్రీత్ సింగ్ కొంత కాలంగా తెలుగు తెరకు దూరంగా ఉంది. వివాహం చేసుకున్న రకుల్ తిరిగి చాలా రోజుల తరువాత హైదరాబాద్‌లో సందడి చేసింది. ఓ ప్రయివేట్ కార్యక్రమానికి వచ్చిన రకుల్ ప్రీత్ సింగ్ మీడియాతో ముచ్చటించింది. బాహుబలి వంటి సినిమా చెయ్యాలని ఉందని తన మనసులోని మాట చెప్పింది. ఇటీవల కాలంలో తెలుగు సినిమాలు చేయకపోవడం వల్ల నేను తెలుగు సినిమాలను, తెలుగువారిని ఎంతగానో మిస్ అవుతున్నాను. తప్పకుండా నేను తెలుగులో సినిమాలు చేస్తాను. నాకు తొలివిజయం అందించింది తెలుగు సినిమానే. నన్ను తెలుగు ప్రజలు అంతగా ఆదరించారు. ఒక చక్కటి కథ కోసం ఎదురుచూస్తున్నాను. నాకు మంచి తెలుగు కథ రావాలని నా అభిమానులంతా నాకోసం ప్రార్థించండి. హైదరాబాద్ లో ఉండి షూటింగ్ చేయాలని ఎంతో కొరికగా ఉంది. ప్రస్తుతం కథలు వింటున్నాను. మంచి కథ కోసం ఎదురు చూస్తున్నాను. తెలుగులో బాహుబలి వంటి సినిమా చేయాలని నా కోరిక. బోయపాటి శ్రీను దర్శకత్వంలో నేను గతంలో రెండు సినిమాలలో చేశాను. వారి మాస్ డైరెక్షన్ నాకు చాలా ఇష్టం అని రకుల్ ప్రీత్ సింగ్ చెప్పారు.

## జనవరి 13న భర్త మహాశయులకు విజ్ఞప్తి

రవితేజ హీరోగా కిశోర్ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం భర్త మహాశయులకు విజ్ఞప్తి. ఆశికా రంగనాథ్, డింపుల్ హాయతి హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఈ చిత్రానికి సంబంధించిన తాజా టీజర్ రిలీజ్ చేశారు. భార్య భర్తల మధ్య ఉండే అనుబంధం, చిన్న చిన్న గొడవలు ఎలా సర్దుకుపోవాలి వంటి అంశాలను కథగా తీసుకుని నిర్మించిన సినిమా ఇది. అన్ని పనులు పూర్తి చేసి సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 13న ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఎస్ ఎల్ వి సి సినిమాస్ బ్యానర్ పై చెరుకు సుధాకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భీమ్స్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.

# చైతన్యవంతమైన సమాజానికి క్రీడలు మూలస్తంభం

### భారత బాడ్మింటన్ క్రీడాకారిణి, ఒలింపిక్స్ విజేత, పద్మ భూషణ్ సైనా నెహ్వాల్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** క్రీడలు ఆరోగ్యకరమైన, చైతన్యవంతమైన సమాజానికి మూలస్తంభమని, క్రీడలలో పాల్గొనే విద్యార్థులు విద్యాపరంగా మెరుగ్గా రాణిస్తారని భారత బాడ్మింటన్ క్రీడాకారిణి, ఒలింపిక్స్ విజేత, పద్మ భూషణ్ సైనా నెహ్వాల్ అన్నారు. క్రీడలు శరీరాన్ని మాత్రమే కాకుండా మెదడును అభివృద్ధి చేయడం ద్వారా జీవిత నైపుణ్యాలను పెంపొందించడంలో, ఐక్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో సహాయపడతాయన్నారు. హైదరాబాద్ డిఆర్ఎస్ఐఎస్ క్యాంపస్‌లో శుక్రవారం జరిగిన డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ 23వ వార్షిక క్రీడా పోటీల ముగింపు ఉత్సవాలలో సైనా నెహ్వాల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అడిషనల్ డిజిపి డాక్టర్ అనిల్ కుమార్ డిఆర్ఎస్ఐఎస్ చైర్మన్ దయానంద్ అగర్వాల్, డైరెక్టర్లు అంజనీ కుమార్ అగర్వాల్, సంజయ్ అగర్వాల్, గర్వ అగర్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ క్యాంపస్ లో కొత్తగా ఏర్పాటు చేసిన బాడ్మింటన్ కోర్ట్‌ను సైనా నెహ్వాల్ ప్రారంభించి విద్యార్థులతో బాడ్మింటన్ ఆడారు. అనంతరం క్రీడా పోటీలలో పాల్గొని విజేతలైన విద్యార్థిని విద్యార్థులకు ట్రోఫీలు, సర్టిఫికెట్‌లను అందజేశారు. సైనా నెహ్వాల్ మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలు మానవ జీవితంలో ఒక ముఖ్యమైన భాగమని, అవి వ్యక్తిత్వాన్ని రూపొందించడం, మంచి ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం, క్రమశిక్షణ, జట్టు కృషి విలువలను బోధించడం చేస్తాయన్నారు. పిల్లలలో క్రీడలు, ఆటలను ప్రోత్సహించడంలో పాఠశాలలు పెద్ద పాత్రను పోషించాలని, పాఠశాలలు తమ రోజువారీ షెడ్యూల్‌లో క్రీడలను చేర్చి, క్రమం తప్పకుండా క్రీడా పోటీలు, టోర్నమెంట్లు నిర్వహించాలని సైనా నెహ్వాల్ కోరారు. డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ డిఆర్ఎస్ఐఎస్ యాజమాన్యం క్రీడల ప్రాముఖ్యత గుర్తించి క్రీడా మౌలిక సదుపాయాలు కల్పించి క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, స్విమ్మింగ్ వంటి ప్రతి క్రీడలలో విద్యార్థులు పాల్గొనేలా చేసి దేశీయ, అంతర్జాతీయ పోటీలకు పంపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ చీఫ్ కోచ్ డాక్టర్ మురమళ్ళ భారత్ కుమార్, అడ్మిన్ హెడ్ వినోద రంజన్, వైస్ ప్రిన్సిపాల్ పూజ సక్సేనా, హెడ్ ఆఫ్ బోర్డింగ్ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తులో క్రీడాహబ్‌గా తెలంగాణ

### క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం భవిష్యత్తులో క్రీడాహబ్‌గా మారిపోతుందని క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో యుబిఎస్ అథ్లెటిక్స్ కిడ్స్ కప్ టోర్నమెంట్ కు ముఖ్య అతిధులుగా మంత్రు లు వాకిటి శ్రీహరి, శ్రీధర్‌బాబు హాజరయ్యారు. అథ్లెటిక్స్ కిడ్ కప్‌లో విజేతలుగా నిలిచిన వారికి మంత్రులు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. చిన్నారుల్లో ఉన్న క్రీడానైపుణ్యాలను గుర్తించడానికి యుబిఎస్ చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. సిఎం కప్ ద్వారా గ్రామస్థాయిలో 4లక్షల మంది క్రీడాకారుల నైపుణ్యాలను గుర్తించామన్నారు. భవిష్యత్తులో 5లక్షల మంది క్రీడాకారులను సిఎం కప్ ద్వారా వారి ప్రతిభ గుర్తించి రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ క్రీడా వేదికలకు పరిచయం చేస్తాం అని అన్నారు. స్పోర్ట్స్ పాలసీ ఏర్పాటు చేసి ఒలంపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించే దిశగా పని చేస్తున్నామని తెలిపారు. చిన్నారుల్లో ప్రతిభ బయటికి తీసి వారికి అవకాశాలు కల్పించి ప్రోత్సహిస్తున్నామని అన్నారు. ఒకప్పుడు తల్లిదండ్రులు ప్రోత్సాహం తక్కువగా ఉండేది ఇప్పుడు తల్లితండ్రులే పిల్లలను క్రీడల వైపు ఎక్కువగా ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో నూతన స్టేడియాలు ఏర్పాటు చేయడమే కాకుండా పాత స్టేడియాలను పునరుద్ధరణ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ చైర్మన్ శివ సేన రెడ్డితో పాటు అధికారులు పాల్గొన్నారు.



# ప్రజా రంజక పాలన

(మొదటి పేజీ తరువాయి)

ముత్యాల విశ్వనాథం అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా విచ్చేసిన కూనంనేని మాట్లాడుతూ గెలిచిన సిపిఐ అభ్యర్థులు ఆయా గ్రామ పంచాయితీల్లోని గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ఎజెండాగా ఉండాలని సూచించారు. పోటా పోటీగా ఒంటరి పోరుకు దిగిన సిపిఐ జిల్లా వ్యాప్తంగా 47 సర్పంచ్ స్థానాలను మంచి మెజార్టీతో గెలుచుకుందని, అదే విధంగా 57 ఉపసర్పంచ్ పదవులు దక్కించుకోగా, 432 వార్డుల్లో ఎర్ర జెండా రెపరెపలాడుతోందన్నారు. మేజర్ గ్రామ పంచాయితీలను సైతం సిపిఐ ఖాతాలో పడ్డాయని తెలిపారు. తాము కాకలు తీరిని రాజకీయ పండితులం అని చెప్పుకునే వారి ప్రాంతాల్లో కూడా సిపిఐ దూసుకుపోయిందని, కొత్తగూడెం నియోజకవర్గంలో కాంగ్రెస్ కంటే సిపిఐకి అత్యధిక ఓట్లు పోలయ్యాయని చెప్పారు. ముగిసిన ఎన్నికల్లో సిపిఐకి కాంగ్రెస్ పార్టీ కనీసం మద్దతు తెలపలేదని, కానీ సిపిఐ స్నేహధర్మాన్ని పాటిస్తూ గతంలో కాంగ్రెస్ సర్పంచ్‌లు ఉన్న స్థానాల్లో తాము పోటికి నిలుపలేదని చెప్పారు. అయినప్పటికీ కాంగ్రెస్ నేతలు వ్యక్తిగత దూషణలకు దిగితూ దిగజారుడు రాజకీయాలు చేశారని, విలువలతో కూడుకున్న రాజకీయాలు, క్రమశిక్షణతో ఉన్న తాము తప్పిదాలకు తావివ్వలేదని చెప్పారు. కొందరు సిపిఐది ఏముందిలే, గత అసెంబ్లీ ఎన్నికల్లో తామే గెలిపించాం, వాళ్లకు అంత సీన్ లేదంటూ అవాకులు చెవాకులు పేలారని, కానీ దిమ్మదిరిగే ఫలితాలు సొంత కావడంతో ఇప్పుడు వారు ఎక్కడున్నారో కూడా అంతు చిక్కడం లేదని యద్దేవా చేశారు. ఇప్పటికైనా మాటలు జారడం మానుకుని స్నేహ బంధాన్ని నిలుపుకుంటే మంచిదని హితవు పలికారు. త్వరలో జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు జరగబోతున్నాయని, ఆ తర్వాత మున్సిపాలిటీ, కార్పోరేషన్ ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. ఏ ఎన్నికలు వచ్చినా సిపిఐదే పైచేయని, ఆనాటి రాజకీయ పరిస్థితులు, ఆయా పార్టీల రాష్ట్ర పెద్దల నిర్ణయాల మేరకు కార్యచరణ ఉంటుందన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ గెలిచిన అభ్యర్థులు ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగాలని, ఓటమి పాలైన వారు కృంగిపోకుండా రానున్న ఎన్నికల్లో సత్తా చాటేందుకు మనోధైర్యాన్ని కూడగట్టుకుని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డుసభ్యులకు మెమోంటోలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాసరావు, నరాటి ప్రసాద్, సరెడ్డి పుల్లారెడ్డి, దుర్గరాశి వెంకటేశ్వర్లు, వి పూర్ణ చంద్రరావు, మున్నాలక్ష్మీ కుమారి, కే సారయ్య, చంద్రగిరి శ్రీనివాస రావు, రేసు ఎల్లయ్య, ఎస్‌డి సలీం, చంద్ర నరేంద్ర కుమార్, వాసిరెడ్డి మురళీ, మువ్వా వెంకటేశ్వరరావు, బంధం నాగయ్య, ఉప్పుశెట్టిరాహుల్, మండల కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు నూతన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రామ జపంతో దగా

(మొదటి పేజీ తరువాయి)

కడుపు కొట్టేందుకు చేస్తున్న ప్రయత్నాల పట్ల ప్రజలలో చైతన్యం తీసుకువచ్చేందుకు భవిష్యత్ కా ర్యాచరణపై చర్చించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని, నిధులను మరింత పెంచడంతో పాటు కూలీల వేతనాలను, పనిదినాలను 200రోజులకు పెంచాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు.

అనంతరం మీడియాతో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహ మాట్లాడుతూ శ్రీరాముని పేరుతో 30 కోట్ల మందిని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మరోసారి మోసం చేసే కుట్రకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రజలను మతం వైపు నడిపిస్తూ, కార్పొరేట్ శక్తులను బలోపేతం చేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. బలమైన పోరాటల కారణంగా రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకున్నారని గుర్తు చేశారు. ఉపాధి హామీ చట్టం వైఫల్యం చెందాలనే ఉద్దేశంతోనే చట్టాన్ని పథకంగా మార్చారన్నారు. భారత స్వాతంత్రోద్యమంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ పాల్గొనలేదని, అందుకే స్వాతంత్ర్య ఉద్యమంలో ఉన్న గాంధీజిని, పోరాట యోధుల పేర్లను తొలగిస్తున్నారని, మావోయిస్టు నాయకులను ఎన్‌కౌంటర్ చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

జాన్ వెస్లీ మాట్లాడుతూ ఉపాధి హామీ పని దినాలను, వేతనాలను పెంచాలని కోరినప్పటికీ కేంద్రం పెంచలేదని, ఇది వరకు ఉన్న 90 శాతం వాటాలను ఈ కొత్త బిల్లు ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలే 40 శాతం నిధులను భరించాలని, కేంద్రం విడుదల చేసిన నిధులకు మించి జరిగే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వాలే భరించాలనే నిబంధనలను పొందుపర్చారన్నారు. ఉపాధి హామీ చట్టంలో ఉన్న నిరుద్యోగ భృతి తొలగించారని, కూలీల సంఖ్యను కూడా తగ్గించారని విమర్శించారు. కె.గోవర్ధన్ మాట్లాడుతూ రానున్న 2047 నాటికి భారతదేశాన్ని పూర్తిగా హిందూదేశంగా మార్చేందుకు బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. గత 12 ఏళ్లుగా బిజెపి ముసుగులో ఆర్ఎస్ఎస్ ప్రత్యక్షంగా పరిపాలన కొనసాగిస్తోందని, వారసత్వాలు, దేశ పునాదులపై దాడులకు పాల్పడుతోందని మండిపడ్డారు. అన్వేష్ మాట్లాడుతూ ప్రజా పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక, విద్య, ఉపాధి హక్కు చట్టాలను తొలగించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. గోదగాని రవి మాట్లాడుతూ రాష్ట్రాలపైన కేంద్ర ప్రభుత్వం భారం మోప డం ప్రజా వ్యతిరేక చర్య అని అన్నారు. ఆర్‌వి.ప్రసాద్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ చట్టం బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

# కప్పేసిన పొగమంచు

(మొదటి పేజీ తరువాయి)

రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని హెచ్చరించింది. దానికి తగ్గట్టే 150కి పైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. మరో 200 సర్వీసుల్లో జాప్యం చోటుచేసుకుంది. ఈ అంతరాయాలు కొనసాగుతాయని ఢిల్లీ ఎయిర్ పోర్ట్ వెల్లడించింది. పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తర్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్రాలను దట్టమైన పొగమంచు కప్పేసిందని, ఉపగ్రహ చిత్రాల ద్వారా ఈ విషయం వెల్లడైందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఉదయం 5.30 గంటల సమయంలో ఉత్తర్ ప్రదేశ్‌లోని ఆగ్రా, బరేలీ, షహరాన్‌పూర్, గోరఖ్‌పూర్, పంజాబ్‌లోని అంబాలా, అమృత్‌సర్, లూథియానా, ఆదంపూర్, ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్, హర్యానా, మధ్యప్రదేశ్, బిహార్‌లోని పలు ప్రాంతాల్లో ఎదురుగా వస్తోన్న వాహనాలు ఏమాత్రం కనిపించని పరిస్థితి నెలకొంది. కాగా.. వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఢిల్లీ ప్రభుత్వం తీసుకొచ్చిన కఠినమైన చర్యలు అమల్లోకి వచ్చాయి. కాలుష్య నియంత్రణ ధ్రువపత్రం (పియుసి) లేని వాహనాలకు ఢిల్లీ పెట్రోలు స్టేషన్లలో ఇంధనం అందించడం ఆపేశారు. ఈ నిబంధనలను కఠినంగా అమలుచేసేందుకు ఢిల్లీ సరిహద్దుల వద్ద పోలీసు, రవాణాశాఖ బృందాలను మోహరించారు.

# 'ఆదివారం' బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

అడిగినప్పుడు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ ఈ నిర్ణయాలను పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ సరైన సమయంలో తీసుకుంటుందని బుదులిచ్చారు. ఏప్రిల్ 1న ప్రారంభమయ్యే కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే బడ్జెట్ అమలును నిర్ధారించడానికి ఫిబ్రవరి 1వ తేదీని ఎంపిక చేశారు. ఒక అధికారి చెప్పిన వివరాల ప్రకారం... 'సాధారణ బడ్జెట్ ప్రవేశపెట్టడానికి మాకు ఒక నిర్ణీత రోజు ఉంది. ఆదివారం అనే భావనను బ్రిటిష్ వారు తీసుకువచ్చారు. 2017కి ముందు, సాధారణ బడ్జెట్‌ను ఫిబ్రవరి చివరి రోజున ప్రవేశపెట్టేవారు, కొత్త ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసిక ఖర్చులను తీర్చడానికి భారత సంఘటిత నిధి నుండి డబ్బును ఉపసంహరించుకోవడానికి పార్లమెంటు ఓట్ ఆన్ అకౌంట్‌ను ఆమోదించేది. వివిధ విభాగాల గ్రాంట్ల డిమాండ్లను సంబంధిత పార్లమెంటరీ స్థాయీ సంఘాలు పరిశీలించిన తర్వాత, ఆర్థిక సంవత్సరం మిగిలిన కాలానికి సంబంధించిన బడ్జెట్‌ను పార్లమెంటు తర్వాతి తేదీలో ఆమోదించేది. 2017లో, అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి చాలా ముందుగానే, ఫిబ్రవరి 1న సాధారణ బడ్జెట్‌ను ప్రవేశపెట్టి, మార్చి నెలాఖరులోగా పార్లమెంటు ఆమోదం పొందే పద్ధతిని ప్రారంభించారు. 2020లో కొడవి మహమ్మారి వంటి ప్రత్యేక పరిస్థితులలో, పార్లమెంటు మొదటి సమావేశం 60వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మే 13, 2012న పార్లమెంటు ఆదివారాల్లో కూడా సమావేశమైంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com